www.udyamakeratam.com

PRGI No. : TGTEL/25/A0273

1వ వార్షికోత్సవం

# ఉద్యమ కెరటం

నిజం రక్షతి రక్షితః

UDYAMA KERATAM TELUGU DAILY

తెలుగు దినపత్రిక

| ఆసిఫాబాద్ | సంపుటి: 2 | సంచిక: 116 | 15-10-2026 | గురువారం | పేజీలు: 8 | వెల : రూ.2/- |

## దేశాన్ని తప్పుదోవ పట్టించొద్దు..

- రాహుల్‌కు బీజేపీ హితవు!
- బీజేపీ జాతీయ మీడియా కన్వీనర్ ఆశీష్ ఉషా అగర్వాల్ విమర్శలు



4

## 'కాక్రోచ్'పై కాదు.. సమస్యలపై దృష్టిపెట్టండి

కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే కేంద్ర ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. తమ పార్టీ నేతలు సౌరవ్ దాస్, అశుతోష్ రంకాలకు 5 రోజుల కస్టడీ విధించడాన్ని ఆయన తీవ్రంగా తప్పుబట్టారు. దేశంలో త్రివర్ణ పతాకాన్ని ప్రదర్శించినందుకు వారిని తిహాడ్ జైలుకు తరలించడం దారుణమని ఆరోపించారు. నిరసన తెలపడం రాజ్యాంగం ప్రజలకు కల్పించిన ప్రాథమిక హక్కు అని, దానిని ఎవరూ అడ్డుకోలేరని అన్నారు.



4



## 'సర్' లేకున్నా ఓడారు

- ఓటములకు వ్యవస్థలపై నిందలా?
- రాహుల్ గాంధీపై కేంద్ర హోంమంత్రి అమిత్ షా విమర్శల దాడి

..వివరాలు 4లో

## నవతరం అభివృద్ధికి 'సమాఖ్య'లు

# ఆదర్శం

సమాఖ్య అనే పదంలోనే ఎంతో బలం దాగుంది



## ఆ స్ఫూర్తితోనే యువతను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దాలి

- కార్పొరేట్ సేవలు దాటి, ప్రపంచ స్థాయి పరిశ్రమలు స్థాపించాలి
- రాష్ట్ర ఆర్థికాభివృద్ధి లక్ష్యాల్లో మీరూ భాగస్వాములు కావాలి
- సమాఖ్య బిజినెస్ సమ్మిట్‌లో సీఎం రేవంత్ రెడ్డి పిలుపు




యువత, మహిళలు కార్పొరేట్ కంపెనీల్లో కేవలం ఉద్యోగులుగానే మిగిలిపోకుండా, ప్రపంచస్థాయిలో పెట్టుబడులు పెట్టే గ్లోబల్ లీడర్లుగా ఎదగాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. 'సమాఖ్య బిజినెస్ సమ్మిట్-2026'లో ఆయన ప్రసంగించారు. సమాఖ్య అనే పదంలోనే ఎంతో బలం దాగుందని పేర్కొన్న సీఎం.. రాష్ట్రంలో పరిశ్రమల స్థాపనకు ముందుకొచ్చే వారికి తమ ప్రభుత్వం పూర్తి అండగా నిలుస్తుందని స్పష్టం చేశారు.

**హైదరాబాద్, అక్టోబర్ 14 (ఉద్యమ కెరటం):** సమాఖ్య అనే పదానికి ఎంతో బలం ఉందని, ఆధునిక యుగంలో వస్తున్న మార్పులను అందిపుచ్చుకోవడానికి ఇలాంటి వేదికలు ఎంతగానో ఉపయోగపడతాయని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. హైదరాబాద్‌లోని హైటెక్స్‌లో

మిగతా 2 లో



## పెట్టుబడులకు పూర్తి భద్రత

- ప్రభుత్వ విధానాల్లో స్థిరత్వం
- సీఎం రేవంత్ రెడ్డి.. బ్రిటన్ 'యార్క్‌షైర్' మేయర్ల బృందంతో భేటీ

2

## విద్యుత్ కోతలపై సీఎం ఫైర్!

అధికారులకు సస్పెన్షన్ తప్పదని తీవ్ర హెచ్చరిక



## సింగరేణి కార్మికుల త్యాగాలు

# మరువలేం

### తెలంగాణ ఉద్యమంలో వారి పాత్ర ఎంతో కీలకం

- కేసీఆర్‌కు వెన్నంటి నిలిచిన కార్మిక లోకం
- ఉత్పత్తిలోనే కాదు.. ఉద్యమాల్లోనూ ముందంజ
- 42 రోజుల పాటు ఉత్పత్తి నిలిపివేసి సత్తా చాటారు
- గోదావరిఖని కార్మిక గర్జనలో మాజీ మంత్రి కేటీఆర్

3



సింగరేణి కార్మికుల త్యాగాలను, తెలంగాణ మలిదశ ఉద్యమంలో వారు పోషించిన అద్భుత పాత్రను ఎప్పటికీ మరిచిపోలేమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు.



3

## రేవంత్ రెడ్డి.. పాలమూరు ద్రోహి!

మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీశ్ రావు

గ్లోబల్ సమ్మిట్‌కు రండి..

## పెట్టుబడులు పెట్టండి



3

పారిశ్రామికవేత్తలకు మంత్రి శ్రీధర్ బాబు పిలుపు

- డిసెంబర్ 7 నుంచి 'తెలంగాణ గ్లోబల్ రైజింగ్ సమ్మిట్'
- 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థే లక్ష్యం
- ఐటీ, ఫార్మా, ఏఐ, రక్షణ రంగాల అభివృద్ధికి పెద్దపీట

## శవం ముందు.. ఆస్తి పంచాయితీ!

ఎకరంన్నర భూమి, ఇంటి కోసమే వివాదం

వేములవాడలో స్థానికులను విస్మయానికి గురిచేసిన ఘటన

3

## ఆధ్యాత్మికం ముసుగులో 'కీచక' గురూజీ!

జూబ్లీహిల్స్ 'శ్రీ చైతన్య గురూజీ'పై కేసు నమోదు

## ప్రాణం తీసిన మండి బిర్యానీ!



### నర్సాపూర్‌లో ఫుడ్ పాయిజన్ కలకలం

- 'వన్ ప్యాలెస్' రెస్టారెంట్‌లో వికటించిన ఆహారం
- 19 ఏళ్ల యువకుడు సాయిరాం మృతి
- మరో 15 మందికి తీవ్ర అస్వస్థత.. ఆస్పత్రిలో చికిత్స

.. వివరాలు 3లో

ఉద్యమ కెరటం
తెలుగు దినపత్రిక

గురువారం
15 అక్టోబర్ 2026



# విద్యుత్ కోతలపై సీఎం ఫైర్!

**అధికారులకు సస్పెన్షన్ తప్పదని తీవ్ర హెచ్చరిక**

**స్పెషల్ సీఎస్, జెన్‌కో సీఎండీని సైతం ఉపేక్షించను**

**యాదాద్రి ప్లాంట్‌లో పూర్తిస్థాయి ఉత్పత్తి ఎందుకు జరగట్లేదు?**

**ఎల్నినో ముప్పును ఎదుర్కొనేందుకు ముందస్తు యాక్షన్ ప్లాన్**

**క్షేత్రస్థాయి పర్యవేక్షణకు మండలానికో గ్రూప్-1, గ్రూప్-2 అధికారి**

**హైదరాబాద్, అక్టోబర్ 14 (ఉద్యమ కెరటం):** రాష్ట్రంలో విద్యుత్ కోతలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. సరఫరా సజావుగా సాగేందుకు ఎన్నిసార్లు ఆదేశించినా అధికారుల తీరు మారకపోవడంపై మండిపడ్డారు. విద్యుత్ కొరత ముప్పు పొంచి ఉన్నా, ఉత్పత్తి పెంచే చర్యలు తీసుకోకపోవడంపై అసహనం వ్యక్తం చేశారు. ప్రజలకు ఇబ్బందులు కలిగించేలా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని, అవసరమైతే స్పెషల్ సీఎస్, జెన్‌కో సీఎండీలను సైతం సస్పెండ్ చేస్తానని తీవ్ర స్థాయిలో హెచ్చరించారు. నైనీ, మహానది గనుల నుంచి బొగ్గు సరఫరాకు ఏర్పాట్లు చేసినా.. యాదాద్రి విద్యుత్ ప్లాంట్‌లో పూర్తి సామర్థ్యం మేరకు ఎందుకు ఉత్పత్తి జరగడం లేదని అధికారులను సీఎం నిలదీశారు. కరెంట్ కోతలకు గల కారణాలను వెంటనే నివేదించాలని ఆదేశించారు. పంటలను కాపాడేందుకు నిరంతర విద్యుత్ అందించాలని స్పష్టంగా చెప్పినా ఎందుకు పట్టించుకోవడం లేదని అసహనం వ్యక్తం చేశారు. ప్రజలకు జవాబుదారీగా ఉండాల్సిన బాధ్యత తనపై ఉందని, అధికారులు సైతం అంతే బాధ్యతతో విధులు నిర్వర్తించాలని చురకలంటించారు. రాష్ట్రంలో ఎల్నినో ప్రభావం, వర్షాభావ పరిస్థితులపై బుధవారం సీఎం ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. విద్యుత్, తాగునీటి సమస్యలు తీవ్రం కాకుండా పటిష్ట ప్రణాళికలు రూపొందించాలని, పశుగ్రాసం కొరత లేకుండా చూడాలని ఆదేశించారు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో నిర్మాణ రంగం సహా ఇతర అవసరాలకు మురుగునీటి శుద్ధి కేంద్రాల (ఎస్టీపీ) ద్వారా శుద్ధి చేసిన నీటినే వినియోగించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఎల్నినో పరిస్థితులను విపత్తుగా పరిగణించి ప్రజల్లో అవగాహన కల్పించాలని సీఎం అధికారులకు సూచించారు. క్షేత్రస్థాయిలో పరిస్థితులను పర్యవేక్షించేందుకు ప్రతి మండలానికి ఒక గ్రూప్-1 లేదా గ్రూప్-2 అధికారిని నియమించాలని ఆదేశించారు. మండలాలవారీగా తాగునీరు, విద్యుత్ పరిస్థితులపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి (సీఎస్) ఎప్పటికప్పుడు సమాచారం అందేలా పటిష్ట వ్యవస్థను ఏర్పాటు చేయాలని స్పష్టం చేశారు.

# ప్రజల ఖాతాల్లోకి రూ.1.64 లక్షల కోట్లు!

**మూడేళ్ల సంక్షేమ లెక్కలపై ఎవరితోనైనా చర్చకు సిద్ధం**

**1.06 కోట్ల కుటుంబాలకు సంక్షేమ ఫలాలు**

**రాష్ట్ర రహదారుల నిర్మాణానికి రూ.90 వేల కోట్లు**

**అచ్చంపేట అభివృద్ధికి, పర్యాటకానికి ప్రత్యేక ప్రాధాన్యం**

**మన్ననూర్‌లో సబ్‌స్టేషన్‌కు శంకుస్థాపన చేసిన భట్టి**



**మన్ననూర్, అక్టోబర్ 14 (ఉద్యమ కెరటం):** రాష్ట్రంలో మూడేళ్లలో వివిధ సంక్షేమ పథకాల ద్వారా రూ.1,64,431 కోట్లను నేరుగా ప్రజల ఖాతాల్లోనే జమ చేశామని ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క వెల్లడించారు. ఈ లెక్కలపై ఎవరితోనైనా చర్చకు సిద్ధంగా ఉన్నానని ఆయన స్పష్టం చేశారు. అచ్చంపేట నియోజకవర్గంలో రూ.74.82 కోట్ల అభివృద్ధి పనులకు బుధవారం ఆయన శంకుస్థాపన చేశారు. మన్ననూరులో 220/33 కేవీ సబ్ స్టేషన్‌కు శంకుస్థాపన చేసిన అనంతరం నిర్వహించిన సభలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలోని 1.15 కోట్ల కుటుంబాలకు గాను 1.06 కోట్ల కుటుంబాలు సంక్షేమ పథకాల ద్వారా ప్రయోజనం పొందుతున్నాయని భట్టి తెలిపారు. పేదల ఆహార భద్రత కోసం సన్న బియ్యం, ఆరోగ్యశ్రీ ద్వారా రూ.10 లక్షల ఉచిత వైద్యం, 43 లక్షల మందికి ఆసరా పింఛన్లు, 71.40 లక్షల మందికి రైతు భరోసా, 53 లక్షల కుటుంబాలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్, మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం అందిస్తున్నామని వివరించారు. ఇప్పటివరకు 76 వేల ప్రభుత్వ ఉద్యోగాలు కల్పించామన్నారు. ఏడు లక్షల కుటుంబాలకు 'ఇందిరమ్మ ఇళ్లు' నిర్మిస్తున్నామని, నవంబర్ 19న 'ఇందిరమ్మ జీవిత బీమా' పథకాన్ని ప్రారంభించనున్నట్లు ప్రకటించారు. రాష్ట్రవ్యాప్తంగా మౌలిక వసతులు, రహదారుల నిర్మాణానికి రూ.90 వేల కోట్లు కేటాయించినట్లు డిప్యూటీ సీఎం వెల్లడించారు. అభివృద్ధిని కేవలం హైదరాబాద్‌కే పరిమితం చేయకుండా.. అన్ని జిల్లాల్లోని వనరులకు అనుగుణంగా ప్రత్యేక ప్రణాళికలు రూపొందిస్తున్నామన్నారు. అచ్చంపేట ప్రాంతాన్ని ప్రధాన రవాణా కూడలిగా మార్చడంతో పాటు, మన్ననూరు, నల్లమల ప్రాంతాల్లో ఎకో టూరిజం అభివృద్ధికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని, తద్వారా స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయని భట్టి విక్రమార్క భరోసా ఇచ్చారు.

# నవతరం అభివృద్ధికి 'సమాఖ్య'లు ఆదర్శం!

- పర్మినెంట్ ఉద్యోగులకు రూ.1.53 లక్షల లాభాల వాటా
- కాంట్రాక్ట్ కార్మికులకు రూ.5,500 బోనస్
- 15 రోజుల్లో పెండింగ్ డిపెండెంట్ ఫైళ్లు క్లియర్
- కరోనాలో ఉద్యోగాలు కోల్పోయిన వారికి ఛాన్స్
- కార్మికుల సొంతింటి కల సాకారం చేస్తాం
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

(మొదటి పేజీ తరువాయి..)

రెండు రోజుల పాటు జరగనున్న 'సమాఖ్య బిజినెస్ సమ్మిట్-2026'ను బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. వ్యాపార రంగంలో కొత్త తరం అభివృద్ధి చెందాలన్న ఆకాంక్షతో ఈ కార్యక్రమం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. మున్నూరు కాపు సామాజికవర్గం సినిమా, రాజకీయ రంగాల్లో ఉన్నత శిఖరాలకు ఎదగడమే కాకుండా అందరికీ ఆదర్శంగా నిలిచిందని ప్రశంసించారు. ఆయా సక్సెస్ స్టోరీలను రికార్డు చేసి కొత్త తరానికి అందించాల్సిన బాధ్యత సమాఖ్యపై ఉందన్నారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 2047 నాటికి వందేళ్లు పూర్తి కాబోతున్నాయని, అప్పటికి 'వికసిత్ భారత్' సాధన లక్ష్యంగా ప్రధాని మోదీ పనిచేస్తున్నారని సీఎం గుర్తుచేశారు. కేంద్ర ప్రభుత్వ లక్ష్యాలకు రాష్ట్రాల సహకారం ఎంతో అవసరమన్నారు. ఎన్నికలప్పుడే రాజకీయాలు ఉండాలని, అభివృద్ధి విషయంలో కాదని ఆయన స్పష్టం చేశారు. ఇందులో భాగంగానే వచ్చే ఏడాది 'తెలంగాణ రైజింగ్ 2047' విజన్ డాక్యుమెంట్‌ను విడుదల చేసుకోబోతున్నామని వెల్లడించారు. 2034 నాటికి రాష్ట్రాన్ని ఒక ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా, 2047 నాటికి మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దడమే తమ ప్రభుత్వ లక్ష్యమని ప్రకటించారు.

### కొత్త మోడల్.. క్యూర్, ప్యూర్, రేర్..

ఆర్థిక లక్ష్యాల సాధన కోసం రాష్ట్రాన్ని మూడు భాగాలుగా విభజించి అభివృద్ధి చేయనున్నట్లు ముఖ్యమంత్రి వివరించారు. ఔటర్ రింగ్ రోడ్డు లోపలి ప్రాంతాన్ని క్యూర్ (కోర్ అర్బన్ రీజియన్ ఎకానమీ)గా అభివృద్ధి చేస్తూ ఐటీ, సేవారంగాలు, అత్యాధునిక టెక్నాలజీ ఆవిష్కరణలకు ప్రాధాన్యమిస్తామన్నారు. ఔటర్ నుంచి రీజినల్ రింగ్ రోడ్డు వరకు ఉన్న ప్రాంతాన్ని ప్యూర్ (పెరీ అర్బన్ రీజియన్ ఎకానమీ) కింద పారిశ్రామిక పార్కులు, తయారీ, లాజిస్టిక్స్ రంగాలకు కేటాయిస్తామన్నారు. మిగిలిన ప్రాంతాలను రేర్ (రూరల్ అగ్రికల్చర్ రీజియన్ ఎకానమీ) కింద వ్యవసాయం, ఫుడ్ ప్రాసెసింగ్ తదితర గ్రామీణ ఉపాధి రంగాలకు అనువుగా తీర్చిదిద్దుతామని వివరించారు. తెలంగాణను ప్రపంచ పెట్టుబడులకు గమ్యస్థానంగా మార్చాలన్నదే ప్రభుత్వ సంకల్పమని సీఎం ఉద్ఘాటించారు. ప్రస్తుతం దేశ జీడీపీలో రాష్ట్ర వాటా 5 శాతం ఉందని, దీనిని 10 శాతానికి చేర్చాలనే పట్టుదలతో పనిచేస్తున్నామని తెలిపారు. నాలుగు వందల ఏళ్ల క్రితమే దేశవిదేశాల నుంచి వచ్చే పారిశ్రామికవేత్తలకు చార్మినార్ ల్యాండ్ మార్క్‌గా ఉండేదని, ఇప్పుడు హైటెక్ సిటీ ఆ స్థానాన్ని భర్తీ చేసిందన్నారు. నూతన పారిశ్రామిక విధానంలో అంతా భాగస్వాములు కావాలని కోరారు. మన వాళ్లు కేవలం కార్పొరేట్ కంపెనీలకు సేవలు అందించే స్థాయికే పరిమితం కాకుండా, పెట్టుబడులు పెట్టి గ్లోబల్ స్థాయికి ఎదగాలని పిలుపునిచ్చారు.

### మహిళా భాగస్వామ్యంతోనే బలోపేతం

ప్రపంచాన్ని గమనిస్తే మహిళల భాగస్వామ్యం ఉన్న దేశాలే ఆర్థికంగా బలపడ్డాయని సీఎం గుర్తుచేశారు. తెలంగాణలో



మహిళలకు రూ.61 వేల కోట్ల బ్యాంకు లింకేజీ రుణాలు అందించామని, ఆర్టీసీ బస్సులు, పెట్రోల్ బంకులు, సోలార్ ప్లాంట్స్ కు వారిని యజమానులను చేశామని వివరించారు. సమాఖ్య ఆధ్వర్యంలో యువతతో పాటు మహిళలను ఎక్కువగా ప్రోత్సహించాలని సూచించారు. పరిశ్రమల స్థాపనకు ప్రభుత్వ సహకారం, పెట్టుబడులకు భరోసా పూర్తిగా ఉంటుందని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఏపీ శాసనసభ డిప్యూటీ స్పీకర్ కే.రఘురామరాజు, ఎంపీలు డాక్టర్ కే.లక్ష్మణ్, ప్రభుత్వ సలహాదారు వీ.హనుమంతరావు, వేం నరేందర్ రెడ్డి, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, ఎమ్మెల్యేలు గంటా శ్రీనివాసరావు, దానం నాగేందర్, మున్నూరు కాపు ఫౌండేషన్ చైర్మన్ బొమ్మ శ్రీరాం చక్రవర్తి, జస్టిస్ భవానీప్రసాద్, కరీంనగర్ గ్రంథాలయ సంస్థ చైర్మన్ సత్తు మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

# పెట్టుబడులకు పూర్తి భద్రత.. మాదే పూచీ!

- ప్రభుత్వ విధానాల్లో స్థిరత్వం
- త్వరలో 'ఫ్యూచర్ సిటీ' మాస్టర్ ప్లాన్
- సీఎం రేవంత్ రెడ్డి
- బ్రిటన్ 'యార్క్‌షైర్' మేయర్ల బృందంతో భేటీ

**హైదరాబాద్, అక్టోబర్ 14 (ఉద్యమ కెరటం):** తెలంగాణలో పెట్టుబడులకు పూర్తి భద్రత ఉంటుందని, తమ ప్రభుత్వ విధానాల్లో స్థిరత్వం కొనసాగుతుందని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి బ్రిటన్ వ్యాపార, పారిశ్రామిక ప్రతినిధులకు భరోసా ఇచ్చారు. రాష్ట్రంలో పెట్టుబడులకు అనుకూలమైన వాతావరణం, నైపుణ్యం కలిగిన మానవ వనరులు పుష్కలంగా ఉన్నాయని తెలిపారు. బుధవారం డాక్టర్ మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థ (ఎంసీఆర్ హెచ్ఆర్డీ)లో బ్రిటన్‌లోని యార్క్‌షైర్ ప్రాంతానికి చెందిన మేయర్ల నేతృత్వంలోని ఉన్నతస్థాయి ప్రతినిధి బృందం సీఎం రేవంత్‌తో సమావేశమైంది. ఈ బృందంలో సౌత్ యార్క్‌షైర్ మేయర్ ఆలివర్ కాపార్డ్, యార్క్ అండ్ నార్త్ యార్క్‌షైర్ మేయర్ డేవిడ్ స్కైత్, వెస్ట్ యార్క్‌షైర్ మేయర్ ట్రేసీ బ్రాబిన్ ఉన్నారు. దేశంలో యువ రాష్ట్రమైన తెలంగాణ.. అనతికాలంలోనే ఐటీ, ఫార్మా, ఏరోస్పేస్, రక్షణ రంగాల్లో ప్రత్యేక గుర్తింపు సాధించిందని, ఇప్పుడు ప్రపంచంలోని అభివృద్ధి చెందిన నగరాలతో పోటీ పడుతోందని సీఎం రేవంత్ రెడ్డి వివరించారు. డిసెంబర్ 7 నుంచి 'భారత్ ఫ్యూచర్ సిటీ'లో నిర్వహించనున్న ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్‌కు రావాలని బ్రిటన్ ప్రతినిధులను సీఎం ఆహ్వానించారు. మాజీ ప్రధాని టోనీ బ్లెయిర్ నాలెడ్జ్ పార్ట్‌నర్‌గా రూపొందించిన 'తెలంగాణ రైజింగ్-2047' విజన్ డాక్యుమెంట్‌ను వారికి వివరించారు. కృత్రిమ మేధ (ఏఐ)



విస్తరిస్తున్న నేపథ్యంలో ఆధునిక పరిశ్రమలకు అవసరమైన మానవ వనరుల కోసం 'యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ'ని ఏర్పాటు చేశామన్నారు. 30 వేల ఎకరాల్లో నిర్మించనున్న భారత్ ఫ్యూచర్ సిటీ మాస్టర్ ప్లాన్‌ను త్వరలో ఆవిష్కరిస్తామని, మూసీ నది పునరుజ్జీవం ద్వారా రివర్ ఫ్రంట్, నైట్ ఎకానమీని అభివృద్ధి చేయనున్నామని సీఎం వెల్లడించారు.

### కలిసి పనిచేస్తాం: బ్రిటన్ ప్రతినిధులు

సీఎం వివరించిన ప్రణాళికలు, రాష్ట్రంలోని డిజిటల్ ఆర్థిక వ్యవస్థ తమను ఎంతగానో ఆకట్టుకున్నాయని సౌత్ యార్క్‌షైర్ మేయర్ ఆలివర్ కాపార్డ్ ప్రశంసించారు. అడ్వాన్స్‌డ్ మాన్యుఫ్యాక్చరింగ్, డిజిటల్ టెక్నాలజీ, రక్షణ, ఏరోస్పేస్, టెక్నికల్ టెక్స్‌టైల్స్ తదితర రంగాల్లో తెలంగాణతో కలిసి పనిచేసేందుకు ఆసక్తిగా ఉన్నట్లు యూకే బృందం తెలిపింది. ప్రత్యక్ష వాణిజ్య ఒప్పందాల కోసం త్వరలోనే మరోసారి రాష్ట్రాన్ని సందర్శిస్తామని వెల్లడించింది. అంతకుముందు ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు యూకే బృందానికి స్వాగతం పలికి.. జీనోమ్ వ్యాలీ, ఇన్నోవేషన్ ఎకోసిస్టమ్‌ను సందర్శించాలని ఆహ్వానించారు. ఈ సమావేశంలో యూకే-ఇండియా బిజినెస్ కౌన్సిల్ రూపొందించిన 'యూకే-ఇండియా సెటా అండ్ రీజినల్ సినర్జీస్' నివేదికను సీఎం రేవంత్ రెడ్డి ఆవిష్కరించారు. కార్యక్రమంలో యూకే-ఇండియా బిజినెస్ కౌన్సిల్ సీఈవో కిషోర్ జయరామన్, బ్రిటిష్ డిప్యూటీ హైకమిషన్ ప్రతినిధులు, ప్రభుత్వ సలహాదారు సంజయ్ జాజు, కె.రామకృష్ణారావు తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# పేదలందరికీ సొంతింటి కల.. ఉచితంగా రిజిస్ట్రేషన్!

- పోచారంలో ఇందిరమ్మ టవర్స్‌కు మంత్రుల శంకుస్థాపన
- పక్షపాతం లేకుండా అన్ని నియోజకవర్గాలకు సమప్రాధాన్యం
- రూపాయి ఖర్చు లేకుండా లబ్ధిదారులకు ఇళ్ల కేటాయింపు
- భూమిలో వాటాను సైతం డాక్యుమెంట్లలో పొందుపరుస్తాం: మంత్రి పొంగులేటి
- వచ్చే దసరా నాటికి మొదటి విడత ఇళ్ల నిర్మాణం పూర్తి: మంత్రి శ్రీధర్ బాబు

**హైదరాబాద్, అక్టోబర్ 14 (ఉద్యమ కెరటం):** గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఆ కుటుంబం ప్రాతినిధ్యం వహించిన నియోజకవర్గాలకే ఇళ్ల నిర్మాణాలు పరిమితమైతే.. తమ ప్రజా ప్రభుత్వం పార్టీలకతీతంగా రాష్ట్రంలోని ప్రతి నియోజకవర్గాన్ని సమానంగా చూస్తోందని రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా పోచారంలో బుధవారం ఇందిరమ్మ ఇండ్ల టవర్స్‌కు మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు.. ఎంపీ ఈటల రాజేందర్, ఎమ్మెల్యే మల్లారెడ్డి తదితరులతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ.. హైదరాబాద్‌లో ఎకరం భూమి వందల కోట్లు ఉన్నప్పటికీ, పేదలకు వారు నివసించే ప్రాంతాల్లోనే గౌరవప్రదమైన నివాసం కల్పించాలనే లక్ష్యంతో ఇందిరమ్మ టవర్స్‌కు శ్రీకారం చుట్టామన్నారు. ఎంపికైన లబ్ధిదారులకు కేవలం కేటాయింపు పత్రాలు ఇచ్చి చేతులు దులుపుకోబోమని, ఎలాంటి రిజిస్ట్రేషన్ చార్జీలు లేకుండా



పూర్తి హక్కులతో ఇళ్లను రిజిస్ట్రేషన్ చేసి ఇస్తామని ప్రకటించారు. ప్రతి అపార్ట్‌మెంట్‌కు సంబంధించిన భూమిలో వాటాను సైతం రిజిస్ట్రేషన్‌లో పొందుపరుస్తామని స్పష్టం చేశారు. కోర్ అర్బన్ రీజియన్ (క్యూర్) పరిధిలో తొలి విడతగా లక్ష ఇళ్ల నిర్మాణం లక్ష్యంగా పెట్టుకున్నామని, ఇప్పటికే 23 నియోజకవర్గాల్లో టెండర్ల ప్రక్రియ పూర్తయిందని పొంగులేటి తెలిపారు. మేడ్చల్ నియోజకవర్గంలో 480 మంది లబ్ధిదారులను లాటరీ ద్వారా ఎంపిక చేశామన్నారు. రాష్ట్రవ్యాప్తంగా తొలి విడతలో 4.50 లక్షల ఇళ్లు మంజూరు చేయగా, రెండో విడతలో మరో 2.50 లక్షల ఇళ్లకు త్వరలోనే దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు. గత ప్రభుత్వం అసంపూర్తిగా వదిలేసిన ఇళ్లను సైతం పూర్తి చేసి అర్హులకు అందిస్తామని, ఇప్పటికే ఉన్న 2బీహెచ్‌కే కాలనీల్లో రూ.440 కోట్లతో మౌలిక వసతులు కల్పిస్తామని హామీ ఇచ్చారు.

### వచ్చే దసరాకు గృహ ప్రవేశాలు: శ్రీధర్ బాబు

మొదటి దశలో కేటాయించిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాన్ని ఏడాదిలోగా పూర్తి చేసి, వచ్చే దసరా నాటికి లబ్ధిదారులకు అందజేస్తామని మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు వెల్లడించారు. పోచారంలో సింగిల్ బెడ్‌రూమ్ కొనాలన్నా రూ.40 లక్షలు ఖర్చవుతుందని, అలాంటిది కేవలం రూ.6 లక్షలు భరిస్తే అంతకంటే విలువైన ఇళ్లను నిర్మించి ఇస్తున్నామన్నారు. గత ప్రభుత్వంలోలా ఏళ్ల తరబడి నిర్మాణాలు సాగదీసే ప్రసక్తే లేదని, ఇళ్ల కేటాయింపుల్లో ఎలాంటి పైరవీలకు తావులేకుండా లాటరీ పద్ధతిలో పారదర్శకంగా పంపిణీ చేస్తున్నామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ మహేందర్‌రెడ్డి, హౌసింగ్ ఎండీ వీపీ గౌతమ్, కలెక్టర్ మనూచౌదరి తదితరులు పాల్గొన్నారు.

# సింగరేణి కార్మికుల త్యాగాలు మరువలేం!

- తెలంగాణ ఉద్యమంలో వారి పాత్ర ఎంతో కీలకం
- కేసీఆర్‌కు వెన్నంటి నిలిచిన సింగరేణి కార్మిక లోకం
- ఉత్పత్తిలోనే కాదు.. ఉద్యమాల్లోనూ ముందంజ
- 42 రోజుల పాటు ఉత్పత్తి నిలిపివేసి సత్తా చాటారు
- గోదావరిఖని కార్మిక గర్జనలో కేటీఆర్



**గోదావరిఖని, అక్టోబర్ 14 (ఉద్యమ కెరటం):** సింగరేణి కార్మికుల త్యాగాలను, తెలంగాణ మలిదశ ఉద్యమంలో వారు పోషించిన అద్భుత పాత్రను ఎప్పటికీ మరిచిపోలేమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. రాష్ట్ర సాధన కోసం కేసీఆర్ చేపట్టిన ఉద్యమానికి సింగరేణి కార్మికులు బలంగా అండగా నిలిచారని గుర్తుచేశారు. రామగుండం గోదావరిఖనిలోని సింగరేణి స్టేడియంలో జరిగిన 'సింగరేణి కార్మిక గర్జన' సభలో ఆయన పాల్గొని ప్రసంగించారు. సింగరేణి సంస్థకు 137 ఏళ్ల ఘన చరిత్ర ఉందని, ఆ ప్రస్థానంలో కార్మికుల శ్రమ, త్యాగాలు అంతర్భాగమని కేటీఆర్ పేర్కొన్నారు. చీకటి గనుల్లో ప్రాణాలకు తెగించి పనిచేస్తూ దేశానికి వెలుగులు పంచుతున్న కార్మికులకు శిరస్సు వంచి నమస్కరిస్తున్నానని తెలిపారు. బొగ్గు ఉత్పత్తిలోనే కాకుండా ఉద్యమాల్లోనూ సింగరేణి కార్మికులు ముందున్నారన్నారు. కేసీఆర్ పిలుపు మేరకు సకల జనుల సమ్మెలో 35 రోజులు, మరోసారి 7 రోజులు.. ఇలా మొత్తం 42 రోజులపాటు బొగ్గు ఉత్పత్తిని నిలిపివేసి తెలంగాణ ఉమ్మడి పోరాటంలో సత్తా చాటారని కొనియాడారు. అప్పట్లో ఆ సమ్మె కారణంగా దక్షిణాది రాష్ట్రాల్లో విద్యుత్ సరఫరాపై తీవ్ర ప్రభావం పడిందని గుర్తుచేశారు. కేసీఆర్ ఆమరణ నిరాహార దీక్ష చేపట్టిన సమయంలోనూ కార్మికులు ఆయనకు మద్దతుగా ఉద్యమించారని తెలిపారు. సాధారణంగా ఏ కార్మిక సంఘాలైనా కేవలం వేతనాలు, బోనస్‌లు, హక్కుల కోసమే పోరాడతాయని, కానీ తెలంగాణలో మాత్రం ప్రత్యేక రాష్ట్రం కోసం ఉద్యమించాయని ప్రశంసించారు. అలాంటి అద్భుతమైన పోరాట చరిత్ర కలిగిన గడ్డ ఈ గోదావరిఖని అని కేటీఆర్ పేర్కొన్నారు. కరీంనగర్‌లో వస్తున్నప్పుడు మాజీ ఎమ్మెల్యే సతీశ్ బాబు తనను ఆపి.. 'గడ్డం ఎందుకు పెంచావు?' అని అడిగారని కేటీఆర్ చెప్పుకొచ్చారు. తాను గోదావరిఖనికి వెళ్తున్నానని చెప్పగా.. 'సింగరేణికి వెళ్తున్నప్పుడు ఆ మాత్రం రఫ్ లుక్ ఉండాల్సిందే' అని ఆయన అన్నట్లు కేటీఆర్ సరదాగా వివరించారు.

# రేవంత్ రెడ్డి.. పాలమూరు ద్రోహి!

- కాంగ్రెస్ పాలనలో మళ్లీ మొదలైన వలసలు
- కర్ణాటకలో ప్రమాదానికి గురైన గద్వాల కూలీలు
- బాధిత కుటుంబాలకు హరీశ్ రావు పరామర్శ, ఆర్థిక సాయం
- గట్టు సబ్‌స్టేషన్ తనిఖీ.. లాగ్‌బుక్‌లో 7 గంటల కరెంటే!



**గద్వాల, అక్టోబర్ 14 (ఉద్యమ కెరటం):** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాలనలో పాలమూరు జిల్లాకు పాత వలసల రోజులు మళ్లీ వచ్చాయని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీశ్ రావు తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. సొంత జిల్లాలో సాగునీరు, కరెంట్ లేక రైతులు, కూలీలు పొట్టచేతపట్టుకుని వలసపోతుంటే.. సీఎం రేవంత్ 'పాలమూరు ద్రోహి'గా మిగిలిపోయారని విమర్శించారు. గద్వాల జిల్లా ఇందువాసి గ్రామం నుంచి కూలి పనుల కోసం కర్ణాటకకు వలస వెళ్లి రోడ్డు ప్రమాదంలో మరణించిన ఏసేపు, నాగన్న కుటుంబాలను బుధవారం ఆయన పరామర్శించారు. బీఆర్ఎస్ తరఫున ఆర్థిక సాయం అందజేశారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి మృతుల కుటుంబాలకు రూ.10 లక్షల పరిహారం, క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని డిమాండ్ చేశారు. కేసీఆర్ హయాంలో బొంబాయి, దుబాయ్ వలసపోయిన వారు సైతం వాపస్ వచ్చి వ్యవసాయం చేసుకున్నారని, కాంగ్రెస్ అసమర్థత వల్లే మళ్లీ వలసలు మొదలయ్యాయని దుయ్యబట్టారు.

## లాగ్‌బుక్ సాక్షిగా కరెంట్ కోతలు..

వ్యవసాయానికి విద్యుత్ సరఫరా కావడం లేదన్న రైతుల ఆవేదనతో హరీశ్ రావు.. గట్టు మండల విద్యుత్ సబ్‌స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. అక్కడి లాగ్‌బుక్ పరిశీలించగా రైతులకు కేవలం 7 గంటల 50 నిమిషాలు మాత్రమే కరెంట్ ఇచ్చినట్లు రికార్డుల్లో తేలిందన్నారు. అది కూడా మూడుసార్లు ట్రిప్ చేశారని, దీంతో పంటలు నిలువునా ఎండిపోతున్నాయని మండిపడ్డారు. ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో-17తో 24 గంటల ఉచిత విద్యుత్‌కు కాంగ్రెస్ ఉరి వేసిందని విమర్శించారు. రైతుల మోటార్లకు కేవలం పగలు మాత్రమే కరెంట్ ఇచ్చేలా చీకటి జీవో తెచ్చారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రాజెక్టుల్లో నీళ్లున్నా.. మోటార్లు నడపడం చేతగాక కరువు సృష్టిస్తున్నారని విమర్శించారు.

## పురుగుల అన్నం పెడుతున్నరు సార్..

హరీశ్ రావు కాన్వాయ్‌ను ఇందువాసి గ్రామంలో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు ఆపి తమ గోడు వెళ్లబోసుకున్నారు. మధ్యాహ్న భోజనంలో పురుగుల అన్నం పెడుతున్నారని, ప్రతిరోజూ వంకాయ కూరే వండుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బడిలో సబ్జెక్ట్ టీచర్లు లేరని, వసతులు లేక చదువుకోవడానికి ఇబ్బందిగా ఉందని ఫిర్యాదు చేశారు. కరువు కారణంగా తమ తల్లిదండ్రులతో పాటు కూలి పనులకు వెళ్లాల్సి వస్తోందని కన్నీరుపెట్టుకున్నారు. స్పందించిన హరీశ్ రావు.. ఈ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని విద్యార్థులకు భరోసా ఇచ్చారు.

# గ్లోబల్ సమ్మిట్‌కు రండి.. పెట్టుబడులు పెట్టండి!

**పారిశ్రామికవేత్తలకు మంత్రి శ్రీధర్ బాబు పిలుపు**

**డిసెంబర్ 7 నుంచి 'తెలంగాణ గ్లోబల్ రైజింగ్ సమ్మిట్'**

**2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థే లక్ష్యం**

**ఐటీ, ఫార్మా, ఏఐ, రక్షణ రంగాల అభివృద్ధికి పెద్దపీట**

**హైదరాబాద్, అక్టోబర్ 14 (ఉద్యమ కెరటం):** తెలంగాణ రైజింగ్-2047 విజన్‌కు అనుగుణంగా డిసెంబర్ 7 నుంచి రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించనున్న 'తెలంగాణ గ్లోబల్ రైజింగ్ సమ్మిట్-2026'లో పారిశ్రామికవేత్తలు, పెట్టుబడిదారులు, ఆవిష్కర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు పిలుపునిచ్చారు.



సమాఖ్య ఛాంబర్ ఆఫ్ కామర్స్ ఆధ్వర్యంలో బుధవారం జరిగిన 'సమాఖ్య గ్లోబల్ బిజినెస్ మీట్-2026'కు ఆయన గౌరవ అతిథిగా హాజరై ప్రసంగించారు. తెలంగాణలో పెట్టుబడులు పెట్టి 'రైజింగ్ తెలంగాణ' లక్ష్య సాధనలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు.

## రాష్ట్రవ్యాప్తంగా పారిశ్రామికాభివృద్ధి..

రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్లకు చేర్చాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నట్లు మంత్రి శ్రీధర్ బాబు వెల్లడించారు. ఇందుకోసం రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల్లో అభివృద్ధి, నూతన పరిశ్రమల ఏర్పాటు, వ్యాపారాలకు అనుకూలమైన వాతావరణం కల్పించడంపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. దేశ ఆర్థికాభివృద్ధిలో తెలంగాణ మరింత కీలక పాత్ర పోషించేలా పరిశ్రమలు, నూతన సాంకేతికతలు, ఆవిష్కరణలకు విశేష ప్రాధాన్యం ఇస్తున్నామని స్పష్టం చేశారు. కేవలం హైదరాబాద్‌కే పరిమితం కాకుండా.. రాష్ట్రవ్యాప్తంగా ఐటీ, ఫార్మా, లైఫ్ సైన్సెస్‌తో పాటు ఏఐ, ఏరోస్పేస్, రక్షణ రంగం, తయారీ రంగం, వ్యవసాయ ఆధారిత పరిశ్రమల ఏర్పాటును ప్రోత్సహిస్తున్నట్లు మంత్రి తెలిపారు. రాష్ట్రంలో వ్యాపారాలను విస్తరించేందుకు, పెట్టుబడులు పెట్టేందుకు గ్లోబల్ రైజింగ్ సమ్మిట్ వేదికను సద్వినియోగం చేసుకోవాలని ఆయన పారిశ్రామికవేత్తలను కోరారు.




# 24న హైదరాబాద్‌లో 'ఇండియా' కూటమి భారీ సభ!

**హాజరుకానున్న అగ్రనేతలు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ**

**లక్ష మందిని సమీకరించేందుకు కాంగ్రెస్ సన్నాహాలు**

**సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌ను తొలగించే వరకు పోరాటం: మహేష్ గౌడ్**

**హైదరాబాద్, అక్టోబర్ 14 (ఉద్యమ కెరటం):** హైదరాబాద్ వేదికగా ఈ నెల 24న 'ఇండియా' కూటమి ఆధ్వర్యంలో భారీ బహిరంగ సభ నిర్వహించేందుకు కాంగ్రెస్ పార్టీ సమాయత్తమవుతోంది. ఈ ప్రతిష్ఠాత్మక సభకు కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ హాజరుకానున్నారు. సుమారు లక్ష మందిని సమీకరించి సభను విజయవంతం చేయాలని పార్టీ నాయకత్వం సన్నాహాలు చేస్తోంది. ఎస్ఐఆర్ (ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ) ప్రక్రియ, కేంద్ర ఎన్నికల సంఘం వ్యవహారశైలిపై ఈ వేదికగా దేశవ్యాప్త పోరాటానికి రూపకల్పన చేయనున్నారు.

## సీఈసీని తొలగించే వరకు పోరాటం: టీపీసీసీ చీఫ్

ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్‌ను పదవి నుంచి తొలగించే వరకు తమ పోరాటం ఆగదని టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ స్పష్టం చేశారు. ఢిల్లీలో రాహుల్ గాంధీ నివాసంలో మంగళవారం జరిగిన సమావేశంలో భవిష్యత్ కార్యాచరణపై చర్చించినట్లు తెలిపారు. ఎస్ఐఆర్ ప్రక్రియను అడ్డం పెట్టుకుని పేదలు, దళితులు, బీజేపీ వ్యతిరేకుల ఓట్లను తొలగిస్తున్నారని ఆరోపించారు. ఢిల్లీలోని జంతర్ మంతర్‌ను నిరసనల వేదిక జాబితా నుంచి తొలగించడం ప్రజాస్వామ్యాన్ని కాలరాయడమేనని ఆగ్రహం వ్యక్తం చేశారు.

## రాజకీయంగా వేడెక్కిన ఓట్ల రగడ..

తెలంగాణలో ఎస్ఐఆర్ ప్రక్రియ ద్వారా అక్రమంగా ఓట్లు తొలగించినట్లు నిరూపిస్తానని, ఇందుకు వేదిక ఎక్కడో చెప్పాలని మంత్రి పొన్నం ప్రభాకర్ బీజేపీకి సవాల్ విసిరారు. ఈ సవాల్‌ను తాను స్వీకరిస్తున్నట్లు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచందర్ రావు ప్రకటించారు. దీంతో రాష్ట్రంలో ఓట్ల తొలగింపు అంశంపై అధికార కాంగ్రెస్, బీజేపీ నేతల మధ్య మాటల యుద్ధం మరింత ముదిరింది.



# ప్రాణం తీసిన 'మండి బిర్యానీ'!

**నర్సాపూర్‌లో ఫుడ్ పాయిజన్ కలకలం**

**'వన్ ప్యాలెస్' రెస్టారెంట్‌లో వికటించిన ఆహారం**

**19 ఏళ్ల యువకుడు సాయిరాం మృతి**

**మరో 15 మందికి తీవ్ర అస్వస్థత.. ఆస్పత్రిలో చికిత్స**

**నర్సాపూర్, అక్టోబర్ 15 (ఉద్యమ కెరటం):** మెదక్ జిల్లా నర్సాపూర్‌లో ఫుడ్ పాయిజన్ ఘటన తీవ్ర కలకలం రేపింది. పట్టణంలోని 'వన్ ప్యాలెస్' రెస్టారెంట్‌లో మంగళవారం కలుషిత ఆహారం తిని ఓ యువకుడు ప్రాణాలు కోల్పోగా, పలువురు ఆస్పత్రి పాలయ్యారు. రెస్టారెంట్‌లో మండి బిర్యానీ తిన్న వారంతా ఒక్కసారిగా తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. బాధితులను హుటాహుటిన ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ సాయిరాం (19) అనే యువకుడు మృతి చెందాడు. మరో 15 మందికి వైద్యులు చికిత్స అందిస్తున్నారు. యువకుడి మరణానికి కారణమైన రెస్టారెంట్ యాజమాన్యం, చెఫ్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని బాధిత కుటుంబ సభ్యులు, స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. ఇటీవల ఫుడ్ సేఫ్టీ అధికారుల తనిఖీల్లో పలు రెస్టారెంట్ల బండారం బయటపడుతున్న సంగతి తెలిసిందే. నాసిరకం వస్తువులు, ఎక్స్‌పైరీ అయిన పదార్థాలు, ఫ్రీజర్లలో కుళ్లిన మాంసంతో అపరిశుభ్ర వాతావరణంలో వంటలు చేస్తుండటంతో.. బయట ఫుడ్ తినాలంటేనే ప్రజలు జంకుతున్నారు. ఈ క్రమంలో తాజాగా నర్సాపూర్‌లో ఏకంగా ఓ యువకుడి ప్రాణం పోవడం తీవ్ర ఆందోళనకు గురిచేస్తోంది.

# శవం ముందు.. ఆస్తి పంచాయితీ!

**మానవీయ విలువలు మంటగలిపిన వైనం**

**తలకొరివి పెట్టే హక్కుపై ఇరువర్గాల పట్టు**

**గంటల తరబడి ఇంట్లోనే వృద్ధుడి మృతదేహం**

**ఎకరంన్నర భూమి, ఇంటి కోసమే వివాదం**

**వేములవాడలో స్థానికులను విస్మయానికి గురిచేసిన ఘటన**



**వేములవాడ, అక్టోబర్ 14 (ఉద్యమ కెరటం):** కుటుంబ బంధాలు, మానవీయ విలువలు మంటగలిశాయి. ఇంట్లో పెద్దదిక్కు మరణిస్తే.. కడసారి వీడ్కోలు పలకాల్సింది పోయి ఆస్తి కోసం ఆ మృతదేహం ముందే కుటుంబ సభ్యులు పంచాయితీకి దిగారు. రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ మున్సిపాలిటీ పరిధిలోని 13వ వార్డు కోనాయిపల్లిలో జరిగిన ఈ అమానవీయ ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. కోనాయిపల్లికి చెందిన కొంకటి చంద్రయ్య (80) సోమవారం అనారోగ్యంతో మృతి చెందారు. ఆయన భార్య, ఏకైక కుమారుడు నాగరాజు గతంలోనే కన్నుమూశారు. కాగా, నాగరాజుకు ఇద్దరు భార్యలు. వృద్ధాప్యంలో ఉన్న చంద్రయ్యకు ఇన్నాళ్లూ నాగరాజు రెండో భార్య, ఆమె కుమార్తెలే సేవలు చేస్తూ వచ్చారు. చంద్రయ్య పేరిట గ్రామంలో ఎకరంన్నర వ్యవసాయ భూమి, ఒక ఇల్లు ఉంది. చంద్రయ్య మరణించడంతో.. ఇన్నాళ్లూ తామే సేవలు చేశామని, తలకొరివి పెట్టే అవకాశం తమకే ఇవ్వాలని రెండో భార్య కుటుంబం పట్టుబట్టింది. దీనికి చంద్రయ్య ముగ్గురు కుమార్తెలు అభ్యంతరం తెలిపారు. సంప్రదాయం ప్రకారం మొదటి భార్య కుమారుడికే ఆ హక్కు ఇవ్వాలని వాదనకు దిగారు. వాస్తవానికి ఆస్తి దక్కించుకునేందుకే తలకొరివి పేరిట ఈ వివాదానికి దిగినట్లు తెలుస్తోంది. అంత్యక్రియల విషయాన్ని పక్కనపెట్టి.. మృతదేహాన్ని గంటల తరబడి ఇంట్లోనే ఉంచి కుటుంబ సభ్యులు వాదులాటకు దిగడం గ్రామస్తులను విస్మయానికి గురిచేసింది.

# ఆధ్యాత్మికం ముసుగులో 'కీచక' గురూజీ!

**సాఫ్ట్‌వేర్ ఉద్యోగి భార్యకు అసభ్య సందేశాలు**

**నిలదీసిన భర్తకు చంపేస్తానంటూ బెదిరింపులు**

**జూబ్లీహిల్స్ 'శ్రీచైతన్య గురూజీ'పై కేసు నమోదు**

**కోర్టు ఆదేశాలతో దర్యాప్తు చేపట్టిన పోలీసులు**

**హైదరాబాద్, అక్టోబర్ 14 (ఉద్యమ కెరటం):** ఆధ్యాత్మిక సాధన పేరుతో ఓ మహిళ పట్ల అసభ్యంగా ప్రవర్తించడమే కాకుండా.. నిలదీసిన ఆమె భర్తను చంపేస్తానని బెదిరించిన ఓ గురూజీ బాగోతం హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్‌లో వెలుగుచూసింది. బాధితుడు ఆధారాలతో న్యాయస్థానాన్ని ఆశ్రయించడంతో.. కోర్టు ఆదేశాల మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. జూబ్లీహిల్స్ రోడ్ నంబర్ 71లో మేరెడ్డి సునీల్‌రెడ్డి అలియాస్ 'శ్రీచైతన్య గురూజీ'.. 'శ్రీవిద్యా సాధనా సెంటర్' పేరుతో ఓ కేంద్రాన్ని నిర్వహిస్తున్నాడు. స్రవంతి నగర్‌కు చెందిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగి విష్ణుదీప్‌రెడ్డి భార్య మానసిక ప్రశాంతత కోసం అక్కడికి వెళ్లేది. ఇదే అదనుగా ఆ గురూజీ ఆమెకు అసభ్యకరమైన మెసేజ్‌లు పంపుతూ, వ్యక్తిగతంగా చాటింగ్ చేస్తూ వేధించడం మొదలుపెట్టాడు. భార్య ఫోన్‌లో ఆ మెసేజ్‌లు చూసిన విష్ణుదీప్.. నేరుగా కేంద్రానికి వెళ్లి గురూజీని నిలదీశాడు. దీంతో తననే ప్రశ్నిస్తావా అంటూ.. మరోసారి ఇక్కడికి వస్తే ప్రాణాలతో వదిలిపెట్టనని ఆ గురూజీ బెదిరింపులకు దిగాడు. దీనికి సంబంధించిన ఆధారాలు సేకరించిన బాధితుడు కోర్టును ఆశ్రయించాడు. న్యాయస్థానం ఆదేశాల మేరకు జూబ్లీహిల్స్ పోలీసులు సునీల్‌రెడ్డిపై బీఎన్ఎస్ (భారతీయ న్యాయ సంహిత) సెక్షన్ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు ముమ్మరం చేశారు.

ఉద్యమ కెరటం
నిజం రక్షతి రక్షితః UDYAMAKERATAM TELUGU DAILY తెలుగు దినపత్రిక
గురువారం
15 అక్టోబర్ 2026

## సంపాదకీయం



# ప్రపంచ మీడియా కళ్లలో భారత్.. కనిపిస్తున్నదేంటి?

**ప్రజాస్వామ్య ప్రతిష్ఠపై అంతర్జాతీయ వార్తా సంస్థల కథనాలతో చర్చ**

**ఓటర్ల జాబితాల సవరణ నుంచి నిరసనల వరకు ప్రపంచ మీడియా దృష్టి**

**పోలీసుల చర్యలు.. పౌరుల హక్కులు.. జర్నలిస్టుల భద్రతపై ప్రశ్నలు**

**ది గార్డియన్, రాయిటర్స్, అసోసియేటెడ్ ప్రెస్ కథనాలపై ఆసక్తి**

**విదేశీ మీడియా విమర్శలన్నీ నిజాలేనా?.. అధికారిక వివరణలేమిటి?**

ప్రపంచంలో అతిపెద్ద ప్రజాస్వామ్య దేశంగా గుర్తింపు పొందిన భారత్‌ను అంతర్జాతీయ మీడియా ఎలా చూస్తోంది? దేశంలో జరుగుతున్న ఎన్నికల ప్రక్రియ, ప్రజల నిరసనలు, పోలీసుల చర్యలు, జర్నలిస్టుల భద్రత వంటి అంశాలపై విదేశీ వార్తా సంస్థలు ఎందుకు దృష్టి సారిస్తున్నాయి? ప్రపంచ వేదికలపై భారత్‌కు లభిస్తున్న ప్రశంసలతోపాటు దేశంలోని కొన్ని పరిణామాలపై వస్తున్న విమర్శలు కూడా ఇప్పుడు చర్చనీయాంశంగా మారుతున్నాయి. ది గార్డియన్, అసోసియేటెడ్ ప్రెస్, రాయిటర్స్, అల్ జజీరా, యూరోన్యూస్ వంటి అంతర్జాతీయ వార్తా సంస్థలు భారత ప్రజాస్వామ్య వ్యవస్థకు సంబంధించిన వివిధ అంశాలను తమ కథనాల్లో ప్రస్తావిస్తున్నాయి. అయితే విదేశీ మీడియా ప్రచురించిన ప్రతి కథనాన్నీ సంపూర్ణ సత్యంగా భావించడం ఎంత సరికాదో, అందులో లేవనెత్తిన ప్రశ్నలను కేవలం విదేశీ విమర్శలుగా కొట్టిపారేయడం కూడా అంతే సరికాదు. అసలు ఆయా కథనాల్లో ఉన్న ఆధారాలేమిటి? సంబంధిత అధికారుల వివరణలేమిటి? ఆరోపణలకు వాస్తవ పరిస్థితులకు మధ్య తేడా ఎంత? అన్న అంశాలను పరిశీలించాల్సిన అవసరం ఉంది. ప్రజాస్వామ్య వ్యవస్థకు ఎన్నికలే పునాది. ఓటు హక్కు వినియోగించుకునే ప్రతి పౌరుడికీ ఎన్నికల ప్రక్రియపై విశ్వాసం ఉండటం అత్యంత అవసరం. ఈ నేపథ్యంలో దేశంలోని ఓటర్ల జాబితాల ప్రత్యేక సవరణ ప్రక్రియపై రాజకీయ పార్టీలు, పౌర సంఘాలు వ్యక్తం చేస్తున్న అభ్యంతరాలు అంతర్జాతీయ మీడియా దృష్టిని ఆకర్షిస్తున్నాయి. ఓటర్ల జాబితాల్లో పెద్ద సంఖ్యలో పేర్ల తొలగింపులు, మార్పులు చోటుచేసుకున్నాయంటూ కొన్ని రాజకీయ పక్షాలు ఆరోపిస్తున్నాయి. అయితే ఎంతమంది పేర్లు తొలగించారు? ఏ రాష్ట్రాల్లో ఈ మార్పులు జరిగాయి? తొలగింపులకు అధికారిక కారణాలేమిటి? అనే వివరాలను ఎన్నికల సంఘం గణాంకాలతో పరిశీలించాల్సి ఉంది. మరణించినవారు, చిరునామాలు మారినవారు, ఒకటి కంటే ఎక్కువచోట్ల నమోదైనవారి పేర్లను తొలగించడం ఎన్నికల జాబితాల నిర్వహణలో సాధారణ ప్రక్రియే. అయితే అర్హులైన ఓటర్ల పేర్లు పొరపాటున తొలగిపోకుండా చూడటం కూడా అంతే ముఖ్యం. ఎన్నికల సంఘం చేపట్టే సవరణ ప్రక్రియ పారదర్శకంగా సాగుతోందా? పేర్లు తొలగించినప్పుడు సంబంధిత వ్యక్తులకు సమాచారం అందుతోందా? అభ్యంతరాలు తెలిపేందుకు అవకాశం కల్పిస్తున్నారా? పొరపాట్లను సరిదిద్దేందుకు సమర్థవంతమైన వ్యవస్థ ఉందా? అనే ప్రశ్నలకు స్పష్టమైన సమాధానాలు అవసరం. ఎన్నికల విశ్వసనీయతను కాపాడాలంటే ప్రక్రియ సక్రమంగా ఉండటమే కాకుండా ప్రజల్లో దానిపై నమ్మకం కూడా ఉండాలి. ప్రజాస్వామ్యంలో నిరసన తెలిపే హక్కుకు ప్రత్యేక ప్రాధాన్యం ఉంది. ప్రభుత్వ నిర్ణయాలపై అభ్యంతరాలు వ్యక్తం చేయడం, ప్రజా సమస్యలపై ఆందోళనలు నిర్వహించడం ప్రజాస్వామ్య వ్యవస్థలో భాగమే. అయితే నిరసనల సందర్భంగా శాంతిభద్రతల పరిరక్షణ పేరుతో పోలీసులు చేపట్టే చర్యలు కూడా ప్రజా చర్చకు దారితీస్తుంటాయి. ఢిల్లీలో జరిగిన కొన్ని నిరసనల సందర్భంగా ఏర్పాటు చేసిన బారికేడ్లు, భద్రతా చర్యలు, నిరసనకారులను అదుపులోకి తీసుకున్న ఘటనలు అంతర్జాతీయ వార్తా కథనాల్లో ప్రస్తావనకు వచ్చినట్లు పేర్కొంటున్నారు. అసోసియేటెడ్ ప్రెస్ వంటి వార్తా సంస్థలు నిరసనల దృశ్యాలను ప్రచురించగా, ఇతర సంస్థలు రాజకీయ పక్షాల అభ్యంతరాలు, పోలీసుల చర్యలపై వచ్చిన ఆరోపణలను వివరించాయి. అయితే ఒక నిరసనకు సంబంధించిన దృశ్యాలను మాత్రమే చూసి మొత్తం ఘటనపై నిర్ణయానికి రావడం సరికాదు. నిరసన ఎందుకు జరిగింది? పోలీసులు ఎందుకు జోక్యం చేసుకున్నారు? నిరసనకారులు ఏం చెబుతున్నారు? అధికారుల వివరణ ఏమిటి? అనే అంశాలను సమగ్రంగా పరిశీలించాలి. శాంతిభద్రతలను కాపాడటం పోలీసుల బాధ్యత అయితే, ఆ బాధ్యత నిర్వహణలో పౌరుల రాజ్యాంగబద్ధ హక్కులకు భంగం కలగకుండా చూడటం కూడా అత్యంత అవసరం. చట్టాన్ని అమలు చేయడానికీ, ప్రజల హక్కులను పరిరక్షించడానికీ మధ్య సమతుల్యత ఉండాలి. ప్రజాస్వామ్యంలో మీడియా పాత్ర కేవలం వార్తలను ప్రచురించడానికే పరిమితం కాదు. ప్రభుత్వ నిర్ణయాలను ప్రశ్నించడం, ప్రజల సమస్యలను వెలుగులోకి తీసుకురావడం, అధికారిక ప్రకటనల్లోని వాస్తవాలను పరిశీలించడం కూడా జర్నలిస్టుల బాధ్యత. అలాంటి జర్నలిస్టులే వార్తా సేకరణ సమయంలో బెదిరింపులు, అడ్డంకులు ఎదుర్కొంటున్నారనే ఆరోపణలు ఆందోళన కలిగిస్తున్నాయి. నిరసనలను కవర్ చేస్తున్న కొందరు జర్నలిస్టులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారని, వారి ఫోన్లను స్వాధీనం చేసుకున్నారని, దురుసుగా వ్యవహరించారని వచ్చిన ఆరోపణలు మీడియా స్వేచ్ఛపై చర్చకు దారితీశాయి. రాయిటర్స్ సహా అంతర్జాతీయ వార్తా సంస్థల పేరుతో ప్రస్తావనకు వచ్చిన ఈ కథనాల తేదీలు, ప్రత్యక్ష సాక్షుల వాంగ్మూలాలు, అధికారుల స్పందనలను అసలు నివేదికలతో సరిపోల్చి నిర్ధారించాల్సి ఉంది. జర్నలిస్టులు కూడా దేశంలోని చట్టాలకు లోబడే పనిచేయాలి. అయితే చట్ట అమలు పేరుతో వారి వృత్తిపరమైన విధులకు అనవసరమైన ఆటంకాలు కలిగించకూడదు. ఆరోపణలు వచ్చినప్పుడు నిష్పక్షపాత విచారణ జరపడం, ఆధారాలను పరిశీలించడం, అధికారికంగా స్పష్టత ఇవ్వడం ద్వారా మీడియా స్వేచ్ఛపై ప్రజల్లో విశ్వాసాన్ని పెంపొందించవచ్చు. అంతర్జాతీయ మీడియా ప్రచురించే ప్రతి కథనాన్ని విమర్శనాత్మకంగా పరిశీలించాల్సిన అవసరం ఉంది. ఒక వార్తా సంస్థ ప్రచురించిన కథనాన్ని మరో నాలుగు సంస్థలు తిరిగి ప్రచురించినంత మాత్రాన ఐదు సంస్థలు స్వతంత్రంగా ఆ ఘటనను నిర్ధారించినట్లు కాదు. కథనానికి మూలాధారమేమిటి? ప్రత్యక్ష సాక్షులున్నారా? అధికారిక రికార్డులు పరిశీలించారా? ఆరోపణలు ఎదుర్కొంటున్న పక్షానికి వివరణ ఇచ్చే అవకాశం కల్పించారా? అనే అంశాలను పరిగణనలోకి తీసుకోవాలి. అదే సమయంలో విదేశీ వార్తా సంస్థ ప్రచురించిందనే కారణంతో ఒక కథనాన్ని పూర్తిగా తిరస్కరించడం కూడా సమంజసం కాదు. వాస్తవాలను నిర్ధారించేందుకు ఆధారాలు, గణాంకాలు, న్యాయస్థాన రికార్డులు, సంబంధిత అధికారుల వివరణలు ఉపయోగపడతాయి. కథనం ఏ దేశానికి చెందిన సంస్థ ప్రచురించిందన్నదానికంటే అందులోని సమాచారం ఎంతవరకు నిర్ధారణకు నిలబడుతుందన్నదే ముఖ్యమైన విషయం.

# దేశాన్ని తప్పుదోవ పట్టించొద్దు..





- రాహుల్‌కు బీజేపీ హితవు!
- నిరసన తెలిపే హక్కుంది.. చట్టాన్ని ఉల్లంఘించే హక్కు లేదు
- ఎన్నికల ప్రధాన కమిషనర్ రాజీనామా డిమాండ్‌పై రాజకీయ దుమారం
- ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ రద్దు కోసం ఆందోళనలకు రాహుల్ మద్దతు
- జంతర్‌మంతర్‌పై నిబంధనల ప్రకారమే నిర్ణయం తీసుకున్నామని స్పష్టీకరణ
- బీజేపీ జాతీయ మీడియా కన్వీనర్ ఆశీష్ ఉషా అగర్వాల్ విమర్శలు

**న్యూఢిల్లీ, అక్టోబర్ 14 (ఉద్యమ కెరటం):** దేశాన్ని తప్పుదోవ పట్టించే ప్రయత్నాలు మానుకోవాలని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీకి భారతీయ జనతా పార్టీ హితవు పలికింది. కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని, ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఆందోళనలు నిర్వహిస్తున్న సీజేపీ కార్యకర్తలకు రాహుల్ గాంధీ మద్దతు ప్రకటించడాన్ని బీజేపీ తీవ్రంగా తప్పుపట్టింది. ప్రజాస్వామ్యంలో నిరసన తెలిపే హక్కు ప్రతి పౌరుడికీ ఉన్నప్పటికీ, ఆ హక్కు పేరుతో చట్టాలను ఉల్లంఘించడానికి వీల్లేదని స్పష్టం చేసింది. ఈ వ్యవహారంపై బీజేపీ జాతీయ మీడియా కన్వీనర్ ఆశీష్ ఉషా అగర్వాల్ స్పందిస్తూ రాహుల్ గాంధీ తీరుపై విమర్శలు గుప్పించారు. నిరసన తెలిపేందుకు రాజ్యాంగం హక్కు కల్పించిందని, అయితే ఆ హక్కును చట్టవిరుద్ధ కార్యకలాపాలకు ఉపయోగించుకోరాదని పేర్కొన్నారు. ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద నిరసనలకు సంబంధించి నిబంధనల ప్రకారమే నిర్ణయాలు తీసుకున్నారని తెలిపారు. చట్టానికి ఎవరూ అతీతులు కారని, రాజకీయ నాయకులైనా నిబంధనలను గౌరవించాల్సిందేనని వ్యాఖ్యానించారు. రాజకీయ ప్రయోజనాల కోసం బహిరంగ ప్రదేశాలను అల్లర్లకు కేంద్రాలుగా మార్చే ప్రయత్నాలు చేయరాదని ఆశీష్ ఉషా అగర్వాల్ హెచ్చరించారు. ప్రజాస్వామ్యబద్ధంగా అభిప్రాయాలను వ్యక్తం చేయడానికి అవకాశాలు ఉన్నాయని, అయితే నిరసనల పేరుతో శాంతిభద్రతలకు విఘాతం కలిగించడం సమంజసం కాదని పేర్కొన్నారు. చట్టాన్ని గౌరవించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ గత వైఖరిని కూడా అగర్వాల్ ప్రస్తావించారు. దశాబ్దాల పాటు కాంగ్రెస్ పార్టీ, గాంధీ కుటుంబం ఆర్టికల్ 370కు మద్దతుగా నిలిచాయని విమర్శించారు. అయితే ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం ఆర్టికల్ 370ని రద్దు చేస్తూ చారిత్రాత్మక నిర్ణయం తీసుకుందని పేర్కొన్నారు. దేశ ప్రయోజనాల విషయంలో బీజేపీ ప్రభుత్వం స్పష్టమైన నిర్ణయాలు తీసుకుంటోందని తెలిపారు. రాజకీయ ప్రయోజనాల కోసం ప్రజలను తప్పుదోవ పట్టించడం తగదని రాహుల్ గాంధీకి అగర్వాల్ సూచించారు. నిరసనల పేరుతో నిబంధనలను ఉల్లంఘించే చర్యలను సమర్థించరాదని పేర్కొన్నారు. దేశ ప్రజలు ఎప్పుడూ చట్టబద్ధమైన విధానాలకే మద్దతుగా నిలుస్తారని, రాజకీయ ప్రయోజనాల కోసం చట్టాలను పక్కన పెట్టే ప్రయత్నాలను అంగీకరించరని వ్యాఖ్యానించారు. ఎన్నికల ప్రధాన కమిషనర్ రాజీనామా, ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ రద్దు డిమాండ్ల నేపథ్యంలో కొనసాగుతున్న ఆందోళనలకు రాహుల్ గాంధీ మద్దతు ప్రకటించడంపై బీజేపీ చేసిన ఈ వ్యాఖ్యలు రాజకీయ చర్చకు దారితీశాయి.

# 'సర్' లేకున్నా ఓడారు

- ఓటములకు వ్యవస్థలపై నిందలా?
- రాహుల్ గాంధీపై కేంద్ర హోంమంత్రి అమిత్ షా విమర్శల దాడి
- రాహుల్ నాయకత్వంలో కాంగ్రెస్‌కు వరుస పరాజయాలంటూ ఎద్దేవా
- ఓటర్ల జాబితా సవరణపై ఆరోపణలతో ప్రజల విశ్వాసం పొందలేరని వ్యాఖ్య
- 2029 ఎన్నికల్లోనూ కాంగ్రెస్ ఓడిపోతుందని అమిత్ షా జోస్యం
- ప్రజల గొంతు వినాలంటే గ్రామాలకు వెళ్లాలని రాహుల్‌కు సూచన
- అమిత్ షానే ఓటు చోరీ సహరూపకర్త అంటూ కాంగ్రెస్ ఎదురుదాడి



**న్యూఢిల్లీ, అక్టోబర్ 14 (ఉద్యమ కెరటం):** ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియను అడ్డుపెట్టుకుని కాంగ్రెస్ పార్టీ తన ఎన్నికల పరాజయాలను కప్పిపుచ్చుకునేందుకు ప్రయత్నిస్తోందని కేంద్ర హోంమంత్రి అమిత్ షా తీవ్ర విమర్శలు చేశారు. ప్రత్యేక సవరణ ప్రక్రియ అమల్లోకి రాకముందు కూడా కాంగ్రెస్ అనేక ఎన్నికల్లో ఓడిపోయిందని, ఆ పరాజయాలకు ఇప్పుడు ఎన్నికల వ్యవస్థలను నిందించడం ఏమిటని ప్రశ్నించారు. రాహుల్ గాంధీ నాయకత్వంలో కాంగ్రెస్ వరుసగా ఓటములు ఎదుర్కొంటోందని వ్యాఖ్యానించారు. 2029 సార్వత్రిక ఎన్నికల్లోనూ కాంగ్రెస్‌కు పరాజయం తప్పదని జోస్యం చెప్పారు. కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ కాంగ్రెస్ చేపట్టిన ఆందోళనల అనంతరం మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో అమిత్ షా ఈ వ్యాఖ్యలు చేశారు. ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియపై కాంగ్రెస్ చేస్తున్న ఆరోపణలను అమిత్ షా తప్పుపట్టారు. కాంగ్రెస్ ఎన్నికల పరాజయాలకు ఈ ప్రక్రియను కారణంగా చూపించడం సమంజసం కాదన్నారు. సవరణ ప్రక్రియ ప్రారంభం కాకముందు జరిగిన ఎన్నికల్లోనూ కాంగ్రెస్ ఓటములు చవిచూసిందని గుర్తుచేశారు. దశాబ్దాలుగా కాంగ్రెస్ తన రాజకీయ ప్రాభవాన్ని కోల్పోతూ వస్తోందని, దీనిపై ఆత్మవిమర్శ చేసుకోవాల్సిన అవసరం ఉందని వ్యాఖ్యానించారు. పార్టీ నాయకత్వంలోని లోపాలను గుర్తించకుండా ఎన్నికల వ్యవస్థలపై ఆరోపణలు చేయడం వల్ల ప్రయోజనం ఉండదని పేర్కొన్నారు. కాంగ్రెస్ ముఖ్య నాయకుడిగా, గతంలో పార్టీ అధ్యక్షుడిగా, ప్రస్తుతం లోక్‌సభ ప్రతిపక్ష నేతగా ఉన్న రాహుల్ గాంధీ నాయకత్వంలో ఆ పార్టీ అనేక ఎన్నికల్లో పరాజయాలు ఎదుర్కొందని అమిత్ షా విమర్శించారు. ఇటీవల వివిధ రాష్ట్రాల్లో జరిగిన ఉప ఎన్నికలు, స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ కాంగ్రెస్ ఆశించిన ఫలితాలు సాధించలేకపోయిందని పేర్కొన్నారు. ప్రజలతో సంబంధం లేకుండా ప్రతికూల రాజకీయాలు చేయడం వల్ల పార్టీకి ప్రయోజనం ఉండదన్నారు. పదేపదే అవాస్తవాలు ప్రచారం చేస్తూ మీడియా దృష్టిని ఆకర్షించేందుకు ప్రయత్నించినంత మాత్రాన ప్రజల విశ్వాసం పొందలేరని వ్యాఖ్యానించారు. ఓటర్ల జాబితాల సవరణపై రాహుల్ గాంధీ అనుసరిస్తున్న వైఖరిని అమిత్ షా విమర్శించారు. చొరబాటుదారులను ఓటర్లుగా చేర్చాలనే ఆలోచన కాంగ్రెస్ నాయకత్వానికి ఉందని ఆరోపించారు. ఈ విషయంలో రాహుల్ ఉద్దేశాలను దేశ ప్రజలు గమనిస్తున్నారని వ్యాఖ్యానించారు. అయితే ఈ ఆరోపణలకు సంబంధించిన నిర్దిష్ట ఆధారాలను ఆయన వ్యాఖ్యల్లో ప్రస్తావించలేదు. ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియపై కాంగ్రెస్ వ్యక్తం చేస్తున్న అభ్యంతరాలు, ఎన్నికల సంఘం అధికారిక వివరణలు వేర్వేరుగా పరిశీలించాల్సిన అంశాలుగా ఉన్నాయి. ఢిల్లీలో జరిగిన నిరసనలను ఉద్దేశించి అమిత్ షా వ్యంగ్యాస్త్రాలు సంధించారు. 14 రాజకీయ పార్టీలకు చెందిన సుమారు ఎనిమిది వేల మంది కార్యకర్తలు ఒకటిన్నర కిలోమీటర్ల మేర గుమిగూడినంత మాత్రాన అది దేశ ప్రజలందరి అభిప్రాయంగా భావించలేమని అన్నారు. నిరసనల్లో పాల్గొన్నవారి సంఖ్య ఆధారంగా దేశ ప్రజల మనోభావాలను నిర్ణయించడం సరికాదని పేర్కొన్నారు. ప్రజల అభిప్రాయాలను తెలుసుకోవాలంటే గ్రామాలకు, వ్యవసాయ క్షేత్రాలకు, కొండ ప్రాంతాలకు వెళ్లాలని రాహుల్ గాంధీకి సూచించారు. క్షేత్రస్థాయిలో ప్రజలతో మమేకమైతేనే వారి సమస్యలు తెలుస్తాయని వ్యాఖ్యానించారు. బిహార్, ఉత్తరప్రదేశ్, తమిళనాడు సహా పలు రాష్ట్రాల్లో కాంగ్రెస్ ఎన్నికల పనితీరును అమిత్ షా ప్రస్తావించారు. ఒకప్పుడు కాంగ్రెస్‌కు బలమైన రాజకీయ పునాది ఉన్న గుజరాత్‌లోనూ ఆ పార్టీ ఎందుకు ఆశించిన విజయాలు సాధించలేకపోతోందని ప్రశ్నించారు. గత 41 ఏళ్లుగా గుజరాత్‌లో కాంగ్రెస్ పరిస్థితి ఏమిటో సమీక్షించుకోవాలని సూచించారు. ప్రజల మద్దతును తిరిగి పొందేందుకు ప్రయత్నించకుండా ఎన్నికల వ్యవస్థలపై విమర్శలు చేయడం వల్ల రాజకీయంగా ప్రయోజనం ఉండదని పేర్కొన్నారు. దేశ ప్రజలు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలోని బీజేపీ, ఎన్డీయే కూటమికి మద్దతుగా ఉన్నారని అమిత్ షా ధీమా వ్యక్తం చేశారు. 2029 సార్వత్రిక ఎన్నికల్లో ఎన్డీయే మరోసారి విజయం సాధిస్తుందని, కాంగ్రెస్ వరుసగా నాలుగోసారి ఓటమిని ఎదుర్కొంటుందని జోస్యం చెప్పారు. కాంగ్రెస్ తన రాజకీయ వ్యూహాలను సమీక్షించుకోవాలని, ప్రజలతో సంబంధాలను బలోపేతం చేసుకోవాలని సూచించారు. అమిత్ షా వ్యాఖ్యలపై కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా స్పందించింది. ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ కేంద్ర హోంమంత్రిపై విమర్శలు గుప్పించారు. అమిత్ షాను 'ఓటు చోరీ సహరూపకర్త'గా అభివర్ణిస్తూ ఎన్నికల ప్రక్రియపై తీవ్ర ఆరోపణలు చేశారు. ఆయన ఇప్పటి నుంచే రిగ్గింగ్‌కు సంబంధించిన ప్రయత్నాలు ప్రారంభించారని ఆరోపించారు. అయితే ఈ ఆరోపణలు కాంగ్రెస్ రాజకీయ విమర్శలేనని, వాటిని నిర్ధారిత వాస్తవాలుగా పరిగణించరాదని గమనించాలి. దేశంలో ప్రభుత్వ వైఖరికి వ్యతిరేకంగా యువత రోడ్లపైకి వస్తోందని జైరాం రమేశ్ పేర్కొన్నారు. నిరంకుశ పాలనకు ముగింపు పలకాలనే ఉద్దేశంతో యువత నిరసనల్లో పాల్గొంటోందని వ్యాఖ్యానించారు. ఎన్నికల ప్రక్రియ విశ్వసనీయతపై కాంగ్రెస్ లేవనెత్తుతున్న ప్రశ్నలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియపై కాంగ్రెస్ అభ్యంతరాలు, వాటిపై బీజేపీ చేస్తున్న విమర్శలు, ఎన్నికల సంఘం పాత్ర నేపథ్యంలో ఇరు పార్టీల మధ్య రాజకీయ వాగ్వాదం కొనసాగుతోంది.

# 'కాక్రోచ్'పై కాదు.. సమస్యలపై దృష్టిపెట్టండి

## కేంద్రంపై అభిజీత్ దీప్కే విమర్శలు!

**న్యూఢిల్లీ, అక్టోబర్ 14 (ఉద్యమ కెరటం):** కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే కేంద్ర ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. తమ పార్టీ నేతలు సౌరవ్ దాస్, అశుతోష్ రంకాలకు 5 రోజుల కస్టడీ విధించడాన్ని ఆయన తీవ్రంగా తప్పుబట్టారు. దేశంలో త్రివర్ణ పతాకాన్ని ప్రదర్శించినందుకు వారిని తిహాడ్ జైలుకు తరలించడం దారుణమని ఆరోపించారు. నిరసన తెలపడం రాజ్యాంగం ప్రజలకు కల్పించిన ప్రాథమిక హక్కు అని, దానిని ఎవరూ అడ్డుకోలేరని అన్నారు. ప్రజాస్వామ్యం, ఓటు హక్కు పరిరక్షణ కోసమే తాము ఈ ఉద్యమం చేస్తున్నట్లు స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మోదీ ప్రభుత్వం దేశంలో అత్యవసర పరిస్థితిని ప్రకటించాలనుకుంటే అధికారికంగా ప్రకటించాలని, అంతేకానీ అరెస్టులు, నిర్బంధాలతో అణచివేయాలని చూడటం సరికాదని హితవు పలికారు. నాటి ఎమర్జెన్సీ సమయంలో కూడా పరిస్థితులు ఇంత దారుణంగా లేవని మండిపడ్డారు. దేశంలో పరిష్కరించాల్సిన సమస్యలు ఎన్నో ఉన్నాయని, ఎస్ఐఆర్ ప్రక్రియను అనేక పార్టీలు వ్యతిరేకిస్తున్నప్పటికీ వాటిని వదిలేసి సీజేపీ ఆందోళనలపై మాత్రమే కేంద్రం దృష్టిపెట్టిందని విమర్శించారు. సీజేపీ ఒక స్వతంత్ర ఉద్యమ సమూహమని, అలాగని తాము ఇండియా కూటమికి వ్యతిరేకం కాదని, రెండూ ఒకే లక్ష్యం కోసం పనిచేస్తున్నాయని పేర్కొన్నారు. కాగా, దిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద సోమవారం నిషేధాజ్ఞలను ఉల్లంఘించారనే ఆరోపణలతో ఇండియా కూటమి నేతలపై ఢిల్లీ పోలీసులు నాలుగు ఎఫ్ఐఆర్‌లు నమోదు చేశారు. మరోవైపు సోషల్ మీడియాలో తప్పుదోవ పట్టించేలా ఉన్న సుమారు 500 పోస్టులను తొలగించాలని అధికారులు ప్లాట్‌ఫామ్‌లకు విజ్ఞప్తి చేశారు.



# ఇన్‌స్పెక్టర్ కనుసన్నల్లో! ఇరగదీసిన పోలీసులు?

## క్రిటికల్ కేర్‌లో అవస్థలు.

**ఉద్యమ కెరటం, కరీంనగర్:** రాజన్న సిరిసిల్ల జిల్లా.. రాష్ట్ర వ్యాప్తంగా పేరెన్నికగన్న పోలీసులకు అడ్డాగా మారిందా? అంటే అవుననే! సమాధానాలే వస్తున్నాయి.. నాటి నేరెళ్ళ ఘటన ఇప్పటికీ పచ్చి పుండులాగే ఉండగా, మళ్లీ మరో ఘటన వెలుగులోకి రావడం సంచలనాత్మకంగా మారింది. దాదాపు రెండు గంటలు బట్టలూడదీసి కొట్టినట్టు బాధితులు చెపుతున్న మాటలు వింటుంటే మానవత్వం ఉన్న మనుషులు ఎవరైనా కదిలిపోవాల్సిందే... అయితే కరుకు ఖాకీ బూట్ల కాఠిన్యం కింద నలుగుతున్న మానవత్వం మరోసారి మంటగలిసిందనే సంఘటన గంభీరావుపేట పోలీస్ స్టేషన్ ఘటనతో నిరూపితం అయినట్టేనని తెలుస్తుంది. నాడు దేశ ప్రజలను హీనంగా చూస్తూ చీకటి జైళ్లలో, బూట్లు నాకించుకునేవారని చరిత్రలో చదువుకున్నాం.. అయితే ప్రస్తుతం కూడా అదే బ్రిటీష్ కాలం చట్టాలను అమలు చేస్తూ బాధితుల మాటల్లో చూసుకుంటే ప్రశ్నించే వారిని, దోషులుగా చిత్రీకరిస్తూ లాఠీలతో చేసిన వీరంగం విస్తుగొలిపెలా ఉందనుకోవచ్చు. అయితే సదరు బ్రిటిష్ చట్టాలు కాలంలో కలిసి, ప్రస్తుతం భారత న్యాయ సంహిత అందుబాటులోకి వచ్చినా సరే తమకు బ్రిటిష్ చట్టాలే ముద్దనే పోలీసులు ఉన్నంత కాలం ఇలాంటి ఘటనలు జరుగుతూనే ఉంటాయనే ఉదంతం మరోసారి గంభీరావు పేట ఘటనతో నిరూపితమవుతుందని తెలుస్తుంది.





### ఇరగదీసిన పోలీసులు

సోమవారం సాయంత్రం 8 గంటల ప్రాంతంలో సంపత్ అనే వ్యక్తిని, తరువాత గంటలో శేఖర్ అనే వ్యక్తిని గంభీరావు పేట పోలీసులు కరీంనగర్ లో అదుపులోకి తీసుకున్నట్టు తెలుస్తుంది. బాధితులు వెల్లడించిన వివరాల ప్రకారం కరీంనగర్ పట్టణం దాటగానే మొదలైన పోలీసు లిప్రత్యేకలి విచారణ, స్టేషన్ లోపలికి చేరుకోగానే తారాస్థాయికి చేరుకున్నట్టు తెలుస్తుంది. దాదాపు రెండు నుండి మూడు గంటల పాటు సాగిన ఆ లిప్రత్యేక పోలీసులి విచారణ పగ వాళ్ళకు రాకూడదంటూ బాధితులు చెపుతున్న విషయం చూపరులను కంటతడి పెట్టిస్తుంది. ఎస్సై తో పాటు దాదాపు 5 నుండి 6 మంది కానిస్టేబుళ్ళు చేసిన లిప్రత్యేక విచారణలి గతంలో జరిగిన నేరెళ్ళ ఘటనకు ఏమాత్రం తీసిపోదేమో. చేసేది ఘనకార్యం అన్నట్టు ఇద్దరు, ముగ్గురు వ్యక్తులకు సదరు ఎస్సై సామాజిక మాధ్యమం ద్వారా వీడియో కాల్ చేసి మరీ చూపించినట్టు బాధితులు వెల్లడించారు. అందులో ఒకరు పోలీసు ఉన్నతాధికారి, మరొకరు ఆ ఎస్సై బంధువు ఉన్నట్టు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ఇంతా చేసి తమనెవరూ ఏం చెయ్యలేరనే అత్యుత్సాహంతో రిమాండ్ కు పంపించేందుకు ప్రయత్నం చేయగా, న్యాయస్థానం బెయిల్ మంజూరు చేయడం గమనార్హం.



### క్రిటికల్ కేర్ లో అవస్థలు

పోలీసు అధికారుల లిప్రత్యేక విచారణలి లో ఉన్న బాధితుల్లో ఒకరైన శేఖర్ దళిత సామాజిక వర్గానికి చెందిన వ్యక్తి కాగా, సంపత్ వెనకబడిన సామాజిక వర్గానికి చెందిన వ్యక్తి. వారిరువురు ప్రస్తుతం నగరంలోని ప్రధాన ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. కనీసం సరిగా పడుకోలేక, కూర్చోలేక వారు పడుతున్న అవస్థలు చూస్తూ కుటుంబ సభ్యులు చేస్తున్న రోదనలు ఆసుపత్రికి వచ్చిన ప్రతీ ఒక్కరినీ కంటతడి పెట్టిస్తుంది. దాదాపు రెండు నుండి మూడు గంటల పాటు తమపై పోలీసులు చేసిన దాష్టీకం తలుచుకుంటేనే వణుకు పుడుతుందని బాధితులు గోళ్ళుమంటున్నారు. ఉద్యోగంలో ఉన్న నా పైనే వార్తలు రాస్తావా అంటూ చెప్పలేని భాషలో బూతుల తిడుతూ వివరీతంగా కొట్టారని తెలిపారు. ఐసియులో ప్రస్తుతం చికిత్స పొందుతున్న బాధితులు యువకులు కావడం, పోలీసు దెబ్బలు భవిష్యత్తులో పెను ప్రమాదానికి దారి తీసే అవకాశం ఉండడంతో వారి కుటుంబ సభ్యులు ఆందోళన చెందుతున్నారు. ఏది ఏమైనా గంభీరావు పేట పోలీసులు సాగిన దాష్టీకంలో కేవలం ఆ స్టేషన్ ఎస్సై తో పాటు సర్కిల్ ఇన్స్పెక్టర్, డీఎస్పీ, ఎస్పీలు కూడా భాగస్వాములే అనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. రోజుకు అయిదు సార్లు డిఎస్ఆర్ చెప్పే పోలీసులు, మాకు తెలియదు అంటే మాకు తెలియదు అంటూ ఉన్నత స్థాయి అధికారులు తప్పించుకుంటూ, కేవలం ఎస్సై పైనే నెపం నెట్టేలా పావులు కదపడం గమనార్హం. ఒక దళిత సామాజిక వర్గం వ్యక్తిని తమ బూట్లు నాకించడం పోలీసు పైశాచికత్వానికి పరాకాష్ట కాగా, తప్పించుకునే క్రమంలో మళ్ళీ మీడియా వ్యక్తులనే మధ్యవర్తిత్వానికి పిలుస్తుండడం కొసమెరుపు.



# కలెక్టరేట్ ఆవరణలో ఘనంగా బతుకమ్మ వేడుకలు

## గౌరమ్మను పూజించి వేడుకలు ప్రారంభించిన జిల్లా కలెక్టర్ కె.హరిత

**ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్:** ప్రకృతిలో లభించే పూలను సేకరించి బతుకమ్మగా పేర్చి దేవతగా పూజించే తెలంగాణ సంస్కృతిని ప్రపంచవ్యాప్తంగా ఘనంగా చాటి చెప్పిన మన పండుగ "బతుకమ్మ" అని జిల్లా కలెక్టర్ కె.హరిత అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సముదాయం ఆవరణలో జిల్లా మహిళా, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన బతుకమ్మ వేడుకలకు జిల్లా అదనపు కలెక్టర్లు యువరాజ్ మర్మాట్, ఎం.డేవిడ్ లతో కలిసి పాల్గొని గౌరమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించే వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మనిషి జీవితం ప్రకృతితో మమేకమై ఉంటుందని, బతుకమ్మ పండుగ చెబుతుందని తెలిపారు. తెలంగాణ ప్రజల జీవన విధానానికి, ప్రకృతితో ఉన్న అనుబంధానికి ఈ పండుగ ప్రత్యేక అని తెలిపారు. తెలంగాణ సంస్కృతిని ప్రపంచ వ్యాప్తంగా చాటి చెప్పిన పండుగ బతుకమ్మ పండుగ అని తెలిపారు. బతుకమ్మ పండుగ ద్వారా మన సంస్కృతిని భావితరాలకు అందించడంతో పాటు మన సాంప్రదాయాల గొప్పదనాన్ని చాటి చెప్పాలని తెలిపారు. అనంతరం బతుకమ్మ వేడుకలలో మహిళా అధికారులు, ఉద్యోగినులతో కలిసి బతుకమ్మ ఆడారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి స్వరూపారాణి, మహిళా అధికారులు, ఉద్యోగులు, ఐ సి డి ఎస్ సిబ్బంది పాల్గొన్నారు.









# వార్తలు రాస్తే లాకప్‌లో చిత్రహింసలా?

## గంభీరావుపేట ఎస్సై శ్రీకాంత్‌ను సస్పెండ్ చేయాలి ● టీయూడబ్ల్యూజే (ఐజేయూ) డిమాండ్

**ఉద్యమ కెరటం, కరీంనగర్:** గంభీరావుపేట ఎస్ఐ శ్రీకాంత్ వ్యవహారశైలిపై కథనాలు ప్రచురించిన 'ఏక్ దమ్ న్యూస్' జర్నలిస్టులు సంపత్, ఎడిటర్ పొత్తూరి శేఖర్‌ను పోలీసులు అక్రమంగా అదుపులోకి తీసుకుని థర్డ్ డిగ్రీ ప్రయోగించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని టీయూడబ్ల్యూజే (ఐజేయూ) కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు గాండ్ల శ్రీనివాస్ పేర్కొన్నారు. ప్రజా సమస్యలను వెలుగులోకి తెచ్చే విలేకరులపై ప్రతీకార చర్యలకు దిగడం, పోలీసు కస్టడీలో చిత్రహింసలకు గురిచేయడం హేయమైన చర్య అని ఆగ్రహం వ్యక్తం చేశారు. కరీంనగర్‌లోని ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న జర్నలిస్టులను ఐజేయూ నాయకులు గురువారం పరామర్శించి, వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోపణలు ఎదుర్కొంటున్న ఎస్ఐ శ్రీకాంత్‌తో పాటు బాధ్యులైన పోలీసులను వెంటనే సస్పెండ్ చేసి, వారిపై క్రిమినల్, శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం గంభీరావుపేట ఎస్ఐ ఆగడాలపై కథనాలు రాసినందుకు నోటీసులు ఇవ్వకుండానే పోలీసులు సోమవారం రాత్రి కిడ్నాప్ తరహాలో వారిని అదుపులోకి తీసుకున్నారు. వాహనంలో తీసుకెళ్తున్న సమయంలోనూ, గంభీరావుపేట, కోనరావుపేట పోలీస్ స్టేషన్లలోనూ లాఠీలు, బెల్టులు, రబ్బరు టైర్లతో విచక్షణారహితంగా దాడి చేసి తీవ్రంగా గాయపరిచారని ఆవేదన వ్యక్తం చేశారు. కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వకుండా రహస్యంగా ఉంచడం, రాత్రివేళల్లో స్టేషన్లు మార్చడం చట్ట విరుద్ధమని విమర్శించారు. బాధితులను సిరిసిల్ల న్యాయమూర్తి ఎదుట హాజరుపరచగా, వారి శరీరంపై ఉన్న గాయాలను గమనించిన న్యాయమూర్తి వైద్య పరీక్షలు చేయించుకోవాలని ఆదేశించి, సొంత పూచీకత్తుపై విడుదల చేశారని తెలిపారు. ప్రస్తుతం వారు నడవలేని స్థితిలో కరీంనగర్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారని వివరించారు. అరెస్టుల సమయంలో భారతీయ నాగరిక సురక్షా సంహిత (బీఎన్ఎస్ఎస్) నిబంధనలను, సుప్రీంకోర్టు మార్గదర్శకాలను పోలీసులు పూర్తిగా ఉల్లంఘించారని గాండ్ల శ్రీనివాస్ ఆరోపించారు. పోలీస్ స్టేషన్ల సీసీ కెమెరా దృశ్యాలు, డయల్ 100 కాల్ రికార్డులు, వాహనాల ప్రయాణ వివరాలను భద్రపరిచి, స్వతంత్ర ఉన్నతాధికారితో విచారణ జరిపించాలని కోరారు. దాడికి పాల్పడిన వారిపై భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్) వర్తించే సెక్షన్ల కింద కేసులు నమోదు చేయాలని స్పష్టం చేశారు. వార్తల్లో తప్పులుంటే చట్టబద్ధమైన మార్గంలో వివరణ కోరవచ్చని, కానీ లాకప్‌లో కొట్టి గొంతు నొక్కాలని చూస్తే ఊరుకోబోమని హెచ్చరించారు. ప్రభుత్వం బాధ్యులపై తక్షణమే చర్యలు తీసుకోకపోతే ఐజేయూ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్త ఆందోళనలు చేపడతామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఐజేయూ కార్యవర్గ సభ్యులు నగునూరి శేఖర్, జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఎలగందుల రవీందర్ తదితరులు పాల్గొన్నారు.



# బాధిత జర్నలిస్టులను పరామర్శించిన టీయూడబ్ల్యూజే నేతలు

**ఉద్యమ కెరటం, ఖమ్మం:** తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కే విరాహత్ అలీ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కే రాంనారాయణ బుధవారం ఖమ్మం జిల్లాలో పర్యటించి బాధిత జర్నలిస్టు కుటుంబాలను పరామర్శించారు. ఇటీవల ఖమ్మం జిల్లా నమస్తే తెలంగాణ స్టాఫ్ రిపోర్టర్, టీయూడబ్ల్యూజే రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వేణుగోపాల్ రావు తండ్రి శ్రీరామారావు గుండెపోటుతో మృతి చెందగా, ఖమ్మం పట్టణంలోని ఆయన నివాసానికి వెళ్లి ఆ కుటుంబాన్ని పరామర్శించారు. శ్రీరామారావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. అక్కడి నుండి సత్తుపల్లి వెళ్లి ఇటీవల భార్యను కోల్పోయిన సీనియర్ పాత్రికేయుడు, టీయూడబ్ల్యూజే ఖమ్మం జిల్లా ఉపాధ్యక్షుడు ఖాదర్ పాష కుటుంబాన్ని పరామర్శించి ఓదార్చారు. ఈ పర్యటనలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఏ.రాజేష్, ఖమ్మం జిల్లా అధ్యక్షుడు ఏనుగు వెంకటేశ్వర్ రావు, కార్యదర్శి పాపారావు, జిల్లా మాజీ అధ్యక్షుడు వనం వెంకటేశ్వర్లు, యూనియన్ సీనియర్ నాయకుడు రవీంద్ర శేష తదితరులు ఉన్నారు.



# ఖాకీల క్రూరత్వం సరికాదు

### జర్నలిస్టులపై థర్డ్ డిగ్రీ హేయమైన చర్య

### ఎస్సై శ్రీకాంత్ ని సర్వీస్ నుంచి తొలగించాలి

### చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్



**ఉద్యమ కెరటం, కరీంనగర్:** రాష్ట్రంలో రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వంలో ప్రజాపాలన పేరుతో పూర్తిస్థాయిలో 'పోలీసుల రాజ్యం' నడుస్తోందని చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. చివరికి సమాజంలో వాస్తవాలను వెలికితీసే జర్నలిస్టులు కూడా రేవంత్ సర్కారులో పోలీసుల బాధితులుగా మారడం రాష్ట్ర దుస్థితికి నిదర్శనమని ధ్వజమెత్తారు. పోలీసుల అరాచకాలు, అక్రమాలకు సంబంధించిన వివరాలను ఆధారాలతో సహా వెలుగులోకి తెచ్చిన 'ఏక్ దమ్ న్యూస్' పత్రికకు చెందిన రిపోర్టర్ లను రాత్రి వేళ కరీంనగర్ లో అక్రమంగా నిర్బంధించి, గంభీరావుపేట పోలీస్ స్టేషన్‌కు తరలించి, థర్డ్ డిగ్రీ ప్రయోగించి చితకబాదడం అత్యంత హేయమైన చర్య అని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్యంలో నాలుగో స్తంభమైన పత్రికా రంగాన్ని అణచివేసే ప్రయత్నం జరుగుతోందని దుయ్యబట్టారు. శేఖర్ అనే దళిత జర్నలిస్టు తలపై సదరు ఎస్సై బూటు కాలు పెట్టి, బూట్లు నాకించడం పోలీసుల అరాచకత్వానికి పరాకాష్ట అని, ఇది యావత్ దళిత సమాజానికే కాకుండా మానవత్వానికే తీరని అవమానమని రవిశంకర్ ఆవేదన వ్యక్తం చేశారు. ఖాకీలు ఇంతలా బరితెగించి వ్యవహరించడానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పరోక్ష అండదండలు ఉండడమే కారణమని ఆయన ఆరోపించారు. ప్రభుత్వం ప్రశ్నించే గొంతులను పోలీసు బలగాలతో తొక్కేయాలని చూస్తోందని విమర్శించారు. దళిత జర్నలిస్టుపై అమానుషంగా దాడి చేసి, కక్షసాధింపు చర్యలకు పాల్పడిన గంభీరావుపేట ఎస్సై శ్రీకాంత్ పై తక్షణమే ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి, సర్వీస్ నుంచి శాశ్వతంగా తొలగించాలని రవిశంకర్ డిమాండ్ చేశారు. బాధితులకు తక్షణ న్యాయం చేయని పక్షంలో జర్నలిస్టు సంఘాలు, ప్రజాసంఘాలతో కలిసి రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమిస్తామని ఆయన హెచ్చరించారు.

# జర్నలిస్టులపై థర్డ్ డిగ్రీ ప్రయోగించడం దారుణం!

### ప్రజాస్వామ్యంలో పత్రికా స్వేచ్ఛపై దాడులు సమంజసం కాదు

### ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న శేఖర్, సంపత్‌లకు పరామర్శ

### ఎంఐఎం ఉమ్మడి కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు సయ్యద్ గులాం అహ్మద్ హుస్సేన్



**ఉద్యమ కెరటం, కరీంనగర్:** మీడియా ప్రతినిధులపై పోలీసులు థర్డ్ డిగ్రీ ప్రయోగించడం ఎంతమాత్రం సమంజసం కాదని ఎంఐఎం ఉమ్మడి కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు సయ్యద్ గులాం అహ్మద్ హుస్సేన్ అన్నారు. కరీంనగర్ జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న జర్నలిస్టులు శేఖర్, సంపత్‌ను ఆయన బుధవారం పరామర్శించారు. వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జర్నలిస్టులపై పోలీసులు థర్డ్ డిగ్రీ ప్రయోగించినట్లు వచ్చిన ఆరోపణలు తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయని పేర్కొన్నారు. మీడియా ప్రతినిధులపై జరిగిన ఈ ఘటనను పత్రికా స్వేచ్ఛపై దాడిగా అభివర్ణించారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో మీడియా పాత్ర అత్యంత కీలకమని, ప్రజల సమస్యలను వెలుగులోకి తీసుకొచ్చే జర్నలిస్టులపై ఇటువంటి చర్యలు ఆమోదయోగ్యం కావని సయ్యద్ గులాం అహ్మద్ హుస్సేన్ పేర్కొన్నారు. జర్నలిస్టులపై పోలీసుల దాడి జరిగిందన్న ఆరోపణలను తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. ప్రజాస్వామ్యంలో పత్రికా స్వేచ్ఛను గౌరవించాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. చికిత్స పొందుతున్న శేఖర్, సంపత్ త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

# నింగి గమనం... నేల నియమం

### ప్రపంచాన్ని ఏకం చేసిన కాలమానం

### కాలగమనానికి కొత్త దారి చూపిన గ్రెగోరియన్ కాలమానం

### 1582, అక్టోబర్ 15... గ్రెగోరియన్ క్యాలెండర్ ఆవిష్కరణ దినం







అనంత కాలప్రవాహంలో మానవుడు సాధించిన అత్యున్నత మేధో విజయాల్లో కాలగణనను క్రమబద్ధీకరించడం అగ్రగణ్యమైనది. అనాదిగా సూర్యోదయ సూర్యాస్తమయాల విన్యాసాలు, చుక్కల మిలమిలలు, చంద్రకళల వృద్ధిక్షయాలు, ఋతువుల ఆవర్తనాలను సునిశితంగా పరిశీలించిన ఆదిమానవుడు కాలాన్ని కొలవడానికి నడుం బిగించాడు. నింగిలోని ఖగోళ చలనాలను నేలపై జీవన గమనానికి అన్వయించుకోవడమే నాగరికతకు తొలి బాట అయింది. వ్యవసాయ విత్తన కాలం మొదలుకొని, సముద్రయాన సాహసాలు, వాణిజ్య విస్తరణ, రాజ్యపాలన, పండుగలు, శాస్త్రీయ పరిశోధనల వరకు సమస్త మానవ కార్యకలాపాలకు కాలగణన ప్రాణాధారమైంది. ప్రాచీన భరతఖండంలో ఋషులు సౌర, చాంద్ర గతులను సమన్వయం చేస్తూ తిథి, వార, నక్షత్ర, యోగ, కరణములతో కూడిన పంచాంగ విజ్ఞానాన్ని ఆవిష్కరించగా; ఈజిప్టు, సుమేరియా, బాబిలోనియా, గ్రీకు నాగరికతలు సైతం సూర్యచంద్రుల ఆధారంగా క్యాలెండర్లను తీర్చిదిద్దాయి. అయితే సౌర చక్రానికి, చాంద్ర చక్రానికి నడుమ గల సహజసిద్ధమైన సమయ వ్యత్యాసం చరిత్ర పొడవునా ఖగోళ శాస్త్రవేత్తలకు నిరంతర సవాలుగా నిలిచింది. ఈ సమస్యను శాస్త్రీయంగా అధిగమిస్తూ, 1582లో పోప్ గ్రెగరీ పదమూడవవారు ఆవిష్కరించిన 'గ్రెగోరియన్ కాలమానం' మానవ చరిత్రలో ఒక శాస్త్రీయ విప్లవంగా, కాలగమనపు దిశాసూచిగా నిలిచింది.

రోమన్ సామ్రాజ్య వైభవ కాలంలో క్రీస్తుపూర్వం 46వ సంవత్సరంలో జూలియస్ సీజర్ అలెగ్జాండ్రియాకు చెందిన ఖగోళవేత్త సోసిజెనెస్ సాయంతో 'జూలియన్ కాలమానాన్ని' ప్రవేశపెట్టాడు. క్రీస్తుపూర్వం 45 జనవరి 1 నుంచి అమల్లోకి వచ్చిన ఈ పద్ధతిలో ఏడాదికి 365 రోజులు, ప్రతి నాలుగో ఏట 366 రోజులతో అధిక సంవత్సరం (లీప్ ఇయర్) పాటించే విధానం రూపుదిద్దుకుంది. ఇందులో సగటు సంవత్సర నిడివి 365.25 రోజులుగా స్థిరపడింది. అయితే, భూమి సూర్యుని చుట్టూ పరిభ్రమిస్తూ ఒక వసంత విషువత్తు నుంచి మరో వసంత విషువత్తుకు చేరుకోవడానికి పట్టే అసలైన ఉష్ణమండల సౌర సంవత్సరం (ట్రోపికల్ ఇయర్) నిడివి దాదాపు 365.24219 రోజులు మాత్రమే. ఈ సూక్ష్మమైన తేడా వల్ల జూలియన్ సంవత్సరానికి, ఖగోళ సౌర సంవత్సరానికి నడుమ ఏటా సుమారు 11 నిమిషాల 14 సెకన్ల వ్యవధి మిగిలిపోయేది. సంవత్సరాల పరిధిలో గోరంతగా తోచిన ఈ దోషం, శతాబ్దాలు దొర్లేకొద్దీ కొండంతై దాపురించింది. ప్రతి 128 సంవత్సరాలకు ఒక పూర్తి రోజు వ్యత్యాసం పోగుపడుతూ వచ్చింది.

ఈ కాలదోష ప్రభావం క్రైస్తవ మతంలో అత్యంత పవిత్రమైన ఈస్టర్ పండుగ గణనపై తీవ్ర గందరగోళాన్ని సృష్టించింది. క్రీస్తుశకం 325లో జరిగిన నికాయా కౌన్సిల్ తీర్మానం ప్రకారం, మార్చి 21న సంభవించే వసంత విషువత్తు (పగలు, రాత్రులు సమానమయ్యే ఖగోళ ఘట్టం) అనంతరం వచ్చే తొలి పూర్ణిమ తర్వాత వచ్చే ఆదివారాన్ని ఈస్టర్‌గా జరపాలి. కానీ జూలియన్ క్యాలెండర్‌లోని 11 నిమిషాల లోపం పేరుకుపోవడం వల్ల, పదహారవ శతాబ్దపు ద్వితీయార్థానికి వచ్చేసరికి ఖగోళపరంగా వసంత విషువత్తు మార్చి 11వ తేదీకే సంభవించసాగింది. అంటే క్యాలెండర్‌కు, విశ్వం నడిచే తీరుకు నడుమ ఏకంగా పది రోజుల అగాధం ఏర్పడింది. మతపరమైన పండుగల నిర్దేశం ప్రకృతి ధర్మానికి విరుద్ధంగా మారడంతో కాలమాన సంస్కరణ అనివార్యమైంది.

ఈ విషమ సమస్య పరిష్కారానికి కాథలిక్ చర్చి అధిపతి పోప్ గ్రెగరీ పదమూడవవారు పూనుకున్నారు. ఇటాలియన్ వైద్యుడు, ఖగోళ గణిత మేధావి అలోయిసియస్ లిలియస్ అద్భుతమైన సంస్కరణా పద్ధతిని సిద్ధం చేయగా, ఆయన మరణానంతరం సోదరుడు ఆంటోనియో లిలియస్ ఆ ప్రణాళికను పోప్ ముందుకు తెచ్చాడు. ప్రముఖ జెసూట్ ఖగోళవేత్త, గణితశాస్త్ర పితామహుడు క్రిస్టోఫర్ క్లావియస్ ఈ గణనలను పరీక్షించి, సరిదిద్ది తుది రూపాన్ని ఇచ్చారు. అనేక విశ్వవిద్యాలయాలు, యూరోపియన్ శాస్త్రవేత్తల సంప్రదింపుల అనంతరం, 1582 ఫిబ్రవరి 24న పోప్ గ్రెగరీ 'ఇంటర్ గ్రావిస్సిమాస్' అనే చారిత్రక రాజముద్రిక (పాపల్ బుల్) ద్వారా సరికొత్త కాలమానాన్ని అధికారికంగా ప్రకటించారు.

ఈ సంస్కరణ ద్వారా చరిత్రాత్మకమైన రెండు అద్భుత పరిష్కారాలు రూపుదిద్దుకున్నాయి. మొదటిది, గడచిన 12 శతాబ్దాల్లో పేరుకుపోయిన పది రోజుల వ్యత్యాసాన్ని సరిచేయడం. ఇందుకోసం 1582 అక్టోబరు మాసంలో అపూర్వమైన చర్య చేపట్టారు. అక్టోబరు 4వ తేదీ గురువారం ముగియగానే, తెల్లవారేసరికి తర్వాతి రోజును అక్టోబరు 5గా కాకుండా ఏకంగా 'అక్టోబరు 15 శుక్రవారం'గా నిర్ణయించారు. మానవ చరిత్రలో అక్టోబరు 5 నుంచి 14 వరకు గల పది తేదీలు కాగితంపై శాశ్వతంగా మాయమైపోయాయి; అయితే వారాల శ్రేణి మాత్రం ఎక్కడా తెగకుండా గురువారం తర్వాత యథావిధిగా శుక్రవారమే వచ్చింది. రెండవది, భవిష్యత్తులో ఈ లోపం పునరావృతం కాకుండా అధిక సంవత్సరాల లెక్కింపు నియమాన్ని సంస్కరించడం. దీని ప్రకారం సాధారణంగా నాలుగో ఏడాది లీప్ ఇయర్ అయినప్పటికీ, శతాబ్దపు సంవత్సరాలు (100తో భాగించబడేవి) 400తో కూడా నిశ్శేషంగా భాగింపబడితేనే అధిక సంవత్సరాలుగా ఉంటాయి. ఈ లెక్కన 1600, 2000 అధిక సంవత్సరాలయ్యాయి; కానీ 1700, 1800, 1900 కాలేదు, రాబోయే 2100 కూడా లీప్ ఇయర్ కాదు. ఈ అద్భుత నియమం ద్వారా గ్రెగోరియన్ కాలమానపు సగటు ఏడాది నిడివి 365.2425 రోజులుగా స్థిరపడింది. ఇది వాస్తవ సౌర సంవత్సరానికి అత్యంత సమీపంగా ఉండటంతో, ఇకపై కేవలం ఒక్క రోజు తేడా రావడానికే దాదాపు 3,300 సంవత్సరాలకు పైగా పడుతుంది.

ఈ నూతన కాలమాన ఆమోదం ప్రపంచవ్యాప్తంగా ఏకకాలంలో, ఏకధాటిగా జరగలేదు. కాథలిక్ దేశాలైన స్పెయిన్, పోర్చుగల్, ఇటలీ, పోలిష్-లిథువేనియన్ కామన్వెల్త్‌లు 1582లోనే స్వీకరించినప్పటికీ, ప్రొటెస్టెంట్, ఆర్థోడాక్స్ రాజ్యాలు రోమ్ అధికార నిర్ణయాన్ని తొలుత తీవ్రంగా ప్రతిఘటించాయి. బ్రిటన్, దాని వలస పాలిత ప్రాంతాలు ఈ శాస్త్రీయ సత్యాన్ని గుర్తించి అంగీకరించడానికి 1752 వరకు వేచిచూడాల్సి వచ్చింది. అప్పటికి వ్యత్యాసం పదకొండు రోజులకు పెరగడంతో బ్రిటన్‌లో 1752 సెప్టెంబరు 2 తర్వాత నేరుగా సెప్టెంబరు 14ను అమలు చేశారు. ఆపై బోల్షివిక్ విప్లవం తర్వాత రష్యా 1918లో, గ్రీసు 1923లో పదమూడు రోజుల వ్యత్యాసాన్ని సరిదిద్దుకుంటూ ఈ కాలమానంలో చేరాయి. దేశాల సరిహద్దులు, మత విశ్వాసాలు వేరైనా కాలం అందరికీ ఒక్కటేనన్న పరమ సత్యాన్ని ప్రపంచం క్రమంగా గుర్తించింది.

భారతదేశ ఆధ్యాత్మిక జీవనంలో కాలగణన సంప్రదాయం మహోన్నతమైనది. తెలుగు నాట చైత్ర శుద్ధ పాడ్యమి నాటి ఉగాది మొదలుకొని సంక్రాంతి వరకు పర్వదినాలు, పితృకార్యాలు, శుభముహూర్తాలు చాంద్ర, సౌరమాన తిథుల మేళవింపుతో కూడిన పంచాంగ రీత్యానే నిత్యనూతనంగా సాగుతున్నాయి. భారతదేశం అధికారికంగా జాతీయ శక కాలమానాన్ని (శాలివాహన శకం) ఆమోదించినప్పటికీ, దేశీయ దైనందిన పరిపాలన, న్యాయవ్యవస్థ, ఆర్థిక సంవత్సరం, రవాణా, అంతర్జాతీయ దౌత్య సంబంధాలన్నీ గ్రెగోరియన్ పద్ధతిలోనే సాగుతున్నాయి. పాత సంప్రదాయాలను గుండెల్లో పదిలపరుచుకుంటూనే ఆధునిక శాస్త్రీయ కాలమానాన్ని ఆలింగనం చేసుకోవడం భారతీయ సంస్కృతిలోని విశాల దృక్పథానికి నిలువెత్తు నిదర్శనం.

నేడు గ్రెగోరియన్ కాలమానం కేవలం గోడకు వేలాడే క్యాలెండర్ కాగితం కాదు; సమస్త మానవాళి ఉమ్మడి జీవన నాడి. వినువీధిలో దూసుకుపోయే ఉపగ్రహాల కక్ష్యల సమన్వయం, అంతర్జాతీయ విమానాల గగనతల రాకపోకలు, బిలియన్ డాలర్ల స్టాక్ మార్కెట్ లావాదేవీలు, డిజిటల్ నెట్‌వర్క్‌ల సమయ సమకాలీకరణ (టైమ్ సింక్రొనైజేషన్) అన్నీ ఈ కాలమాన ఖచ్చితత్వంపైనే ఆధారపడి మనుగడ సాగిస్తున్నాయి. ప్రకృతి గమనాన్ని గణిత సూత్రాలతో నింపి, మానవ సమాజ గమనానికి వేసిన రక్షారేఖే గ్రెగోరియన్ సంస్కరణ. కాలం నిరంతర చలనశీలం, అనంతుడైన కాలపురుషుడి అడుగుజాడలను ఖచ్చితంగా ఒడిసిపట్టేందుకు మానవుడు సాగించిన నిరంతర జిజ్ఞాసకు, శాస్త్రీయ సంకల్పానికి గ్రెగోరియన్ కాలమానం ఒక అజరామర విజయకేతనం.

రామ కిష్టయ్య సంగన భట్ల,
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్
9440595494









# దివ్యాంగ బాలుడికి వినికిడి యంత్రం కోసం ఆర్థిక సాయం

### కలెక్టర్ గరిమ అగ్రవాల్‌కు కృతజ్ఞతలు తెలిపిన కుటుంబ సభ్యులు

**ఉద్యమ కెరటం, సిరిసిల్ల:** వినికిడి సమస్యతో బాధపడుతున్న దివ్యాంగ బాలుడికి ప్రత్యేక వినికిడి యంత్రం కొనుగోలు చేసేందుకు జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ రూ.75వేల ఆర్థిక సహాయం అందజేశారు. బుధవారం బాలుడి కుటుంబ సభ్యులకు చెక్కును అందించారు. ఎల్లారెడ్డిపేట మండలం బండలింగంపల్లి గ్రామానికి చెందిన సాత్విక్ పుట్టుకతోనే వినికిడి సమస్యతో బాధపడుతున్నాడు. బాలుడికి మెరుగైన వినికిడి సామర్థ్యం కల్పించేందుకు ప్రత్యేక వినికిడి యంత్రం అవసరమని, అయితే ఆర్థిక పరిస్థితుల కారణంగా దానిని కొనుగోలు చేయడం కష్టంగా ఉందని కుటుంబ సభ్యులు జిల్లా కలెక్టర్ను ఆశ్రయించి తమ సమస్యను వివరించారు. కుటుంబ సభ్యుల విజ్ఞప్తిపై స్పందించిన కలెక్టర్ బాలుడికి అవసరమైన వినికిడి యంత్రం కొనుగోలు కోసం రూ.75వేల చెక్కును అందజేశారు. బాలుడు చక్కగా చదువుకొని ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగుతూ చదువులో రాణించాలని సూచించారు. తమ సమస్యను అర్థం చేసుకుని ఆర్థిక సహాయం అందించిన జిల్లా కలెక్టర్కు బాలుడి కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి లక్ష్మీరాజం తదితరులు పాల్గొన్నారు.



# హేజిల్‌వుడ్ దెబ్బకు దక్షిణాఫ్రికా విలవిల

**డర్బన్, అక్టోబరు 13 :** ఆస్ట్రేలియాతో జరుగుతున్న తొలి టెస్టులో దక్షిణాఫ్రికా ఓటమి అంచున నిలిచింది. ప్రత్యర్థి నిర్దేశించిన 421 పరుగుల భారీ లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో ఆతిథ్య జట్టు బ్యాటర్లు వరుసగా వికెట్లు కోల్పోతున్నారు. నాలుగో రోజు నుంచి పట్టుదలగా ఆడుతున్న ఎడెన్ మార్క్‌రమ్ (75 నాటౌట్) ఒంటరి పోరాటం చేస్తున్నా, మరోవైపు సహకరించే బ్యాటర్లు లేకపోవడంతో జట్టు కష్టాల్లో పడింది. ఐదో రోజు తొలి సెషన్‌లో ఆసీస్ బౌలర్లు విజృంభించడంతో దక్షిణాఫ్రికా విజయావకాశాలు మరింత సన్నగిల్లాయి. మార్క్‌రమ్ క్రీజులో పాతుకుపోయి పరుగులు సాధించేందుకు ప్రయత్నిస్తున్న సమయంలో ఆస్ట్రేలియా బౌలర్ జోష్ హేజిల్‌వుడ్ కీలక దెబ్బ కొట్టాడు. అప్పటికే మూడు వికెట్లు తీసిన అతడు, ఒకే ఓవర్లో మార్కో యాన్సెన్ (35), సైమన్ హార్మర్ (0)లను పెవిలియన్‌కు పంపాడు. అంతకుముందు కైలీ వెర్రియన్ (1)ను రెన్‌షా ఔట్ చేయడంతో దక్షిణాఫ్రికాపై ఒత్తిడి పెరిగింది. ఐదు వికెట్ల ఘనత సాధించిన హేజిల్‌వుడ్.. ఆసీస్ విజయానికి మార్గం సుగమం చేశాడు. ఒక దశలో 155 పరుగులకే ఐదు వికెట్లు కోల్పోయిన దక్షిణాఫ్రికా, హేజిల్‌వుడ్ ధాటికి 201 పరుగులకే ఎనిమిది వికెట్లు కోల్పోయింది. ప్రస్తుతం మార్క్‌రమ్‌కు జతగా కేశవ్ మహరాజ్ క్రీజులో ఉన్నాడు. నాలుగో ఇన్నింగ్స్‌లో 200కుపైగా బంతులను ఎదుర్కొన్న మార్క్‌రమ్ అర్ధశతకంతో పోరాటాన్ని కొనసాగిస్తున్నాడు. అయితే దక్షిణాఫ్రికా విజయానికి ఇంకా 220 పరుగులు అవసరం కాగా, ఆస్ట్రేలియా రెండు వికెట్లు తీస్తే విజయం సాధిస్తుంది. పరిస్థితులను చూస్తే ఆసీస్ గెలుపు దాదాపు ఖాయంగా కనిపిస్తోంది. దక్షిణాఫ్రికా ఓటమిని తప్పించుకోవాలంటే మార్క్‌రమ్ అసాధారణ ఇన్నింగ్స్ ఆడటంతోపాటు చివరి వికెట్ల నుంచి గట్టి సహకారం లభించాల్సి ఉంది.

# ఆస్ట్రేలియా పర్యటనకు ఇంగ్లండ్ జట్లు ప్రకటన

**లండన్, అక్టోబరు 13 :** పాకిస్థాన్‌తో స్వదేశంలో జరిగిన టెస్టు సిరీస్‌లో ఘన విజయం సాధించిన ఇంగ్లండ్ జట్టు ఇప్పుడు ఆస్ట్రేలియా పర్యటనకు సిద్ధమవుతోంది. నవంబరులో జరగనున్న వన్డే, టీ20 సిరీస్‌ల కోసం ఇంగ్లండ్ క్రికెట్ బోర్డు (ఈసీబీ) జట్లను ప్రకటించింది. రెండు ఫార్మాట్లలోనూ హ్యారీ బ్రూక్ జట్టుకు నాయకత్వం వహించనున్నాడు. మూడు వన్డేలు, ఐదు టీ20ల సిరీస్‌ల కోసం సెలెక్టర్లు వేర్వేరుగా జట్లను ఎంపిక చేశారు. ఆస్ట్రేలియాతో వన్డే సిరీస్ కోసం ప్రకటించిన జట్టులో పేసర్ జోఫ్రా ఆర్చర్‌కు చోటు దక్కింది. గాయం నుంచి కోలుకున్న జాకబ్ బెథెల్ వన్డే, టీ20 రెండు జట్లలోనూ స్థానం సంపాదించాడు. మరోవైపు యువ ఆటగాళ్లు ఎడీ జాక్, థామస్ రే తొలిసారి టీ20 జట్టులోకి ఎంపికయ్యారు. అయితే, శస్త్రచికిత్స అనంతరం కోలుకుంటున్న ఇంగ్లండ్ విధ్వంసక ఓపెనర్ జోస్ బట్లర్ ఈ పర్యటనకు దూరమయ్యాడు. ఆస్ట్రేలియా, ఇంగ్లండ్ జట్ల మధ్య నవంబరు 13న పెర్త్‌లో తొలి వన్డే




జరగనుంది. నవంబరు 15న అడిలైడ్ ఓవల్‌లో రెండో వన్డే, నవంబరు 18న మూడో వన్డే నిర్వహించనున్నారు. అనంతరం నవంబరు 21 నుంచి ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్ ప్రారంభం కానుంది. ఈ పర్యటనలో రెండు ఫార్మాట్లలోనూ రాణించి సిరీస్‌లను కైవసం చేసుకోవాలని ఇంగ్లండ్ లక్ష్యంగా పెట్టుకుంది. ఇంగ్లండ్ వన్డే జట్టు: హ్యారీ బ్రూక్ (కెప్టెన్), జాకబ్ బెథెల్, జో రూట్, హెన్రీ క్రొకొంబె, సామ్ కరన్, లియామ్ డాసన్, బెన్ డకెట్, విల్ జాక్స్, జేమీ ఓవర్టన్, ఆదిల్ రషీద్, జోష్ టంగ్, జోఫ్రా ఆర్చర్, సోనీ బేకర్, టామ్ బ్యాంటన్.

ఇంగ్లండ్ టీ20 జట్టు: హ్యారీ బ్రూక్ (కెప్టెన్), టామ్ బ్యాంటన్, జాకబ్ బెథెల్, జేమ్స్ కోల్స్, జోర్డన్ కాక్స్, హెన్రీ క్రొకొంబె, సామ్ కరన్, లియామ్ డాసన్, అనేరిన్ డొనాల్డ్, ఎడీ జాక్, విల్ జాక్స్, జేమీ ఓవర్టన్, ఆదిల్ రషీద్, థామస్ రే, ఫిల్ సాల్ట్, ల్యూక్ వుడ్.

# దక్షిణాఫ్రికాపై ఆసీస్ ఘన విజయం

**డర్బన్, అక్టోబరు 13 :** ప్రపంచ టెస్టు ఛాంపియన్ దక్షిణాఫ్రికాకు సొంతగడ్డపై భారీ ఎదురుదెబ్బ తగిలింది. గత రెండేళ్లుగా స్వదేశంలో టెస్టుల్లో ఓటమి ఎరుగని సఫారీ జట్టుకు ఆస్ట్రేలియా బ్రేక్ వేసింది. డర్బన్‌లోని కింగ్స్‌మీడ్ మైదానంలో జరిగిన తొలి టెస్టులో ఆసీస్ 214 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. నాలుగో ఇన్నింగ్స్‌లో జోష్ హేజిల్‌వుడ్ ఆరు వికెట్లతో చెలరేగడంతో దక్షిణాఫ్రికా బ్యాటింగ్ కుప్పకూలింది. ఎడెన్ మార్క్‌రమ్ (75) అర్ధశతకంతో పోరాడినా జట్టును ఓటమి నుంచి గట్టెక్కించలేకపోయాడు. ఆస్ట్రేలియా నిర్దేశించిన 421 పరుగుల లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో ఐదో రోజు ఆట ప్రారంభానికి దక్షిణాఫ్రికాకు ఇంకా 319 పరుగులు అవసరమయ్యాయి. చేతిలో ఆరు వికెట్లు ఉండటంతో గెలుపుపై ఆశలు పెట్టుకున్న సఫారీలకు ఆసీస్ బౌలర్లు గట్టి షాకిచ్చారు. వియాన్ మల్డర్ (29)ను హేజిల్‌వుడ్ ఔట్ చేయగా, కైలీ వెర్రియన్ (1)ను మ్యాట్ రెన్‌షా పెవిలియన్‌కు పంపాడు. కీలక వికెట్లు వరుసగా పడటంతో దక్షిణాఫ్రికాపై ఒత్తిడి పెరిగింది. మార్క్‌రమ్ మాత్రం క్రీజులో నిలబడి పరుగులు సాధిస్తూ జట్టును ఆదుకునేందుకు ప్రయత్నించాడు. అతడికి మార్కో యాన్సెన్ (35) కొంతసేపు అండగా నిలిచాడు. అయితే హేజిల్‌వుడ్ ఒకే ఓవర్లో యాన్సెన్, సైమన్ హార్మర్ (0)లను ఔట్ చేయడంతో సఫారీల పతనం వేగంగా సాగింది. అప్పటివరకు 155 పరుగులకు ఐదు వికెట్లు కోల్పోయిన దక్షిణాఫ్రికా, ఆ తర్వాత 201 పరుగులకే ఎనిమిది వికెట్లు కోల్పోయింది. మార్క్‌రమ్ అర్ధశతకంతో చివరి వరకు పోరాడినా ఆసీస్ బౌలర్లను నిలువరించలేకపోయాడు. కీలక సమయంలో



అతడిని మిచెల్ స్టార్క్ ఔట్ చేయడంతో దక్షిణాఫ్రికా విజయంపై మిగిలిన ఆశలు కూడా ఆవిరయ్యాయి. చివరి వికెట్‌గా అన్రిచ్ నోర్జ్‌ని హేజిల్‌వుడ్ పెవిలియన్‌కు పంపడంతో ఆతిథ్య జట్టు రెండో ఇన్నింగ్స్ 206 పరుగుల వద్ద ముగిసింది. హేజిల్‌వుడ్ 49 పరుగులిచ్చి ఆరు వికెట్లు పడగొట్టగా, రెన్‌షా రెండు వికెట్లు సాధించాడు.

కింగ్స్‌మీడ్ మైదానంలో ఆస్ట్రేలియాకు ఇది వరుసగా నాలుగో టెస్టు విజయం. ప్రపంచ టెస్టు ఛాంపియన్‌గా నిలిచిన తర్వాత దక్షిణాఫ్రికా కెప్టెన్ తెంబ బవుమాకు స్వదేశంలో ఎదురైన తొలి టెస్టు ఓటమి ఇదే. ఇరు జట్ల మధ్య రెండో టెస్టు అక్టోబరు 18న జరగనుంది. తొలి టెస్టులో ఎదురైన పరాజయానికి ప్రతీకారం తీర్చుకోవాలని దక్షిణాఫ్రికా భావిస్తుండగా, విజయ పరంపరను కొనసాగించాలని ఆస్ట్రేలియా లక్ష్యంగా పెట్టుకుంది.

# భువీకి జట్టులో చోటు.. అశ్విన్ ఆసక్తికర వ్యాఖ్యలు

**న్యూఢిల్లీ, అక్టోబరు 13 :** భారత సీనియర్ పేసర్ భువనేశ్వర్ కుమార్ నాలుగేళ్ల సుదీర్ఘ విరామం తర్వాత మళ్లీ టీమిండియాలో చోటు దక్కించుకున్నాడు. ఈ నెల 22 నుంచి న్యూజిలాండ్‌తో ప్రారంభం కానున్న ఐదు టీ20ల సిరీస్‌కు భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) అతడిని ఎంపిక చేసింది. ఈ నేపథ్యంలో భారత మాజీ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ భువనేశ్వర్‌పై ప్రశంసలు కురిపించాడు. తిరిగి జాతీయ జట్టులోకి రావాలనే లక్ష్యంతో కాకుండా, తన ఆటపై దృష్టి పెట్టి ముందుకు సాగడం వల్లే అతడికి ఈ అవకాశం దక్కిందని పేర్కొన్నాడు. భువనేశ్వర్ కుమార్ తిరిగి భారత జట్టులోకి రావాలని ప్రత్యేకంగా ప్రణాళికలు వేసుకుని ఉండకపోవచ్చని అశ్విన్ అభిప్రాయపడ్డాడు. జాతీయ జట్టులో చోటు కోసం ఆరాటపడకుండా, తన బాధ్యతను సక్రమంగా నిర్వర్తిస్తూ ముందుకు సాగాడని తెలిపాడు. ముఖ్యంగా రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సీబీ) తరఫున మెరుగ్గా ఆడటంపైనే దృష్టి పెట్టాడని వివరించాడు. భువీకి ఇప్పుడు భారత జట్టులో చోటు దక్కడం అతడి కృషికి లభించిన ప్రతిఫలమని అశ్విన్ పేర్కొన్నాడు. అయితే ఆ ఫలితం కోసం అతడు ప్రత్యేకంగా వెతుక్కుంటూ వెళ్లలేదని, తన పని తాను చేసుకుంటూ పోయాడని చెప్పాడు. చివరకు



అతడి ప్రదర్శనే జాతీయ జట్టులోకి తిరిగి వచ్చే అవకాశాన్ని తెచ్చిపెట్టిందని ప్రశంసించాడు. యువ క్రికెటర్ వైభవ్ సూర్యవంశీ ప్రతిభపైనా అశ్విన్ ప్రశంసలు కురిపించాడు. అతడు అసాధారణ ప్రతిభావంతుడని, క్రికెట్ అతడి రక్తంలోనే ఉందని వ్యాఖ్యానించాడు. వైభవ్‌కు ఉజ్వల భవిష్యత్తు ఉందనడంలో సందేహం లేదని పేర్కొంటూనే, అవకాశాల కోసం ఓపికగా ఎదురుచూడటం కూడా ముఖ్యమని సూచించాడు. ప్రస్తుతం సంజు శాంసన్, అభిషేక్ శర్మ ఓపెనర్లుగా ఆడుతున్న నేపథ్యంలో వైభవ్ తనకు వచ్చే అవకాశాల కోసం ఎదురుచూస్తూ ఆ సమయాన్ని ఆస్వాదించాలని అశ్విన్ అభిప్రాయపడ్డాడు. ప్రతిభ ఉన్నంత మాత్రాన వెంటనే అవకాశాలు వస్తాయని భావించకూడదని తెలిపాడు. సంజు శాంసన్ కెరీర్‌ను ఉదాహరణగా ప్రస్తావించిన అశ్విన్.. అతడు జాతీయ జట్టులో నిలకడగా అవకాశాలు పొందేందుకు చాలా కాలం ఎదురుచూడాల్సి వచ్చిందని గుర్తుచేశాడు. ఒకప్పుడు పరిమితంగా వచ్చిన అవకాశాలు, ఆ తర్వాత వరుసగా లభించాయని వివరించాడు. ఏళ్ల తరబడి ఎదురుచూసిన అవకాశాలు ఒకే టీ20 ప్రపంచకప్ సమయంలో లభించాయని పేర్కొన్నాడు. క్రికెట్‌లో ప్రతిభతోపాటు సహనం కూడా అవసరమని అశ్విన్ చెప్పాడు. సరైన సమయం వచ్చినప్పుడు అవకాశాన్ని అందిపుచ్చుకోవడమే కీలకమని యువ ఆటగాళ్లకు సూచించాడు. భువనేశ్వర్ పునరాగమనం, సంజు శాంసన్ ప్రయాణం యువ క్రికెటర్లకు మంచి ఉదాహరణలని ఆయన వ్యాఖ్యల సారాంశం.



# వెస్టిండీస్ ఆటగాళ్లకు ఐసీసీ మందలింపు

**దుబాయ్, అక్టోబరు 13:** భారత్‌తో జరిగిన రెండో టీ20 మ్యాచ్‌లో వెస్టిండీస్ జట్టు విజయం సాధించినప్పటికీ, ఆ జట్టు ఆటగాళ్లు రోవ్‌మన్ పావెల్, షెర్ఫేన్ రూథర్‌ఫర్డ్‌లకు అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) నుంచి మందలింపు ఎదురైంది. మైదానంలో ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించినందుకు ఇద్దరికీ ఒక్కొక్క డీమెరిట్ పాయింట్ విధించినట్లు సమాచారం. అక్టోబరు 9న రాంచీలో భారత్, వెస్టిండీస్ జట్ల మధ్య రెండో టీ20 మ్యాచ్ జరిగింది. ఈ మ్యాచ్ సందర్భంగా వెస్టిండీస్ కెప్టెన్ రోవ్‌మన్ పావెల్ బ్యాట్‌తో బంతిని బాదిన ఘటనను ఐసీసీ పరిగణనలోకి తీసుకున్నట్లు తెలుస్తోంది. అలాగే బ్యాటర్ షెర్ఫేన్ రూథర్‌ఫర్డ్ అంపైర్ నిర్ణయంపై అసహనం వ్యక్తం చేసిన వ్యవహారంపైనా చర్యలు తీసుకున్నట్లు సమాచారం. ఈ ఘటనలకు సంబంధించి పావెల్, రూథర్‌ఫర్డ్‌లను ఐసీసీ మందలించడంతో పాటు ఇద్దరికీ చెరో డీమెరిట్ పాయింట్ కేటాయించినట్లు వార్తలు వెల్లడించాయి. అంతర్జాతీయ మ్యాచ్‌లలో ఆటగాళ్లు ఐసీసీ ప్రవర్తనా నియమావళిని తప్పనిసరిగా పాటించాల్సి ఉంటుంది. మైదానంలో అనుచిత ప్రవర్తన, అంపైర్ల నిర్ణయాలపై అసహనం వ్యక్తం చేయడం వంటి ఘటనలపై నిబంధనలకు అనుగుణంగా క్రమశిక్షణ చర్యలు తీసుకునే అవకాశం ఉంటుంది. భారత్‌పై రెండో టీ20లో విజయం సాధించిన వెస్టిండీస్‌కు ఈ పరిణామం ఎదురైంది. అయితే ఈ చర్యలపై పూర్తి వివరాలు, అధికారిక ప్రకటనకు సంబంధించిన సమాచారం స్పష్టంగా అందుబాటులోకి రావాల్సి ఉంది.

# టీమిండియాలోకి ఔకిబ్ నబీ..

## కారు కొనుగోలుపై చర్చ!

**గువాహటి, అక్టోబరు 13 :** జమ్మూకశ్మీర్‌కు చెందిన యువ క్రికెటర్ ఔకిబ్ నబీ భారత జట్టు తరఫున అంతర్జాతీయ క్రికెట్‌లోకి అరంగేట్రం చేశాడు. భారత్, వెస్టిండీస్ మధ్య జరిగిన వన్డే సిరీస్‌లో భాగంగా గువాహటిలోని బర్సాపరా క్రికెట్ స్టేడియంలో జరిగిన రెండో వన్డేలో టీమిండియా తరఫున తొలి మ్యాచ్ ఆడాడు. భారత స్టార్ బ్యాటర్ కేఎల్ రాహుల్ చేతుల మీదుగా జాతీయ జట్టు టోపీని అందుకున్నాడు. దీంతో జమ్మూకశ్మీర్ నుంచి భారత జట్టుకు ప్రాతినిధ్యం వహించిన మూడో క్రికెటర్‌గా నిలిచాడు. గతంలో పర్వేజ్ రసూల్, ఉమ్రాన్ మాలిక్ ఈ ఘనత సాధించారు. అంతర్జాతీయ క్రికెట్‌లోకి అడుగుపెట్టిన ఔకిబ్ నబీకి సంబంధించిన ఓ వీడియో ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో చర్చనీయాంశంగా మారింది. ఆ వీడియోలో అతడు ఓ కార్ల ప్రదర్శనశాలలో హ్యుందాయ్ కారులో కూర్చొని కనిపించాడు. దీంతో నబీ కొత్త కారు కొనుగోలు చేశాడంటూ పలువురు అభిమానులు ఊహాగానాలు చేస్తున్నారు. అయితే, అతడు నిజంగానే కారును కొనుగోలు చేశాడా? అనే విషయంపై స్పష్టమైన సమాచారం లేదు. భారత జట్టులో చోటు దక్కించుకున్నప్పటికీ, తొలి వన్డేలో నబీకి కఠిన పరీక్ష ఎదురైంది. బ్యాటింగ్‌కు అనుకూలంగా ఉన్న పిచ్‌పై బౌలింగ్ చేసిన అతడు 8.4 ఓవర్లలో 84 పరుగులు సమర్పించుకున్నాడు. ఒక్క వికెట్ కూడా తీయలేకపోయాడు. అంతర్జాతీయ క్రికెట్‌లో తొలి మ్యాచ్ కావడంతో అతడిపై అంచనాలు నెలకొన్నప్పటికీ, బౌలింగ్‌లో ఆశించిన స్థాయిలో రాణించలేకపోయాడు. భారత వన్డే జట్టుకు ఎంపిక కావడంతో నబీ ఇటీవల జరిగిన ఇరానీ కప్ మ్యాచ్‌కు జమ్మూకశ్మీర్ తరఫున అందుబాటులో లేకపోయాడు. ఆ మ్యాచ్‌లో జమ్మూకశ్మీర్ జట్టు రెస్ట్ ఆఫ్ ఇండియా చేతిలో 167 పరుగుల తేడాతో ఓటమి పాలైంది. 2025-26 రంజీ ట్రోఫీ సీజన్‌లో ఔకిబ్ నబీ అద్భుతంగా రాణించాడు. ఏకంగా 60 వికెట్లు పడగొట్టి జమ్మూకశ్మీర్ జట్టు తొలిసారి రంజీ ట్రోఫీ టైటిల్ సాధించడంలో కీలక పాత్ర పోషించాడు. ఈ ప్రదర్శనతో అతడికి భారత టెస్టు జట్టులోనూ అవకాశం దక్కవచ్చనే అంచనాలు ఏర్పడ్డాయి. ఆగస్టులో శ్రీలంకతో జరిగిన టెస్టు సిరీస్



కోసం ఎంపిక చేసిన భారత జట్టులోనూ నబీకి చోటు లభించింది. భారత్ ఆ సిరీస్‌ను 1-0తో గెలుచుకున్నప్పటికీ, తుది జట్టులో ఆడే అవకాశం అతడికి రాలేదు. అనంతరం ఇంగ్లాండ్ కౌంటీ ఛాంపియన్‌షిప్‌లో సర్రే జట్టు తరఫున కొంతకాలం ఆడాడు. అంతర్జాతీయ స్థాయిలో తొలి మ్యాచ్ ఆడిన నబీ, రాబోయే పోటీల్లో తన బౌలింగ్‌తో ఆకట్టుకోవాల్సి ఉంది. అతడి ప్రదర్శనను భారత సెలెక్టర్లు పరిశీలించే అవకాశం ఉంది. భారత్-ఎ జట్టు న్యూజిలాండ్ పర్యటనతో పాటు రానున్న టెస్టు సిరీస్‌ల కోసం జట్ల ఎంపిక నేపథ్యంలో దేశవాళీ, అంతర్జాతీయ క్రికెట్‌లో అతడి ప్రదర్శన కీలకం కానుంది. రంజీ ట్రోఫీలో వికెట్ల వేటతో గుర్తింపు పొందిన నబీ, భారత జట్టులో తన స్థానాన్ని నిలబెట్టుకుంటాడా అనేది ఆసక్తికరంగా మారింది.

# 400 కుటుంబాలకు రష్మిక ఆహార సాయం!



**హైదరాబాద్, అక్టోబరు 14 (ఉద్యమ కెరటం):** నేషనల్ క్రష్ రష్మిక మందన్న మరోసారి తన మంచి మనసును చాటుకున్నారు. సినిమాల్లో నటనతో ప్రేక్షకులను ఆకట్టుకుంటున్న ఈమె.. ఆపదలో ఉన్న కుటుంబాలకు అండగా నిలిచేందుకు ముందుకొచ్చారు. పేద కుటుంబాలకు నిత్యావసర ఆహార పదార్థాలను అందించే లక్ష్యంతో 'ప్రాజెక్ట్ అన్నపూర్ణ' పేరుతో సేవా కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు సమాచారం. ఈ కార్యక్రమం ద్వారా దక్షిణ భారతదేశంలోని ఎనిమిది ప్రాంతాల్లో 400 కుటుంబాలకు ఆహార కిట్లను అందిస్తున్నారు. 'ప్రాజెక్ట్ అన్నపూర్ణ'లో భాగంగా ఒక్కో కుటుంబానికి పెద్ద మొత్తంలో నిత్యావసర ఆహార పదార్థాలను అందిస్తున్నారు. ఒక్కో కిట్‌లో 75 కిలోల బియ్యం, 10 కిలోల గోధుమ పిండి, 15 కిలోల వివిధ రకాల పప్పులు, 10 లీటర్ల వంట నూనెతో పాటు రాగులు, మసాలా దినుసులు, టీ తదితర వస్తువులు ఉన్నాయి. రోజువారీ ఆహార అవసరాల కోసం ఇబ్బందులు ఎదుర్కొంటున్న కుటుంబాలకు ఈ సాయం కొంతకాలం పాటు ఉపయోగపడనుంది. ఈ కార్యక్రమాన్ని ఒక ప్రాంతానికే పరిమితం చేయకుండా దక్షిణ భారతదేశంలోని పలు ప్రాంతాలకు విస్తరించారు. హైదరాబాద్, మహబూబ్‌నగర్, అనంతపురం, బెంగళూరు, కొచ్చి, చెన్నై, కొడగు, విజయవాడ ప్రాంతాల్లోని కుటుంబాలకు ఆహార కిట్లను అందిస్తున్నట్లు కథనాలు పేర్కొంటున్నాయి. రష్మిక చేపట్టిన ఈ ప్రయత్నంపై అభిమానులు ప్రశంసలు కురిపిస్తున్నారు. తాను నటించిన 'రణబాలి' సినిమాలోని జయమ్మ పాత్రకు, తన నిజ జీవితానికి పోలికలు ఉన్నాయా అని చాలామంది అడుగుతున్నారని రష్మిక తెలిపారు. ఈ కార్యక్రమం కూడా ఆ పోలికల్లో ఒకటేనని ఆమె చెప్పినట్లు సమాచారం. "నేను ఎప్పటి నుంచో ఇలాగే ఉంటున్నాను. జయమ్మ పాత్ర కూడా ఇలాగే ఉంటుంది. మీరు నాకు ఇస్తున్న ప్రేమకు ప్రతిగా ఇలాంటి పనులు చేస్తూనే ఉంటాను" అని ఆమె పేర్కొన్నారు. అభిమానులు తనపై చూపిస్తున్న ప్రేమాభిమానాలకు సామాజిక సేవ ద్వారా స్పందించాలని రష్మిక భావిస్తున్నట్లు ఆమె వ్యాఖ్యలు తెలియజేస్తున్నాయి. మరోవైపు, విజయ్ దేవరకొండ కథానాయకుడిగా నటించిన 'రణబాలి' చిత్రంలో రష్మిక కీలక పాత్ర పోషించారు. ఈ సినిమా అక్టోబరు 15న విడుదల కానున్నట్లు ప్రచారంలో ఉంది. రష్మిక నటనతో పాటు సేవా కార్యక్రమం కూడా ప్రస్తుతం అభిమానుల్లో చర్చనీయాంశంగా మారింది.



# బాలీవుడ్‌లో హిందూ సంప్రదాయాలపై వివక్ష ఉందా?

**ముంబై, అక్టోబరు 14 (ఉద్యమ కెరటం):** ప్రముఖ బాలీవుడ్ నిర్మాత ఏక్తా కపూర్ సినీ పరిశ్రమలో తనకు ఎదురైన అనుభవాల గురించి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ప్రముఖ యూట్యూబర్ రన్వీర్ అల్లాబాదియా నిర్వహించిన మాటామంతీ కార్యక్రమంలో పాల్గొన్న ఆమె.. హిందూ సంప్రదాయాలను పాటించే విషయంలో పరిశ్రమలో కొందరి వైఖరిపై తన అభిప్రాయాలను వెల్లడించారు. సంప్రదాయాలను అనుసరించినందుకు తాను ఎగతాళికి గురైన సందర్భాలను గుర్తుచేసుకున్నారు. తాను బొట్టు పెట్టుకోవడం, చేతికి పవిత్రమైన దారాలు కట్టుకోవడం చూసి పరిశ్రమలో కొందరు విచిత్రంగా స్పందించారని ఏక్తా కపూర్ చెప్పినట్లు సమాచారం. తన సంప్రదాయాలను పాటించినందుకు కొందరు తనను 'వింత మనిషి', 'తాంత్రికురాలు' అంటూ వ్యాఖ్యానించారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. వ్యక్తిగత విశ్వాసాలు, ఆచారాలను గౌరవించాల్సిన అవసరం ఉందనే అభిప్రాయాన్ని ఆమె వ్యక్తం చేశారు. పాశ్చాత్య సంస్కృతికి సంబంధించిన కల్పిత కథలు, యానిమేషన్ చిత్రాలను సినీ పరిశ్రమలోని కొందరు ఆస్వాదిస్తారని, అదే సమయంలో భారతీయ సంస్కృతి, జానపద కథలు, హిందూ సంప్రదాయాల ప్రస్తావన వచ్చినప్పుడు భిన్నంగా స్పందిస్తారని ఏక్తా వ్యాఖ్యానించినట్లు కథనాలు పేర్కొంటున్నాయి. ఈ వైఖరిని ఆమె పక్షపాత ధోరణిగా అభివర్ణించినట్లు తెలుస్తోంది. ఒకసారి తాను గుడికి వెళ్లిన తర్వాత నేరుగా ఓ క్లబ్‌కు వెళ్లినప్పుడు కొందరు ఆశ్చర్యపోయారని ఏక్తా గుర్తుచేసుకున్నట్లు సమాచారం. మతపరమైన విశ్వాసాలను పాటిస్తూనే ఆధునిక జీవనశైలిని అనుసరించడంలో తప్పేముందని ఆమె అభిప్రాయపడినట్లు తెలుస్తోంది. సంప్రదాయాలను గౌరవించడం, ఆధునికంగా జీవించడం పరస్పర విరుద్ధమైన విషయాలు కావని ఆమె వ్యాఖ్యల సారాంశం. ఏక్తా కపూర్ వ్యాఖ్యలు బాలీవుడ్‌లో వ్యక్తిగత విశ్వాసాలు, సంప్రదాయాల పట్ల చూపించే వైఖరిపై చర్చకు దారితీస్తున్నాయి. అయితే, పరిశ్రమ మొత్తాన్ని ఒకే విధంగా చూడకుండా, ఆమె వివరించిన అనుభవాలను వ్యక్తిగత అభిప్రాయాలుగా పరిగణించాల్సి ఉంటుంది.

# వాయిదా దిశగా విశ్వక్ సేన్ 'కల్ట్'?

**హైదరాబాద్, అక్టోబరు 14 (ఉద్యమ కెరటం):** టాలీవుడ్ యువ కథానాయకుడు విశ్వక్ సేన్ స్వీయ దర్శకత్వంలో తెరకెక్కిస్తున్న థ్రిల్లర్ చిత్రం 'కల్ట్'పై మొదటి నుంచే ప్రేక్షకుల్లో ఆసక్తి నెలకొంది. భారతీయ తెరపై స్లాషర్ థ్రిల్లర్‌గా, పెద్దలకు మాత్రమే అనుమతించే 'ఏ' ధ్రువీకరణతో ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నట్లు ప్రకటించడంతో అంచనాలు పెరిగాయి. అయితే అక్టోబరు చివరి వారంలో విడుదల చేస్తామని గతంలో వెల్లడించిన చిత్రబృందం నుంచి ఇటీవల పెద్దగా సమాచారం లేకపోవడంతో సినిమా అనుకున్న సమయానికి వస్తుందా? అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. 'కల్ట్'ను అక్టోబరు చివరి వారంలో ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తామని చిత్రబృందం గతంలో ప్రకటించింది. ఈ నెల ప్రారంభంలో ఓ సమాచారం పంచుకున్నప్పటికీ, ఆ తర్వాత ప్రచార కార్యక్రమాలపై స్పష్టత కనిపించడం లేదు. సాధారణంగా విడుదలకు దగ్గరపడే సినిమాలకు వరుసగా ప్రచార చిత్రాలు, టీజర్లు, ట్రైలర్లు విడుదల చేస్తుంటారు. కానీ 'కల్ట్' విషయంలో అలాంటి సందడి లేకపోవడంతో విడుదల వాయిదా పడే అవకాశాలున్నాయనే చర్చ మొదలైంది. అయితే సినిమా వాయిదా పడినట్లు ఇప్పటివరకు అధికారిక ప్రకటన వెలువడలేదు. నటుడిగా విభిన్నమైన కథలు, పాత్రలను ఎంచుకుంటున్న విశ్వక్ సేన్.. 'కల్ట్'తో మరోసారి దర్శకుడిగా తన ప్రతిభను చాటుకునేందుకు సిద్ధమవుతున్నారు. స్లాషర్ థ్రిల్లర్ నేపథ్యంలో తెరకెక్కుతున్న ఈ చిత్రంలో గాయత్రి భరద్వాజ్, మురళీ శర్మ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. తారక్ సినిమాస్ సంస్థ ఈ చిత్రాన్ని నిర్మిస్తోంది. కథాంశం, చిత్రీకరణ శైలి కారణంగా ఇప్పటికే ఈ సినిమాపై సినీ వర్గాల్లో ఆసక్తి నెలకొంది. విడుదల తేదీపై కొనసాగుతున్న సందిగ్ధతకు చిత్రబృందం అధికారిక ప్రకటనతోనే తెరపడనుంది. దీంతో విశ్వక్ సేన్ అభిమానులు తదుపరి సమాచారం కోసం ఎదురుచూస్తున్నారు.



## విలన్‌గా అదరగొడుతున్న తెలుగమ్మాయి..

# గాయత్రి సింహాద్రి!

**హైదరాబాద్, అక్టోబరు 14 (ఉద్యమ కెరటం):** తెలుగు బుల్లితెరపై తనదైన నటనతో ప్రేక్షకులను ఆకట్టుకుంటున్న నటి గాయత్రి సింహాద్రి ప్రస్తుతం చర్చల్లో నిలుస్తున్నారు. విజయవాడకు చెందిన ఈ తెలుగమ్మాయి హీరోయిన్‌గా వెండితెరపై గుర్తింపు తెచ్చుకోవాలని సినీ పరిశ్రమలోకి అడుగుపెట్టారు. అయితే బుల్లితెరపై ప్రతినాయిక పాత్రతో ఆమెకు మంచి గుర్తింపు లభించింది. నటనతో పాటు సామాజిక మాధ్యమాల్లో ఆమె పంచుకుంటున్న ఫొటోలు కూడా అభిమానుల దృష్టిని ఆకర్షిస్తున్నాయి. గాయత్రి సింహాద్రి 'మ్యాడ్' వంటి చిత్రాల్లో చిన్న పాత్రల్లో కనిపించారు. అయితే 'కార్తీక దీపం-ఇది నవ వసంతం' ధారావాహికలో జ్యోత్స్న పాత్ర ఆమెకు మరింత గుర్తింపు తెచ్చిపెట్టింది. ఈ సీరియల్‌లో ప్రతినాయికగా నటిస్తూ తన అభినయంతో ప్రేక్షకులను ఆకట్టుకుంటున్నారు. పాత్రకు తగ్గ హావభావాలు, మాటతీరు, తెరపై కనిపించే ప్రత్యేకమైన నటనతో అభిమానులను సంపాదించుకున్నారు. ధారావాహికలో జ్యోత్స్న పాత్రలో చోటుచేసుకున్న మార్పులు ప్రేక్షకుల్లో ఆసక్తిని పెంచుతున్నాయి. సూరజ్ తనకు నమ్మకద్రోహం చేశాడనే నేపథ్యంలో జ్యోత్స్న పాత్రలో భావోద్వేగపరమైన మార్పులు కనిపిస్తున్నాయి. గతంలో ప్రతినాయికగా కనిపించిన ఆమె.. ఇప్పుడు ప్రేమ కోసం తపించే అమ్మాయిగా ప్రేక్షకుల ముందుకు వస్తున్నారు. ఈ భిన్నమైన భావోద్వేగాలను గాయత్రి తన నటనతో పండిస్తున్నారని అభిమానులు అభిప్రాయపడుతున్నారు. బుల్లితెరపై సంప్రదాయబద్ధమైన పాత్రలో కనిపించే గాయత్రి సింహాద్రి.. నిజ జీవితంలో ఆధునిక దుస్తుల్లో తీసుకున్న ఫొటోలను సామాజిక మాధ్యమాల్లో పంచుకుంటూ అభిమానులను అలరిస్తున్నారు. ఆమె తాజా ఫొటోలు నెటిజన్ల దృష్టిని ఆకర్షిస్తున్నాయి. నటనతో పాటు తన వ్యక్తిగత శైలితోనూ గుర్తింపు తెచ్చుకుంటున్నారు. ప్రస్తుతం బుల్లితెరపై మంచి ఆదరణ పొందుతున్న గాయత్రి సింహాద్రికి భవిష్యత్తులో వెండితెరపై మరిన్ని అవకాశాలు వస్తాయని అభిమానులు ఆశిస్తున్నారు. తన నటనతో ప్రేక్షకులను మెప్పిస్తున్న ఈ విజయవాడ అమ్మాయి తదుపరి ఎలాంటి ప్రాజెక్టులతో అలరిస్తారో చూడాలి.

## 'ఇరుముడి'తో గుర్తింపు..

# ఈ చిన్నారి ఎవరో తెలుసా?

**హైదరాబాద్, అక్టోబరు 14 (ఉద్యమ కెరటం):** మాస్ మహారాజా రవితేజ నటించిన 'ఇరుముడి' సినిమాలో ఓ చిన్నారి తన నటనతో ప్రేక్షకుల దృష్టిని ఆకర్షిస్తోంది. ఈ చిత్రంలో గురుస్వామి సాయికుమార్ కుమార్తె గాయత్రి పాత్రలో కనిపించిన సామ్ తన అభినయంతో ప్రశంసలు అందుకుంటోంది. గతంలో పలు సినిమాల్లో చిన్న పాత్రలు చేసినప్పటికీ, ఈ చిత్రంతో ఆమెకు మంచి గుర్తింపు లభించినట్లు సినీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. సామ్ గతంలో 'ప్రసన్న వదనం', 'డాకు మహారాజ్', 'మ్యాడ్ స్క్వేర్' వంటి చిత్రాల్లో చిన్న పాత్రల్లో కనిపించింది. అయితే అప్పట్లో ఆమెకు పెద్దగా గుర్తింపు రాలేదు. 'ఇరుముడి'లో గాయత్రి పాత్రతో ప్రేక్షకులకు మరింత దగ్గరైంది. సినిమాలో ఆమె కనిపించే సన్నివేశాలు, సహజమైన నటన ప్రేక్షకులను ఆకట్టుకుంటున్నాయి. రవితేజ ప్రధాన పాత్రలో నటించిన ఈ చిత్రంలో ప్రియా భవానీ శంకర్ కథానాయికగా కనిపించారు. రవితేజ కుమార్తె పాత్రలో బేబీ నక్షత్ర కూడా నటించింది. తండ్రీకూతుళ్ల మధ్య వచ్చే భావోద్వేగ సన్నివేశాలు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయని కథనాలు పేర్కొంటున్నాయి. మరోవైపు సాయికుమార్ కుమార్తె గాయత్రి పాత్రలో సామ్ తనదైన నటనతో ప్రత్యేకంగా నిలిచింది. సామాజిక మాధ్యమాల్లో చురుగ్గా ఉండే సామ్ తాజాగా లంగా ఓణీలో దిగిన ఫొటోలను అభిమానులతో పంచుకుంది. సంప్రదాయ దుస్తుల్లో అందంగా కనిపిస్తున్న ఆమె ఫొటోలు నెటిజన్లను ఆకర్షిస్తున్నాయి. పలువురు అభిమానులు ఆమె రూపాన్ని, ఫొటోలను ప్రశంసిస్తూ వ్యాఖ్యలు చేస్తున్నారు. 'ఇరుముడి' తర్వాత సామ్ సామాజిక మాధ్యమాల్లోనూ మరింత మంది దృష్టిని ఆకర్షిస్తోంది. చిన్న పాత్రలతో తన ప్రయాణాన్ని కొనసాగించిన సామ్‌కు 'ఇరుముడి' మంచి గుర్తింపును తీసుకొచ్చింది. రాబోయే రోజుల్లో ఆమె మరిన్ని చిత్రాల్లో కనిపిస్తుందేమో చూడాలి.



Printed, Published and Owned by **MOHAMMAD ABDUL RAHEMAN,** and Printed at MM Printers, 1-227-3, MM Printers, REBBANA, KUMURAM BHEEM ASIFABAD- 504292, and Published from H.NO. 3-622, BAZARWADI, ASIFABAD, KUMRAMBHEEM ASIFABAD, MANCHERIAL, TELANGANA - 504293. **Editor: MOHAMMAD ABDUL RAHEMAN. PRGI NO : TGTEL/25/A0273** Email: udyamakeratam@gmail.com. Phone No: 9030717172, 9391127717

# పాలకుడిని కాదు..ఎప్పటికీ ప్రజా సేవకుడినే!

- ప్రజల్లో ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నా
- దీన్‌దయాళ్ నగర్‌లో రూ.20 లక్షలతో కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే నాయిని



**శాయంపేట/హనుమకొండ, అక్టోబరు 14 (సమయం న్యూస్)**

ప్రజల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా నిరంతరం పనిచేస్తున్నానని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు. తాను పాలకుడిని కాదని, ప్రజా సేవకుడినని పేర్కొన్నారు. ఎమ్మెల్యేగా గెలిచిన నాటి నుంచి ప్రజల్లోనే ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నానని తెలిపారు. ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు తన క్యాంపు కార్యాలయ తలుపులు ఎల్లప్పుడూ తెరిచే ఉంటాయని స్పష్టం చేశారు. వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలోని 31, 50వ డివిజన్ల పరిధిలోని దీన్‌దయాళ్ నగర్‌లో రూ.20 లక్షల వ్యయంతో నిర్మించనున్న కమ్యూనిటీ హాల్‌కు బుధవారం ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి శంకుస్థాపన చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో కాలనీవాసులను ఉద్దేశించి మాట్లాడారు.పూర్తిస్థాయి గ్రామీణ వాతావరణం కలిగిన శాయంపేట డివిజన్‌లో గత మూడేళ్లుగా అభివృద్ధి పనులకు ప్రాధాన్యమిస్తున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. గతంలో ఈ డివిజన్ పరిధిలోని కొన్ని కాలనీలకు ప్రజాప్రతినిధులు సైతం వెళ్లని పరిస్థితి ఉండేదని, తాను ఎన్నికైనప్పటి నుంచి ప్రజల మధ్య ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నానని పేర్కొన్నారు. ఇప్పటికే పలు కాలనీల్లో అంతర్గత రహదారులు, డ్రైనేజీ వ్యవస్థల అభివృద్ధి పనులు చేపట్టి పూర్తి చేసినట్లు వివరించారు.

**అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు...**

అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా రూ.5 లక్షల ఆర్థిక సాయం అందేలా కృషి చేశామని నాయిని తెలిపారు. ఇంకా ఇళ్లు మంజూరు కావాల్సిన అర్హులైన లబ్ధిదారులు ఉన్నారని, ఈ విషయాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి రానున్న రోజుల్లో అర్హులందరికీ పథకం ద్వారా లబ్ధి చేకూరేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు.సమావేశంలో కాలనీవాసులు పలు స్థానిక సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. స్పందించిన ఆయన కొన్ని సమస్యల పరిష్కారానికి సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి అక్కడికక్కడే చర్యలు చేపట్టారు. మిగిలిన సమస్యలను కూడా ప్రాధాన్య క్రమంలో పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ, వారి అవసరాలను గుర్తించి అభివృద్ధి పనులు చేపట్టడమే తన లక్ష్యమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో డివిజన్ ఇన్‌ఛార్జి మార్క విజయ్, మాజీ కార్పొరేటర్లు మామిండ్ల రాజు, నెక్కొండ కవిత కిషన్, డివిజన్ అధ్యక్షుడు సత్తు రమేష్, మాజీ అధ్యక్షుడు సురేందర్, కాలనీ నాయకులు అశోక్, వెంకన్న పాల్గొన్నారు.

# రైతుల సంక్షేమమే లక్ష్యం... సాగునీటి రంగానికి పెద్దపీట

- తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి

**యాలాల మండలం,14( సమయం న్యూస్)**

యాలాల మండల పరిధిలోని జుంటుపల్లి ఆయకట్టు జలకళ సంతరించుకోనుంది. బుధవారం రూ.5.71 కోట్లతో కాల్వల ఆధునికీకరణకు తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి శ్రీకారం చుట్టారు. జుంటుపల్లి ప్రాజెక్ట్ ఎడమ, కుడి కాల్వల ఆధునీకరణ పనులకు శంకుస్థాపన చేసారు. అనంతరం వారు మాట్లాడుతూ... కోట్పల్లి ప్రాజెక్ట్ ను దాదాపు 100 కోట్లతో పనులు ప్రారంభించామన్నారు. ప్రస్తుతం ఆ పనులు తుది దశకు చేరుకున్నాయన్నారు. జుంటుపల్లి ప్రాజెక్ట్ పనులను 5.71 కోట్లతో పనులు ప్రారంభించామన్నార. రైతులకు చివరి ఆయకట్టు వరకు నిరందించడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామన్నారు. నియోజకవర్గంలో రైతుల సంక్షేమమే లక్ష్యంగా సాగునీటి రంగానికి పెద్ద పీట వేస్తున్నామన్నారు.జుంటుపల్లి ప్రాజెక్ట్ ఎడమ, కుడి కాల్వల ఆధునీకరణతో సాగునీటి వ్యవస్థ మరింత బలోపేతం అవుతుందన్నారు. కాల్వల ఆధునీకరణతో నీటి వృథాను తగ్గించి, చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందుతుందన్నారు. వ్యవసాయానికి మరింత ప్రోత్సాహం లభిస్తుందన్నారు.రైతులకు సాగునీటి కష్టాలను తగ్గించి, వ్యవసాయాన్ని మరింత లాభసాటిగా మార్చేందుకు తప్పకుండా కృషి చేస్తామన్నారు. రైతుల అవసరాలకు అనుగుణంగా సాగునీటి మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. రైతుల ముఖాల్లో ఆనందం, పొలాల్లో పచ్చదనం నింపడమే తన లక్ష్యమని పేర్కొన్నారు. గత పాలకులకు జుంటుపల్లి ప్రాజెక్ట్ కాలువల పునరుద్ధరణ పనులపై ధ్యాసే లేదన్నారు. తాండూరు రైతులకు సాగు నీరు అందించాలనే సోయి లేదనైనారు. జుంటుపల్లి ప్రాజెక్ట్ కోసం ఇంకా ఎన్ని నిధులైన తెచ్చి పనులు పూర్తి చేసి ఆయకట్టు రైతులందరికీ సాగునీరు అందిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు,, నాయకులు, రైతులు పాల్గొన్నారు.



# మహిళల ఆత్మగౌరవానికి రక్షణ కవచం..పోష్ చట్టం!




- పని ప్రదేశాల్లో మహిళలను వేధిస్తే కఠిన చర్యలు
- పోష్ చట్టంపై అవగాహన కలిగి ఉండాలి...డాక్టర్ అనితా రెడ్డి

**హన్మకొండ, అక్టోబరు 14 (సమయం న్యూస్)**

పని ప్రదేశాల్లో మహిళలపై లైంగిక వేధింపులకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటారని పోష్ కమిటీ ఎక్స్‌టర్నల్ మెంబర్, ట్రైనర్, అనురాగ్ హెల్పింగ్ సొసైటీ చైర్మన్ డాక్టర్ అనితా రెడ్డి హెచ్చరించారు. మహిళలు తమ హక్కులు, చట్టాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని సూచించారు.ప్రజ్వల్ ఫార్మర్ ప్రొడ్యూసర్ కంపెనీ లిమిటెడ్, వరంగల్ ఆధ్వర్యంలో బుధవారం సుబేదారీలోని సంస్థ కార్యాలయంలో పోష్ చట్టం-2013పై అవగాహన కార్యక్రమం, సమీక్ష సమావేశం నిర్వహించారు. సంస్థ మేనేజర్ శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డాక్టర్ అనితా రెడ్డి మహిళలకు చట్టంలోని ముఖ్య అంశాలను వివరించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చట్టాలపై పూర్తి అవగాహన ఉన్నప్పుడే వాటిని సమర్థంగా వినియోగించుకోగలుగుతామని తెలిపారు. పని ప్రదేశాల్లో మహిళలు ఎదుర్కొనే లైంగిక వేధింపులను అరికట్టేందుకు పోష్ చట్టం-2013 అమల్లో ఉందని పేర్కొన్నారు. వేధింపులు ఎదురైనప్పుడు ఎలా స్పందించాలి, ఎవరికి ఫిర్యాదు చేయాలి, ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలనే విషయాలపై మహిళలు అవగాహన పెంచుకోవాలని సూచించారు. చట్టంపై అవగాహన ఉంటే సమస్యలను ధైర్యంగా ఎదుర్కొనే అవకాశం ఉంటుందని అన్నారు. ప్రతి సంస్థలో పోష్ కమిటీలు ఏర్పాటు చేయాలి.
కార్యాలయాలు, పాఠశాలలు, కళాశాలలు, మాల్స్ సహా నిబంధనల పరిధిలోకి వచ్చే ప్రతి సంస్థలో పోష్ కమిటీలను ఏర్పాటు చేయాలని డాక్టర్ అనితా రెడ్డి సూచించారు. కమిటీ సభ్యుల పేర్లు, సంప్రదింపు నంబర్లను అందరికీ కనిపించే ప్రదేశాల్లో ప్రదర్శించాలని, ఫిర్యాదుల స్వీకరణకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని తెలిపారు. ఫిర్యాదుల విషయంలో గోప్యతను కాపాడటం ఎంతో ముఖ్యమని పేర్కొన్నారు. వ్యవసాయ రంగంలో పనిచేసే మహిళా కార్మికులు, కూలీలకు సైతం ఈ చట్టంపై అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. గ్రామస్థాయి నుంచి కార్పొరేట్ సంస్థల వరకు విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. ప్రభుత్వ శాఖలు, స్వచ్ఛంద సంస్థలు సమన్వయంతో పనిచేస్తూ మహిళలకు చట్టంపై అవగాహన కల్పించాలని పిలుపునిచ్చారు.అనంతరం పోష్ చట్టంపై రూపొందించిన పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రజ్వల్ సంస్థ ప్రతినిధులు రాంమూర్తి, శ్రీనివాస్, రమేష్, పోష్ కమిటీ సభ్యులు, మహిళలు, సంస్థ సిబ్బంది పాల్గొన్నారు

# పీఐసీ కమిటీ సమావేశంలో 54 ఎజెండా అంశాలకు ఆమోదం

- రైతులకు, ఖాతాదారులకు మెరుగైన సేవలందించాలి
- రుణాల మంజూరు, వసూళ్లు, డిపాజిట్ల పెంపుపై ప్రత్యేక దృష్టి సారించాలి
- బ్యాంకు కార్యకలాపాల్లో పారదర్శకత, జవాబుదారీతనం పాటించాలి జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్



**సంగారెడ్డి సమయం న్యూస్ సంగారెడ్డి, అక్టోబర్**

జిల్లాలో సహకార బ్యాంకుల ద్వారా రైతులకు, ఖాతాదారులకు మెరుగైన సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ అధికారులకు సూచించారు. రైతులకు అవసరమైన రుణాలను సకాలంలో మంజూరు చేయడంతో పాటు, రుణాల వసూళ్లు, డిపాజిట్ల పెంపుపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారుబుధవారం సంగారెడ్డిలోని జిల్లా సహకార కేంద్ర బ్యాంకు లిమిటెడ్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్, బ్యాంకు పర్సన్ ఇన్ చార్జి కమిటీ చైర్మన్ ప్రతీక్ జైన్ అధ్యక్షతన పీఐసీ సమావేశం, జిల్లా స్థాయి మానిటరింగ్ అండ్ రివ్యూ కమిటీ (DLMRC) సమావేశం నిర్వహించారుఈ సందర్భంగా జరిగిన పర్సన్ ఇన్ చార్జి కమిటీ సమావేశంలో 54 ఎజెండా అంశాలకు కమిటీ ఆమోదం తెలిపింది.అనంతరం నిర్వహించిన జిల్లా స్థాయి మానిటరింగ్ అండ్ రివ్యూ కమిటీ సమావేశంలో బ్యాంకు కార్యకలాపాలు, రైతులకు అందిస్తున్న సేవలు, రుణాల మంజూరు, రుణాల వసూళ్లు, డిపాజిట్ల సేకరణ తదితర అంశాలపై కలెక్టర్ సమీక్షించారుఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, బ్యాంకు నిర్దేశించుకున్న లక్ష్యాలను సాధించేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. అర్హులైన రైతులకు నిబంధనల ప్రకారం పంట రుణాలు, ఇతర రుణ సదుపాయాలను సకాలంలో అందించాలని తెలిపారు
మంజూరు చేసిన రుణాల వసూళ్లను వేగవంతం చేసి, నిరర్థక ఆస్తులు (ఎన్‌పీఏలు) పెరగకుండా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. బ్యాంకులో డిపాజిట్లను పెంచేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని, రైతులు, ఖాతాదారులకు బ్యాంకింగ్ సేవలను సులభతరంగా, పారదర్శకంగా సూచించారుబ్యాంకు ఆర్థిక పరిస్థితి, వ్యాపార లావాదేవీలు, నిర్దేశిత లక్ష్యాల సాధనలో పురోగతిని ఎప్పటికప్పుడు సమీక్షించాలని తెలిపారు. ప్రభుత్వ మార్గదర్శకాలు, బ్యాంకు నిబంధనలను తప్పనిసరిగా పాటిస్తూ జవాబుదారీతనంతో వ్యవహరించాలన్నారు.బ్యాంకు అభివృద్ధితో పాటు రైతుల ఆర్థిక ప్రయోజనాలకు ప్రాధాన్యతనిస్తూ, సహకార రంగాన్ని మరింత బలోపేతం చేసేందుకు అధికారులు సమష్టిగా కృషి చేయాలని కలెక్టర్ సూచించారు
అదేవిధంగా, రికవరీ శాతం తక్కువగా ఉన్న రామాయంపేట, సంగారెడ్డి లోకల్ బ్రాంచ్, ఝరాసంగం, శంకరంపేటఆర్, సిద్దిపేట2 శాఖల అధికారులకు వివరణ కోరుతూ నోటీసులు జారీ చేయాలని సూచించారు.ఈ సమావేశంలో డీసీసీబీ బ్యాంకు సీఈఓ ఎం. సురేష్, నాబార్డ్ డీడీఎం ఎం.వి. కృష్ణ తేజ, జనరల్ మేనేజర్లు కె. జనార్దన్, జి. శ్రీనివాస్, డీజీఎంలు ,కె. చంద్రశేఖర్ రెడ్డి, ఎం. రమేష్, ఏజీఎంలు,జి. యాదగిరి, జి. శ్రీనివాస్, కె. వెంకటేశం, ఎల్. సంగమేశ్వర్, ఎ. కొండల్ రెడ్డి పాల్గొన్నారు

# ఆడపడుచు పెళ్లికి ఏజేఆర్ ఫౌండేషన్ పెళ్లి కానుక

**వలిగొండ అక్టోబర్ 14 (సమయం న్యూస్)**

యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలం ఏజేఆర్ ఫౌండేషన్ ఎలిమినేటి జంగారెడ్డి అధినేత తపహిల్వాన్ పూర్ గ్రామానికి చెందిన బండారి పద్మ, మారయ్య కుమార్తె బండారు స్వాతి వివాహ వేడుకల్లో ఎం ఎం ఎస్ ఫంక్షన్ హాల్ లో కుటుంబ సభ్యులకి ఏజెఆర్ ఫౌండేషన్ అధినేత 10000/ రూపాయలు ఏజేఆర్ ఫౌండేషన్ అందించారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రముఖులు గ్రామ యువత పాల్గొన్నారు.



# అయిలమ్మ విగ్రహం కూలిన ఘటనపై సమగ్ర విచారణ జరపాలి

- ఆలేరులో మలిదశ తెలంగాణ ఉద్యమకారుల నల్లజెండాల నిరసన

**ఆలేరు, అక్టోబర్ 14(సమయం న్యూస్)**

మెదక్ జిల్లా కేంద్రంలో తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ స్మారక విగ్రహం కూలిపోయిన ఘటనపై ఆలేరు మలిదశ తెలంగాణ ఉద్యమకారులు తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ఘటనకు గల కారణాలపై సమగ్రంగా, పారదర్శకంగా విచారణ జరిపించాలని, కూలిపోయిన విగ్రహాన్ని ప్రభుత్వమే పునర్నిర్మించాలని వారు డిమాండ్ చేశారు. ఈ నెల 12న మెదక్ జిల్లా కేంద్రంలో ఐలమ్మ స్మారక విగ్రహం కూలిపోవడం తెలంగాణ సమాజాన్ని బాధించిందని ఆలేరు మండల ఉద్యమకారులు పేర్కొన్నారు. ఈ ఘటనకు నిరసనగా బుధవారం ఆలేరులోని చిట్యాల ఐలమ్మ స్మారక విగ్రహం ఎదుట నల్లజెండాలు ప్రదర్శించి నిరసన తెలిపారు. విగ్రహం కూలిపోవడానికి కోతులు బలంగా ఊపడం కారణమని పోలీసులు ప్రాథమికంగా నిర్ధారించినట్లు పత్రికల్లో వచ్చిన కథనాలను వారు ప్రస్తావించారు. అయితే, నిజంగానే కోతుల వల్ల విగ్రహం కూలిపోయిందా? లేక ఎవరైనా ఉద్దేశపూర్వకంగా కూల్చివేశారా? అనే అంశాలపై అధికారులు అన్ని కోణాల్లో విచారణ జరిపి వాస్తవాలను ప్రజలకు వెల్లడించాలని కోరారు.తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో కీలక పాత్ర పోషించిన ఐలమ్మ విగ్రహం కూలిపోవడం బాధాకరమని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా స్మారక విగ్రహాల పరిరక్షణకు తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. కూలిపోయిన విగ్రహాన్ని సంబంధిత ప్రభుత్వ అధికారులు తక్షణమే పునర్నిర్మించి, ఐలమ్మకు తగిన గౌరవం కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో తెలంగాణ మలిదశ ఉద్యమకారుల కమిటీ కోకన్వీనర్ ఇక్కిరి శ్రీనివాస్, రాచకొండ జనార్ధన్, ఎర్ర జాన్సన్, మొరిగాడి అశోక్, చిమ్మి అబ్బాసాయిలు, ఆడేపు బాలస్వామి, బేతి రాములు, రచ్చ రామనర్సయ్య, తునికి దశరథ, మామిడాల నర్సింహులు, సముద్రాల కుమార్, ముదిగొండ మహేందర్, ఆలేటి విజయ్, ఆలేటి రవి పాల్గొన్నారు.



# సిద్ది లింగయ్య స్వామి త్వరగా కోలుకోవాలి



- తాండూరు మాజీ ఎమ్మెల్యే పైలెట్ రోహిత్ రెడ్డి

**తాండూరుమున్సిపల్,అక్టోర్,14(సమయం న్యూస్)**

తాండూరు పట్టణానికి చెందిన తెలుగు పండితులు సిద్ది లింగయ్య స్వామి తీవ్ర అనారోగ్యంతో హైదరాబాదులోని అపోలో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విషయం తెలుసుకున్న తాండూర్ మాజీ ఎమ్మెల్యే పైలెట్ రోహిత్ రెడ్డి బుధవారం ఆసుపత్రికి వెళ్లి ఆయనను పరామర్శించారు. ఈ సందర్భంగా స్వామి గారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని, ఆయన త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ పరామర్శలో యాలాల్ మండల మాజీ జడ్పీటీసీ సభ్యులు సిద్రాల శ్రీనివాస్, తిమ్మాయిపల్లి కృష్ణ, రిపోర్టర్ ఆసిఫ్, జక్కెపల్లి మొగులయ్య, జక్కెపల్లి గణేష్, బాణపూర్ రాజు నాయక్ పాల్గొన్నారు.

# అర్హులైన లబ్ధిదారులకు డిజిటల్ రేషన్ కార్డుల

- పంపిణీ చేసిన మున్సిపల్ చైర్మన్ నందారం ప్రశాంత్

**కొడంగల్ మున్సిపల్ అక్టోబర్,14(సమయం న్యూస్)**

వికారాబాద్ జిల్లా కొడంగల్ పట్టణ కేంద్రంలోని మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ చైర్మన్ నందారం ప్రశాంత్,మున్సిపల్ కమిషనర్ బలరాం నాయక్ ఆధ్వర్యంలో అర్హులైన స్థానిక లబ్ధిదారులకు నూతన డిజిటల్ రేషన్ కార్డులను పంపిణీ చేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ శంకర్ నాయక్, వివిధ వార్డుల కౌన్సిలర్లు, కోఆప్షన్ మెంబర్లు జి.రమేష్ బాబు,సయ్యద్ మునిర్, మున్సిపల్ సిబ్బంది, రేషన్ డీలర్లు, అర్హులైన లబ్ధిదారులు పాల్గొన్నారు.



# స్మార్ట్ కార్డు షాది ముబారక్ కళ్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ కార్యక్రమం

**వలిగొండ అక్టోబర్ 14 (సమయం న్యూస్)**

యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండల కేంద్రంలో మధ్యాహ్నం 3:00 గంటలకు వలిగొండ మండలంలో దేవి శ్రీ గార్డెన్ ఫంక్షన్ హాల్ వలిగొండ నందు స్మార్ట్ రేషన్ కార్డులు, కల్యాణ లక్ష్మి మరియు షాది ముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమం ముఖ్యఅతిథి భువనగిరి శాసనసభ సభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి రావడం జరుగుతుంది. కావున తామంతా ఇట్టి కార్యక్రమమునకు హాజరై విజయవంతం చేయగలరని స్థానిక తహశీల్దార్ దశరథ నాయక్ తెలియజేయడం జరిగింది.



ఉద్యమ కెరటం
UDYAMAKERATAM TELUGU DAILY తెలుగు దినపత్రిక
గురువారం
15 అక్టోబర్ 2026

## ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలి



- **మెరుగైన వైద్య సేవలకు పీహెచ్‌సీ భవనం**
- **నడికూడలో ప్రభుత్వ ఆసుపత్రి, మహిళా సమైక్య భవనాలను పరిశీలించిన ఎమ్మెల్యే 'రేవూరి'**

**నడికూడ/పరకాల, అక్టోబర్ 14 (సమయం న్యూస్)**

మండల కేంద్రంలో నూతనంగా నిర్మించిన ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీహెచ్‌సీ), మహిళా సమైక్య భవనాలను పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి అధికారులతో కలిసి పరిశీలించారు. భవనాల నిర్మాణ పనుల వివరాలను సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. నడికూడ మండలంతో పాటు పరిసర గ్రామాల ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడంలో నూతన పీహెచ్‌సీ భవనం ఉపయోగపడుతుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందుబాటులో ఉండేలా అధికారులు అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆసుపత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్య సదుపాయాలు కల్పించడంపై దృష్టి సారించాలని తెలిపారు.అనంతరం మహిళా సమైక్య భవనాలను పరిశీలించి, వాటి నిర్మాణ పనుల వివరాలను తెలుసుకున్నారు.

## మృతుని కుటుంబానికి యాదవ సంఘం పరామర్శ



- **చిత్రపటానికి నివాళులు.. కుటుంబ సభ్యులకు నాయకుల సానుభూతి**

**నర్సంపేట, అక్టోబర్ 14 (సమయం న్యూస్)**

నియోజకవర్గంలోని మహేశ్వరం గ్రామానికి చెందిన మీరాల రాజ కొమురయ్య ఇటీవల మృతి చెందడంతో, రాష్ట్ర యాదవ సంఘం నాయకులు, వివిధ ప్రజాసంఘాల ప్రతినిధులు బుధవారం ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. కొమురయ్య చిత్రపటానికి నివాళులర్పించి, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. సందర్భంగా నాయకులు కొమురయ్య మృతి పట్ల విచారం వ్యక్తం చేశారు. కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. యాదవ సంఘం ఎల్లప్పుడూ కుటుంబానికి అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. మృతుని కుమారులు, 15వ వార్డు కౌన్సిలర్ అభ్యర్థి మీరాల ఐలయ్య యాదవ్, మీరాల సత్యం, మీరాల సమ్మయ్య యాదవ్‌తో పాటు ఇతర కుటుంబ సభ్యులను నాయకులు పరామర్శించారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర యాదవ సంఘం నాయకులు కొమ్ము రమేష్ యాదవ్, జక్కా అశోక్ యాదవ్, ఆబోతు రాజు యాదవ్, ఖానాపూర్ మండల యాదవ సంఘం అధ్యక్షుడు పులిగిల్ల యాదగిరి యాదవ్, భూస అశోక్ యాదవ్, ఉడుగుల రాజు యాదవ్, 14వ వార్డు బీఆర్ఎస్ కౌన్సిలర్ బూస శిరీష రాజు యాదవ్, బీసీ పవర్ రాష్ట్ర నాయకుడు మచ్చిక రాజు గౌడ్, మాజీ సర్పంచ్ సుధాకర్ లాల్, గ్రామ యాదవ సంఘం నాయకులు, బీసీ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

## వెంకటేశ్వర చేనేత సహకార సంఘ నూతన భవనం



**వలిగొండ అక్టోబర్ 14 (సమయం న్యూస్)**

యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలం గొల్నేపల్లి గ్రామం వెంకటేశ్వర చేనేత సహకార సంఘ నూతన భవనం నిర్మాణ శంకుస్థాపన కార్యక్రమం ఈ రోజు అధ్యక్షులు తాటి రమేష్‌నేత చేతుల మీదుగా నిర్వహించడం జరిగింది. ఈకార్యక్రమంలో సంఘం ఉపాధ్యక్షులు బొమ్మ కృష్ణమూర్తి, కార్యదర్శి మిర్యాల గోవర్ధన్, కోశాధికారి మిర్యాల శ్రీహరి, మిర్యాల దామోదర్, అందె వేణు, మిర్యాల విజయ్, మిర్యాల అండాలు, చలమల్ల రాజేశ్వరి, మాజీ అధ్యక్షులు మిర్యాల వెంకటేష్ , మిర్యాల గౌరయ్య, మిర్యాల అంజయ్య మరియు గ్రామ సర్పంచ్ చెన్నంశెట్టి రాణి మధు, ఉపసర్పంచ్ కృష్ణారెడ్డి వార్డు మెంబర్లు మరియు ఢిల్లి మల్లారెడ్డి , మంగళారం వెంకటరెడ్డి, జోగు యాదయ్య, కలకూరి నర్సింహ,బసిరెడ్డి జలేందర్ రెడ్డి, రడపాక శంకరయ్య, జిల్ల చంద్రయ్య, మిర్యాల బాబురావు, చలమల్ల కృష్ణ, మిర్యాల రాజు, గంగాపురం గోపాల్ మరియు గ్రామ వివిధ కుల సంఘాల అధ్యక్షులు, మరియు గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## వ్యవసాయ భూమిలో వృద్ధుడి మృతదేహం గుర్తింపు

**వలిగొండ అక్టోబర్ 14 (సమయం న్యూస్)**



యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలం పరిధిలోని కేర్చిపల్లి గ్రామ శివారులో వ్యవసాయ భూమిలో లభించిన వృద్ధుడి మృతదేహాన్ని పోలీసులు గుర్తించారు.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పహిల్వాన్‌పురం గ్రామానికి చెందిన దుబ్బ పెంటయ్య (70) ఈ నెల 2వ తేదీన తెల్లవారుజామున సుమారు 3 గంటల సమయంలో ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. దీంతో కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు వలిగొండ పోలీస్ స్టేషన్‌లో మిస్సింగ్ కేసు నమోదు చేశారు.ఈ క్రమంలో అక్టోబర్ 14న ఉదయం సుమారు 10 గంటల సమయంలో కేర్చిపల్లి గ్రామ శివారులో బండారి జంగయ్యకు చెందిన వ్యవసాయ భూమిలో వృద్ధుడి మృతదేహం ఉన్నట్లు పోలీసులకు సమాచారం అందింది. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు విచారణ చేపట్టారు. అక్కడికి వచ్చిన మృతుడి చిన్న కుమారుడు దుబ్బ భాస్కర్ మృతదేహాన్ని తన తండ్రి దుబ్బ పెంటయ్యగా గుర్తించారు.ఈ ఘటనపై పోలీసులు కేసును సెక్షన్ 194 BNSS కింద నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృతదేహానికి సంఘటనా స్థలంలోనే పోస్టుమార్టం నిర్వహించి, మృతికి గల కారణాలను నిర్ధారించేందుకు అవసరమైన చర్యలు చేపట్టారు.

# పీఆర్టీయూ యాదాద్రి జిల్లా కార్యవర్గంలో ఆలేరు ఉపాధ్యాయులకు ప్రాధాన్యం

- **జిల్లా కార్యవర్గంలో పలువురికి కీలక పదవులు**

**ఆలేరు, అక్టోబర్ 14(సమయం న్యూస్)**



ప్రోగ్రెసివ్ రికగ్నైజ్డ్ టీచర్ యూనియన్ (పీఆర్టీయూ) యాదాద్రి భువనగిరి జిల్లా కార్యవర్గంలో ఆలేరు మండలానికి చెందిన పలువురు ఉపాధ్యాయులకు స్థానం లభించింది. జిల్లా కార్యవర్గ సమావేశంలో ఆలేరు మండలానికి చెందిన సభ్యులను అధిక సంఖ్యలో వివిధ పదవులకు నియమించారు. ఈ సందర్భంగా నియామకమైన నాయకులకు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుంకరి భిక్షంగౌడ్, జిల్లా అధ్యక్షుడు గడసంతల మధుసూదన్, జిల్లా ప్రధాన కార్యదర్శి కంచరకుంట్ల వీరారెడ్డి నియామక పత్రాలను అందజేశారు. జిల్లా కార్యవర్గానికి ఎన్నికైన సభ్యులంతా పాఠశాల విద్యా బలోపేతానికి, ఉపాధ్యాయుల సంక్షేమానికి, సంఘ అభివృద్ధికి అంకితభావంతో కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేశారు. విద్యారంగ సమస్యల పరిష్కారానికి, ఉపాధ్యాయుల హక్కుల పరిరక్షణకు తమ వంతు కృషి చేస్తామని పేర్కొన్నారు. జిల్లా కార్యవర్గానికి ఎన్నికైన సభ్యులుజిల్లా అసోసియేట్ అధ్యక్షులుగుండెబోయిన మల్లయ్య జెడ్పీహెచ్ఎస్, గొలనుకొండ,కె చంద్రశేఖర్, జెడ్పీహెచ్ఎస్, కొల్లూరు, రావుల సత్యనారాయణ రెడ్డి జెడ్పీహెచ్ఎస్, ఆలేరు, ఎం.డి. కాజా అలీ, జెడ్పీహెచ్ఎస్, టంగుటూరు, జె సతీష్ కుమార్, ఎంపీపీఎస్, పటేల్‌గూడెం. జిల్లా మహిళా అసోసియేట్ అధ్యక్షురాలుగాఆకారపు జ్యోతిర్మయి, ఎంపీపీఎస్, గొలనుకొండ,జిల్లా ఉపాధ్యక్షుడుగా ఎన్. దశమంతరెడ్డి, ఎంపీపీఎస్, కొలనుపాక, జిల్లా కార్యదర్శులు:అనుమంతుల వెంకటయ్య, సి.ఎస్.ఐ., గుండ్లగూడెం, ఎ సుదర్శన్ - ఎంపీపీఎస్, ఆలేరు. ఈ కార్యక్రమంలో పీఆర్టీయూ జిల్లా సీనియర్ నాయకుడు బూడిద శ్రీనివాస్‌గౌడ్, రాష్ట్ర నాయకుడు రవికుమార్, ఆలేరు మండల అధ్యక్షుడుగా మూల తిరుపతిరెడ్డి, ప్రధాన కార్యదర్శి చామల శ్రీధర్, కార్యవర్గ సభ్యులు రాణి, పూల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# భూ రీసర్వే పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలి

- **వెంకటాపూర్‌లో భూ రీసర్వే పనులను పరిశీలించిన జిల్లా కలెక్టర్ ప్రియాంక.**

**మరికల్ మండలం, అక్టోబర్,14(సమయం న్యూస్)**



జిల్లాలో చేపడుతున్న భూ రీసర్వే పనులను వేగవంతం చేసి, నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ప్రియాంక రెవెన్యూ, సర్వే శాఖ అధికారులను ఆదేశించారు. మరికల్ మండలం వెంకటాపూర్ గ్రామంలో ప్రత్యేక సర్వే బృందాల ఆధ్వర్యంలో కొనసాగుతున్న భూ రీసర్వే పనులను బుధవారం కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించి, పనుల పురోగతిని సమీక్షించారు. నూతనంగా ఏర్పాటు చేసిన, శిక్షణ పొందిన సర్వే బృందాల సేవలను సమర్థవంతంగా వినియోగించుకుంటూ సర్వే ప్రక్రియను వేగవంతం చేయాలని తహసీల్దార్, డిప్యూటీ తహసీల్దార్, మండల సర్వేయర్‌లను ఆదేశించారు. రీసర్వే పనుల పురోగతిని జిల్లా యంత్రాంగం ప్రతిరోజూ పర్యవేక్షిస్తున్నట్లు తెలిపారు.అనంతరం రైతులతో మాట్లాడిన కలెక్టర్, ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలో ఎంపిక చేసిన గ్రామాల్లో భూ రీసర్వే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వివరించారు. భూముల కొలతలను కచ్చితత్వంతో చేపట్టి, భూహద్దులను స్పష్టంగా నిర్ధారించేందుకు ఆధునిక రోవర్ సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తున్నట్లు తెలిపారు. రీసర్వే ద్వారా భూ సరిహద్దుల నిర్ధారణతో పాటు రెవెన్యూ రికార్డుల నిర్వహణలో పారదర్శకత పెరుగుతుందని, భవిష్యత్తులో భూ వివాదాలు తలెత్తకుండా నివారించేందుకు దోహదపడుతుందని పేర్కొన్నారు.వెంకటాపూర్ గ్రామంలో 640 ఎకరాల భూమి ఉంది అని అధికారులు కలెక్టర్‌కు వివరించారు. ఫౌండేషన్ ప్రకారం రీసర్వే నిర్వహించి, 108 మందికి ఫారం11 జారీ చేస్తున్నట్లు తెలిపారు. ఎక్లాస్పూర్ గ్రామంలో 24 మందికి సంబంధించి రీసర్వే ప్రక్రియ చేపట్టినట్లు వెల్లడించారు.సర్వే బృందాల్లో పనిచేస్తున్న చైన్‌మెన్ల వివరాలను కలెక్టర్ అడిగి తెలుసుకోగా, ప్రస్తుతం 24 మంది చైన్‌మెన్లు విధులు నిర్వహిస్తున్నట్లు అధికారులు తెలిపారు. నిర్దేశించిన పనులన్నింటినీ రాబోయే 20 రోజుల్లోగా పూర్తి చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు.భూ రీసర్వే ప్రక్రియను సజావుగా, పారదర్శకంగా పూర్తి చేసేందుకు రైతులు, గ్రామస్థులు సర్వే సిబ్బందికి అవసరమైన సహకారం అందించాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో ఏడీ వేణుగోపాల్ రెడ్డి, తహసీల్దార్ రామ్‌కోటి, రెవెన్యూ, సర్వే శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# రైతులకు రోజుకు 18 గంటల నాణ్యమైన విద్యుత్ ఇవ్వాలి

- **ఆలేరు మండలాన్ని కరువు మండలంగా ప్రకటించి నష్టపరిహారం అందించాలి**
- **సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు చెక్క వెంకటేష్ డిమాండ్**

**ఆలేరు, అక్టోబరు 14(సమయం న్యూస్)**



రైతే దేశానికి వెన్నుముక అని చెప్పే ప్రభుత్వాలు రైతుల సమస్యలపై ఎందుకు నిర్లక్ష్యం వహిస్తున్నాయని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు చెక్క వెంకటేష్ ప్రశ్నించారు. రైతాంగానికి రోజుకు 18 గంటల పాటు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం ఆలేరులోని భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. వర్షాలు సక్రమంగా కురవకపోవడంతో రైతులు ఇప్పటికే ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, పంటలు చేతికొచ్చే సమయంలో సాగునీరు అందక పొలాలు ఎండిపోతుండటంతో అన్నదాతలు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారని తెలిపారు. వ్యవసాయానికి అవసరమైన విద్యుత్‌ను సక్రమంగా సరఫరా చేయకపోవడం వల్ల పంటలకు నీరు అందక రైతులు నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆలేరు మండలాన్ని కరువు మండలంగా ప్రకటించాలిరాష్ట్ర ప్రభుత్వం తక్షణమే స్పందించి ఆలేరు మండలాన్ని కరువు మండలంగా ప్రకటించాలని చెక్క వెంకటేష్ కోరారు. రైతాంగాన్ని ఆదుకునేందుకు కరువు నిధులు విడుదల చేయడంతో పాటు, ఎండిపోయిన పంటలకు నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేశారు. స్థానిక ఎమ్మెల్యే, జిల్లా కలెక్టర్, సంబంధిత అధికారులు రైతుల సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించి, క్షేత్రస్థాయిలో పంట నష్టాలను పరిశీలించాలని సూచించారు. నష్టపోయిన రైతులకు తగిన పరిహారం అందించి వారికి భరోసా కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు.లేదంటే విద్యుత్ కార్యాలయాల ఎదుట ఆందోళనలువ్యవసాయానికి నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తే రైతులను చైతన్యపరిచి విద్యుత్ కార్యాలయాల ఎదుట పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని సీపీఐ నాయకులు హెచ్చరించారు. రైతుల సమస్యలను తక్షణమే పరిష్కరించి వ్యవసాయ రంగాన్ని ఆదుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ ఆలేరు మండల కార్యదర్శి చౌడబోయిన కనకయ్య, మండల కార్యవర్గ సభ్యుడు కందుల మధు, రైతు నాయకులు గిరబోయిన స్వామి, గుండె బాలరాజు, గ్యాదపాక కిష్టయ్య పాల్గొన్నారు.

# మహిళా సాధికారతకు మరో అడుగు..

- **గుడ్డేలుగులపల్లిలో రూ.10 లక్షలతో మహిళా సంఘ భవన నిర్మాణానికి శంకుస్థాపన**
- **మహిళల ఆర్థిక అభివృద్ధి, స్వావలంబనే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం... ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి**

**దుగ్గొండి /వరంగల్, అక్టోబర్ 14 (సమయం న్యూస్)**



మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెంది స్వయం సమృద్ధి సాధించేలా అవసరమైన అవకాశాలు కల్పించడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి అన్నారు. మహిళా సంఘాల బలోపేతానికి, గ్రామీణ మహిళల సాధికారతకు ప్రభుత్వం ప్రాధాన్యమిస్తోందని తెలిపారు.దుగ్గొండి మండలం గుడ్డెలుగులపల్లి గ్రామంలో రూ.10 లక్షల నిధులతో నిర్మించనున్న మహిళా సంఘ భవనానికి బుధవారం ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా ఎదిగి, స్వతంత్రంగా తమ కాళ్లపై తాము నిలబడేలా ప్రభుత్వం వివిధ కార్యక్రమాలను అమలు చేస్తోందని పేర్కొన్నారు.గ్రామీణ ప్రాంతాల్లో మహిళా సంఘాలు బలోపేతం కావడానికి, సమావేశాలు నిర్వహించుకోవడానికి, అభివృద్ధి కార్యక్రమాలపై చర్చించుకోవడానికి ప్రత్యేక భవనాలు ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు. గ్రామాల అభివృద్ధితోపాటు మహిళల సంక్షేమానికి ప్రాధాన్యమిస్తూ అవసరమైన నిధులు కేటాయించి మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామని వివరించారు. మహిళలు సంఘటితంగా ముందుకు సాగుతూ ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు. గ్రామాల అభివృద్ధి, లక్ష్యంగా ప్రజలకు అవసరమైన సదుపాయాలు కల్పించేందుకు నిరంతరం కృషి చేస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, కాంగ్రెస్ పార్టీ, మహిళా సంఘాల సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# కరెంట్ కాల్చింది.. కంజర్ల ఫౌండేషన్ ఆదుకుంది

- **నిత్యావసరాలతో నిండిన మానవత్వం.**
- **బాధిత కుటుంబాన్ని ఆదుకున్న కంజర్ల విజయలక్ష్మి ఫౌండేషన్.**
- **బాధిత కుటుంబానికి తమ ఫౌండేషన్ ఎల్లప్పుడూ అండగాఉంటుంది-**
- **జిల్లా మాజీ కో అప్షన్ అధ్యక్షులు అక్బర్ బాబ**

**యాలాల మండలం, అక్టోబర్,14(సమయం న్యూస్)**

యాలాల గ్రామంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా పెను ప్రమాదం చోటుచేసుకుంది. కుమ్మరి బుచ్చమ్మకు చెందిన ఇల్లు పూర్తిగా దగ్ధమైంది.ఈ ప్రమాదంలో ఇంట్లోని వస్తువులతో పాటు కష్టపడి దాచుకున్న నగదు కూడా కాలిపోయింది. దీంతో సుమారు రూ.50 వేల వరకు ఆస్తి నష్టం వాటిల్లినట్లు బాధితురాలు తెలిపింది. ఒక్కసారిగా ఇల్లు కాలిపోవడంతో బుచ్చమ్మ కుటుంబం రోడ్డున పడింది.విషయం తెలుసుకున్న కంజర్ల విజయలక్ష్మి ఫౌండేషన్ సభ్యులు వెంటనే స్పందించారు. బాధిత కుటుంబాన్ని పరామర్శించి, మానవతా దృక్పథంతో నిత్యావసర వస్తువులను అందజేసి అండగా నిలిచారు.ఈ సందర్భంగా ఫౌండేషన్ ప్రతినిధులు మాజీ జిల్లా కో ఆప్షన్ అధ్యక్షులు అక్బర్ బాబ, మాట్లాడుతూ బాధిత కుటుంబానికి తమ ఫౌండేషన్ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని, భవిష్యత్తులో అవసరమైన సహాయం అందిస్తామని" హామీ ఇచ్చారు.



# పాడి రైతుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

- మదనపల్లిలో 46 మంది పాల ఉత్పత్తిదారులకు రూ.2.50 లక్షల దసరా బోనస్ పంపిణీ

ఆలేరు, అక్టోబర్ 14(సమయం న్యూస్)



పాడి రైతుల ఆర్థిక అభివృద్ధికి ప్రభుత్వం అండగా నిలుస్తుందని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య అన్నారు. యాదాద్రి భువనగిరి జిల్లా మందనపల్లి గ్రామంలోని మదర్ డెయిరీ పాల ఉత్పత్తిదారులకు దసరా బోనస్‌గా రూ.2.50 లక్షలను 46 మంది రైతులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన బీర్ల ఐలయ్య మాట్లాడుతూ, పాడి రైతుల సంక్షేమానికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందని తెలిపారు. గతంలో నష్టాల్లో ఉన్న మదర్ డెయిరీని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఎంపీ, మంత్రుల సహకారంతో నేషనల్ డెయిరీకి అప్పగించి తిరిగి అభివృద్ధి బాటలోకి తీసుకొచ్చామని ఆయన పేర్కొన్నారు. ఒకప్పుడు నష్టాలతో ఇబ్బందులు ఎదుర్కొన్న డెయిరీ నుంచి నేడు పాల ఉత్పత్తిదారులకు బోనస్ పంపిణీ చేసే స్థాయికి చేరుకోవడం సంతోషంగా ఉందన్నారు. ఇది ప్రజా పాలనకు నిదర్శనమని పేర్కొన్నారు.పాడి రైతులకు మరిన్ని ప్రోత్సాహకాలురానున్న రోజుల్లో పాడి రైతులకు బీమా సదుపాయాలు, రుణాలు అందించేందుకు కృషి చేస్తామని బీర్ల ఐలయ్య హామీ ఇచ్చారు. బీర్ల ఫౌండేషన్ ఆధ్వర్యంలో పాడి రైతులకు పాల క్యాన్లు అందజేయడంతోపాటు, డెయిరీ ద్వారా ప్రతి సంవత్సరం రూ.10 లక్షల బోనస్ పంపిణీ చేసే విధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. పాడి పరిశ్రమపై ఆధారపడిన రైతుల ఆదాయం పెంచి, వారిని ఆర్థికంగా బలోపేతం చేసేందుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తానని చెప్పారు.కార్యక్రమంలో పాల్గొన్న ప్రముఖులు ఈ కార్యక్రమంలో నార్మల్ మదర్ డెయిరీ చైర్మన్ గుడిపాటి మధుసూదన్‌రెడ్డి, డైరెక్టర్లు, మదనపల్లి గ్రామ సర్పంచ్, ఉపసర్పంచ్, ఎనిమిది మంది వార్డు సభ్యులు, మదనపల్లి పాల కేంద్రం చైర్మన్ కడకంచి శ్రీశైలం, తొమ్మిది మంది డైరెక్టర్లు, యాదాద్రి భువనగిరి జిల్లా యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ఊట్కూరి సురేష్‌గౌడ్, గ్రామ కాంగ్రెస్ శాఖ అధ్యక్షుడు పూరుమ భాస్కర్‌తో పాటు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, యువజన నాయకులు, కార్యకర్తలు, పాల ఉత్పత్తిదారులు పాల్గొన్నారు.

# జర్నలిస్టులు ఆరోగ్య పరిరక్షణకు ప్రాధాన్యమివ్వాలి

- జర్నలిస్టులు, వారి కుటుంబ సభ్యులకు ఉచిత వైద్య శిబిరం

సమయం న్యూస్ అక్టోబర్ అక్టోబర్ 14



విధి నిర్వహణలో నిరంతరం శ్రమించే పాత్రికేయులు తమ ఆరోగ్య పరిరక్షణకు తగిన ప్రాధాన్యమివ్వాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ సూచించారు. ప్రజలకు, ప్రభుత్వానికి వారధిగా ఉంటూ ప్రజా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంలో పాత్రికేయులు కీలక పాత్ర పోషిస్తున్నారని పేర్కొన్నారు. సన్‌రైజ్ ఆసుపత్రి, సహకారంతో, తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టుల జిల్లా సంఘం ఆధ్వర్యంలో బుధవారం సన్‌రైజ్ ఆసుపత్రి లో జర్నలిస్టులు, వారి కుటుంబ సభ్యుల కోసం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని జిల్లా కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకురావడంలో పాత్రికేయుల సేవలు అభినందనీయమన్నారు. విధి నిర్వహణలో ఎదురయ్యే పని ఒత్తిడి, సమయాభావం కారణంగా ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేయకూడదని సూచించారు. క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవడం, ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవడం ద్వారా అనారోగ్య సమస్యలను ముందుగానే గుర్తించి నివారించవచ్చని తెలిపారు. జర్నలిస్టులు,తమతో పాటు వారి కుటుంబ సభ్యుల ఆరోగ్యంపై కూడా ప్రత్యేక శ్రద్ధ చూపాలని పేర్కొన్నారు.ఈ వైద్య శిబిరంలో వైద్య నిపుణులు ఉచిత వైద్య సంప్రదింపులు అందించడంతోపాటు అవసరమైన వారికి ఈసీజీ, 2డీ ఎకో, రక్త పరీక్షలు నిర్వహించారు. ఉచితంగా మందులు పంపిణీ చేశారు. గుండె, ఊపిరితిత్తులు, ఎముకలు, కీళ్లు, మధుమేహం, నాడీ సంబంధిత సమస్యలతోపాటు మహిళల ఆరోగ్య సమస్యలకు వైద్య సేవలు అందించారు. ఈ కార్యక్రమంలో టీయూడబ్ల్యూజే-ఐజేయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఫైజల్ అలీ, జిల్లా అధ్యక్షుడు బండారి యాదగిరి, టీఎన్జీవో జిల్లా అధ్యక్షుడు జావేద్ అలీ, సన్‌రైజ్ ఆసుపత్రి చైర్మన్ డాక్టర్ స్వామి గౌడ్, రథసారథి తెలుగు దినపత్రిక సంపాదకుడు సంతోష్ గౌడ్, జర్నలిస్టు సంఘాల నాయకులు, పాత్రికేయులు పాల్గొన్నారు.

# రైతు సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 26న చలో మండల కార్యాలయాలు

- రైతులంతా అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి
- భారతీయ కిసాన్ సంఘ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పన్యాల వెంకటరెడ్డి

ఆలేరు, అక్టోబర్ 14(సమయం న్యూస్):




రైతుల సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 26న జిల్లా వ్యాప్తంగా నిర్వహించనున్న 'చలో మండల కార్యాలయాలు' కార్యక్రమాన్ని రైతులంతా అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని భారతీయ కిసాన్ సంఘ్ (బీకేఎస్) రాష్ట్ర ఉపాధ్యక్షుడు పన్యాల వెంకటరెడ్డి, రాష్ట్ర కార్యదర్శి బౌరంపేట మల్లారెడ్డి లు పిలుపునిచ్చారు. యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలోని శ్రీవాణి విద్యాలయంలో బుధవారం జిల్లా అధ్యక్షుడు పోకల యాదగిరి అధ్యక్షతన నిర్వహించిన జిల్లా సమావేశంలో వారు మాట్లాడారు. రైతులకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాడే రైతు సంఘం భారతీయ కిసాన్ సంఘ్ అని నాయకులు పేర్కొన్నారు. రైతుల సంక్షేమం, వ్యవసాయ రంగ అభివృద్ధి కోసం ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి రాకముందు వరంగల్‌లో ప్రకటించిన రైతు డిక్లరేషన్‌ను అమలు చేయాలని కోరారు.రైతులకు 18 గంటల నాణ్యమైన విద్యుత్తు అందించాలివ్యవసాయానికి నిరంతర విద్యుత్తు ఎంతో అవసరమని, రైతులకు రోజుకు కనీసం 18 గంటల నాణ్యమైన విద్యుత్తును అందించాలని నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రైతులకు ఇచ్చిన హామీ మేరకు రుణమాఫీని అమలు చేసి, వ్యవసాయ రంగాన్ని బలోపేతం చేయాలని కోరారు. రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం గుర్తించి వాటి పరిష్కారానికి చర్యలు చేపట్టాలని సూచించారు.ఈ నేపథ్యంలో ఈ నెల 26న జిల్లా వ్యాప్తంగా మండల కార్యాలయాల ఎదుట నిర్వహించనున్న చలో మండల కార్యాలయాల కార్యక్రమంలో రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు.చలో మండల కార్యాలయాల కరపత్రం విడుదలసమావేశం అనంతరం చలో మండల కార్యాలయాల కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాన్ని నాయకులు విడుదల చేశారు. రైతుల హక్కుల సాధన, సమస్యల పరిష్కారం కోసం సంఘటితంగా ముందుకు సాగాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు.ఈ సమావేశంలో బీకేఎస్ జిల్లా కార్యదర్శి కాటం అయిలేష్‌కుమార్, జిల్లా ఉపాధ్యక్షుడు దంతూరి కుమారస్వామి గౌడ్, జిల్లా సహాయ కార్యదర్శి తునికి నరేందర్, జిల్లా కార్యాలయ ప్రముఖ్ రావి నరసింహారెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు పిన్నపురెడ్డి సుధీర్‌రెడ్డి, బర్మ జంగయ్య, బొర్ర కిష్టయ్య, రాజాపేట మండల అధ్యక్షుడు పారుపల్లి సంజీవరెడ్డి, తుర్కపల్లి మండల అధ్యక్షుడు కడియాల అశోక్ తదితరులు పాల్గొన్నారు.

# ఆలేరులో ఎమ్మెల్యే పలు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు శ్రీకారం

- పాల ఉత్పత్తిదారులకు బోనస్ పంపిణీ.. రూ.5.90 కోట్లతో బీటీ రోడ్డు పనులకు శ్రీకారం
- స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ.. ఎమ్మెల్సీ అభ్యర్థి విజయానికి కాంగ్రెస్ సన్నాహాలు

ఆలేరు, అక్టోబరు 14(సమయం న్యూస్)



ఆలేరు నియోజకవర్గంలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై కాంగ్రెస్ ప్రభుత్వం దృష్టి సారిస్తోందని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య అన్నారు. బుధవారం ఆలేరు మండల పరిధిలోని పలు గ్రామాలలో పాడి రైతులకు బోనస్ పంపిణీ, రహదారి నిర్మాణ పనుల ప్రారంభం, స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీతో పాటు పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి కాంగ్రెస్ పార్టీ సన్నాహక సమావేశం నిర్వహించారు.పాడి రైతులకు బోనస్ పంపిణీఆలేరు మండలంలోని గోలనుకొండ, శారాజీపేట, మందనపల్లి గ్రామాల్లో మదర్ డెయిరీ పాల ఉత్పత్తిదారులకు బోనస్ పంపిణీ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య, మదర్ డెయిరీ చైర్మన్ మధుసూధన్ రెడ్డి, డైరెక్టర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పాడి రైతుల కష్టానికి గుర్తింపునివ్వడంతో పాటు వారి ఆదాయాన్ని పెంచేందుకు బోనస్ పంపిణీ దోహదపడుతుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో గతంలోనూ బోనస్ అందించామని, మధ్యలో బీఆర్ఎస్ ప్రభుత్వం రైతుల ప్రయోజనాలను విస్మరించిందని విమర్శించారు. తిరిగి కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రులు, ఎంపీ సహకారంతో పాల ఉత్పత్తిదారులకు బోనస్ అందిస్తున్నట్లు తెలిపారు.వ్యవసాయానికి అనుబంధంగా పాడి పరిశ్రమను కొనసాగిస్తున్న రైతులకు పాల ఉత్పత్తి ద్వారా స్థిరమైన ఆదాయం లభిస్తుందని పేర్కొన్నారు. నాణ్యమైన పాలను ఉత్పత్తి చేయడంతో పాటు పశుపోషణలో ఆధునిక పద్ధతులు పాటించి పాల ఉత్పత్తిని పెంచుకోవాలని సూచించారు. మదర్ డెయిరీ ద్వారా పాల సేకరణ, ప్రోత్సాహకాలు, రైతుల సంక్షేమ కార్యక్రమాలు పాడి పరిశ్రమ అభివృద్ధికి తోడ్పడతాయని చెప్పారు.రూ.5.90 కోట్లతో బీటీ రోడ్డు నిర్మాణంఆలేరు మండలం గుండ్లగూడెం గ్రామంలో రూ.5.90 కోట్ల వ్యయంతో 5.2 కిలోమీటర్ల మేర నిర్మించనున్న బీటీ రోడ్డు పనులకు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య శ్రీకారం చుట్టారు. కొబ్బరికాయ కొట్టి పనులను ప్రారంభించడంతో పాటు స్వయంగా జేసీబీ నడిపి నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈ రహదారి అందుబాటులోకి వస్తే గ్రామ ప్రజల రాకపోకలకు సౌకర్యం కలగడంతో పాటు రవాణా ఇబ్బందులు తగ్గుతాయని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలను మెరుగుపరిచేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. రోడ్డు నిర్మాణ పనులను నాణ్యతా ప్రమాణాలతో, నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు.లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీఆలేరు పట్టణంలోని వైఎస్ఎన్ గార్డెన్స్‌లో మండల, పట్టణ పరిధిలోని లబ్ధిదారులకు నూతన స్మార్ట్ రేషన్ కార్డులను ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య పంపిణీ చేశారు. అర్హులైన కుటుంబాలకు ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. రేషన్ కార్డుల ద్వారా అర్హత కలిగిన కుటుంబాలకు ప్రజాపంపిణీ వ్యవస్థలో ప్రయోజనాలు పొందే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు.ఎమ్మెల్సీ అభ్యర్థి గెలుపునకు సన్నాహక సమావేశంవరంగల్, ఖమ్మం, నల్లగొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి విజయానికి కృషి చేయాలని ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఆలేరు పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆయన ఆధ్వర్యంలో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్నికల కార్యాచరణ, పట్టభద్రుల ఓటర్లను సమన్వయం చేసుకోవడం, ఓటరు జాబితాలో పేర్లను పరిశీలించడం, అర్హులైన పట్టభద్రులు ఓటు హక్కును వినియోగించుకునేలా అవగాహన కల్పించడం వంటి అంశాలపై చర్చించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేస్తూ పట్టభద్రులను కలవాలని, వారి సమస్యలు, ఆకాంక్షలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. ఎన్నికల ప్రచారాన్ని సమర్థవంతంగా నిర్వహించి పార్టీ అభ్యర్థి విజయానికి కృషి చేయాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమాల్లో స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, మదర్ డెయిరీ ప్రతినిధులు, పాల ఉత్పత్తిదారులు, పట్టభద్రులు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

# రైతుల పొలాల్లో ఆయిల్ పామ్ ఫ్రూట్



- బంచెస్ (FFBs) కోత చేపట్టారు. పంట కో, హార్వెస్టింగ్ పద్ధతులు,

సంగారెడ్డి జిల్లా.సమయం న్యూస్ అక్టోబర్ 14

వివిధ మండలాల్లో బుధవారం రోజు జిల్లా ఉద్యాన మరియు పట్టు పరిశ్రమ అధికారి శ్రీ పి. సోమేశ్వరరావు ఆధ్వర్యంలో రాయికోడ్, మొగుడంపల్లి, నల్కల్ మరియు నారాయణ ఖేడ్ మండలాల్లో ఆయిల్ పామ్ సాగు చేస్తున్న రైతుల క్షేత్రాలను సందర్శించి, ఆయిల్ పామ్ పంట కోతపై డ్రై రన్ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమంలో భాగంగా రైతుల పొలాల్లో ఆయిల్ పామ్ ఫ్రూట్ బంచెస్ (FFBs) కోత చేపట్టారు. పంట కోత, హార్వెస్టింగ్ పద్ధతులు, గెలల సేకరణ, లోడింగ్ మరియు రవాణా ప్రక్రియలపై రైతులకు అవగాహన కల్పించారు. ఆయిల్ పామ్ గెలలను సరైన పద్ధతిలో కోయడం, కోత అనంతరం వాటిని సకాలంలో పరిశ్రమకు రవాణా చేయడం ద్వారా నాణ్యతను కాపాడుకోవడంతో పాటు రైతులు మెరుగైన ఆదాయం పొందవచ్చని వివరించారుఈ డ్రై రన్ కార్యక్రమంలో భాగంగా సుమారు 35 ఎకరాల్లో పంట కోత చేపట్టి, దాదాపు 10 టన్నుల ఆయిల్ పామ్ ఫ్రూట్ బంచులను సేకరించడం జరిగిందిఈ కార్యక్రమంలో జిల్లా ఉద్యాన మరియు పట్టు పరిశ్రమ అధికారి శ్రీ పి. సోమేశ్వరరావు, గోద్రెజ్ ఆగ్రోవెట్ సంస్థ జనరల్ మేనేజర్ స్వీటీ వేగుంట, అసిస్టెంట్ మేనేజర్ శ్రీ ఈశ్వర్ రెడ్డి, క్లస్టర్ లెవెల్ మేనేజర్ శ్రీ కొండల రావు మరియు ఆయిల్ పామ్ రైతులు పాల్గొన్నారుఈ కార్యక్రమం ద్వారా ఆయిల్ పామ్ రైతులకు శాస్త్రీయ పద్ధతుల్లో పంట కోత, గెలల సేకరణ మరియు రవాణాపై అవగాహన కల్పించడం, పంట కోతలో నష్టాలను తగ్గించడం, సమర్థవంతమైన హార్వెస్టింగ్ విధానాలను ప్రోత్సహించడం లక్ష్యంగా పెట్టుకున్నారు.

# వ్యాధుల నివారణపై జీజీహెచ్‌లో అవగాహన కార్యక్రమం




- హెపటైటిస్, హెచ్ఐవీ, లైంగిక వ్యాధులపై ప్రజలకు అవగాహన

మల్కాజిగిరి, సమయం

మల్కాజిగిరి ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి (జీజీహెచ్)లో వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో వివిధ వ్యాధుల నివారణ, వ్యక్తిగత ఆరోగ్య పరిరక్షణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. హెపటైటిస్ బి, సి, హెచ్ఐవీ, లైంగికంగా సంక్రమించే వ్యాధులు (ఎస్‌టీఐలు), సిఫిలిస్ వంటి వ్యాధుల వ్యాప్తి, నివారణ చర్యలు, ముందస్తు పరీక్షలు, సకాలంలో చికిత్స పొందాల్సిన ఆవశ్యకతపై వైద్యులు వివరించారు.వ్యాధుల పట్ల ప్రజల్లో ఉన్న అపోహలను తొలగించుకోవాలని, ఆరోగ్య సమస్యలు తలెత్తినప్పుడు నిర్లక్ష్యం చేయకుండా వైద్యులను సంప్రదించాలని సూచించారు. వ్యక్తిగత ఆరోగ్యంపై శ్రద్ధ వహిస్తూ అవసరమైన పరీక్షలు చేయించుకోవడం ద్వారా వ్యాధులను ముందుగానే గుర్తించి, తగిన చికిత్స పొందవచ్చని తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో అందుబాటులో ఉన్న వైద్య సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రాధా, ఆర్ఎంఓ డాక్టర్ సాయి శోభ, డిప్యూటీ ఆర్ఎంఓ డాక్టర్ మాధురి, పీఆర్వో డాక్టర్ పి. వినోద్, డాక్టర్ సంజీవ్ నాయక్, డాక్టర్ సంతోష్, డాక్టర్ ప్రతిమ రాజ్, డాక్టర్ హరిత, డాక్టర్ రవీందర్, డాక్టర్ తేజస్విని, డాక్టర్ కళ్యాణి, డాక్టర్ మమత, డాక్టర్ గ్రేస్, డాక్టర్ సౌందర్యతో పాటు వివిధ విభాగాల వైద్యులు పాల్గొన్నారు.అలాగే ఐసీటీసీ కౌన్సిలర్లు రమేష్, కల్పన, గౌరి, ల్యాబ్ టెక్నీషియన్లు రాజేందర్, దివ్య, శారద, ఏడీ రమేష్, ఆఫీస్ సూపరింటెండెంట్లు విష్ణు, వినయ్, నాయక్, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ యవ్వన్, నర్సింగ్ సూపరింటెండెంట్లు రోసెలీన్, ఫాతిమా, హెడ్ నర్స్ రాజకుమారి, నర్సింగ్ సిబ్బంది, డేటా ఎంట్రీ ఆపరేటర్లు, నాలుగో తరగతి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.ప్రజారోగ్య పరిరక్షణకు అవగాహనే కీలకం.. వ్యాధుల నివారణకు ముందస్తు పరీక్షలు, సకాలంలో చికిత్స ఎంతో అవసరమని వైద్యులు సూచించారు.

# సంఘటిత శక్తితో మహిళల ఆర్థిక ప్రగతి!

- మహిళలను కోటీశ్వరులను చేయడమే లక్ష్యం
- తొగర్రాయిలో మహిళా సంఘం భవన నిర్మాణానికి శంకుస్థాపన
- రూ.10 లక్షలతో నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టిన ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి

దుగ్గొండి/వరంగల్, అక్టోబర్ 14 (సమయం న్యూస్)

మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసి, స్వయం ఉపాధి ద్వారా కోటీశ్వరులుగా ఎదిగేలా చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి అన్నారు. దుగ్గొండి మండలం తొగర్రాయి గ్రామంలో మహిళా సంఘం భవన నిర్మాణానికి రూ.10 లక్షల నిధులతో ఆయన శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మహిళా సంఘాలను బలోపేతం చేయడంతో పాటు గ్రామీణ మహిళలకు ఉపాధి అవకాశాలు కల్పించి, వారి జీవన ప్రమాణాలను మెరుగుపరిచేందుకు ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యమిస్తోందన్నారు. మహిళలు ఆర్థికంగా ఎదిగి, స్వయంగా ఉపాధి అవకాశాలను సృష్టించుకునే స్థాయికి చేరాలన్నదే ప్రభుత్వ సంకల్పమని పేర్కొన్నారు.గ్రామీణ ప్రాంతాల్లో మహిళా సంఘాలకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. మహిళా సంఘం భవనం అందుబాటులోకి వస్తే సభ్యులు సమావేశాలు నిర్వహించుకోవడంతో పాటు స్వయం సహాయక సంఘాల కార్యకలాపాలను మరింత సమర్థంగా కొనసాగించేందుకు వీలవుతుందన్నారుగ్రామాల అభివృద్ధి, మహిళా సాధికారత లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతోందని, ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యమిస్తున్నట్లు ఎమ్మెల్యే స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు, మహిళా సంఘాల సభ్యులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# జిల్లా ఎస్పీ స్నేహా మెహ్రా (ఐపీఎస్)అధ్యక్షతన

- **జిల్లా పోలీస్ కార్యాలయంలో పోలీస్ అధికారులతో సమీక్ష సమావేశం**

**వికారాబాద్,అక్టోబర్,14 (సమయం న్యూస్)**

వికారాబాద్ జిల్లా పోలీస్ కార్యాలయంలో జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా, IPS అధ్యక్షతన బుధవారం పోలీస్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణ, కేసుల దర్యాప్తు, పెండింగ్ కేసుల పరిష్కారం, సాంకేతిక పరిజ్ఞానం వినియోగం, రోడ్డు భద్రత, మహిళలు మరియు పిల్లల భద్రత, సైబర్ నేరాల నివారణ తదితర అంశాలను ఎస్పీ సమీక్షించి అధికారులకు పలు కీలక సూచనలు చేశారు.CCTNS 3.0, Samanvay, Sahyog మరియు TGCOP వంటి అప్లికేషన్లను క్షేత్రస్థాయి అధికారులు పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని సూచించారు. ముఖ్యంగా ప్రాపర్టీ, సైబర్, ఎన్‌డీపీఎస్ కేసులతో పాటు దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న కేసులు, నాన్ బెయిలబుల్ వారెంట్లు (NBW), డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులపై ప్రత్యేక దృష్టి సారించి, వీలైనంత త్వరగా పరిష్కరించాలని ఆదేశించారు. కేసుల దర్యాప్తు నాణ్యతను మెరుగుపరచాలని, ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబొరేటరీ (FSL) నివేదికలను సకాలంలో పొందేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని తెలిపారు.మహిళలు మరియు పిల్లల భద్రతకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని, పోక్సో, ఎస్సీ/ఎస్టీ అట్రాసిటీస్ మరియు మిస్సింగ్ కేసుల దర్యాప్తును వేగవంతం చేయాలని ఆదేశించారు. నిందితుల అరెస్టుల్లో జాప్యం జరగకుండా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. మైనర్ల డ్రైవింగ్‌పై కఠిన చర్యలు చేపట్టడంతో పాటు విద్యార్థులు, తల్లిదండ్రులకు రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు.రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రమాదాలు ఎక్కువగా జరిగే బ్లాక్ స్పాట్‌లను గుర్తించి తగిన చర్యలు చేపట్టాలని, హెల్మెట్, సీట్ బెల్ట్ వినియోగంపై ప్రత్యేక తనిఖీలు నిర్వహించాలని ఆదేశించారు. జిల్లాలో సీసీటీవీ కెమెరాల కవరేజీని పెంచడంతో పాటు ఇప్పటికే ఏర్పాటు చేసిన కెమెరాలు నిరంతరం పనిచేసేలా పర్యవేక్షించాలని సూచించారు. రాత్రి వేళల్లో పెట్రోలింగ్, వాహన తనిఖీలను మరింత ముమ్మరం చేయాలని తెలిపారు.పోలీస్ స్టేషన్ల పరిధిలో నేరాల నియంత్రణకు నిరంతర నిఘా కొనసాగించాలని, ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులపై తక్షణమే స్పందించి చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. పోలీస్ స్టేషన్లలో నమోదైన కేసుల పురోగతిని నిరంతరం సమీక్షిస్తూ, బాధితులకు సకాలంలో న్యాయం అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు."ప్రజలకు మెరుగైన పోలీసింగ్ అందించడమే లక్ష్యం. ప్రతి అధికారి బాధ్యతాయుతంగా, సమన్వయంతో విధులు నిర్వర్తించాలి. పెండింగ్ కేసుల పరిష్కారానికి ప్రాధాన్యతనిస్తూ, నేరాల నియంత్రణకు సమర్థవంతమైన చర్యలు చేపట్టాలి. ప్రజల భద్రతకు కట్టుబడి ప్రతి ఒక్కరూ నిరంతరం పనిచేయాలి," అని జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా, IPS తెలిపారు.ఈ సమీక్షా సమావేశంలో అదనపు ఎస్పీ రాజేష్ మీనా, డీసీఆర్‌బీ డీఎస్పీ జనయ్య, వికారాబాద్ డీఎస్పీ అంజయ్య, తాండూరు డీఎస్పీ ఎన్. యాదయ్య, డీటీసీ డీఎస్పీ శ్రీనివాసులు, పరిగి డీఎస్పీ ఎన్.శ్రీనివాసు ఇతర పోలీస్ అధికారులు పాల్గొన్నారు.



# భూముల రీ సర్వేను పకడ్బందీగా నిర్వహించాలి

- **శిక్షణలో నేర్చుకున్న అంశాలను క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలు చేయాలి.**
- **జిల్లా కలెక్టర్ ప్రియాంక.**

**నారాయణపేట, అక్టోబర్,14(సమయం న్యూస్)**

భూముల రీ సర్వే ప్రక్రియను నిబంధనలకు అనుగుణంగా, జిల్లాలో పారదర్శకంగా, పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ప్రియాంక సంబంధిత అధికారులను ఆదేశించారు. రీ సర్వేకు సంబంధించి శిక్షణా కార్యక్రమంలో నేర్చుకున్న అంశాలను క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలు చేస్తూ, భూ సర్వే ప్రక్రియను నిర్దేశిత మార్గదర్శకాల ప్రకారం చేపట్టాలని సూచించారు. జిల్లా కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో బుధవారం సాయంత్రం తహసీల్దార్లు, డిప్యూటీ తహసీల్దార్లు (డీటీలు), రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు (ఆర్‌ఐలు), గ్రామ పంచాయతీ అధికారులు (జీపీవోలు), సర్వేయర్లకు భూముల రీ సర్వేపై శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్ ప్రియాంక, భూముల రీ సర్వే నిర్వహణలో అనుసరించాల్సిన విధానాలు, సర్వే ప్రక్రియలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సంబంధిత రికార్డుల నిర్వహణ, క్షేత్రస్థాయిలో ఎదురయ్యే సమస్యలను పరిష్కరించే అంశాలపై అధికారులకు పలు సూచనలు చేశారు.భూముల రీ సర్వే అనేది భూములకు సంబంధించిన వివరాలను కచ్చితంగా గుర్తించి, భూ రికార్డులను క్రమబద్ధీకరించడంలో కీలకమైన ప్రక్రియ అని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో సర్వే నిర్వహించే సమయంలో భూముల సరిహద్దులు, విస్తీర్ణం, అందుబాటులో ఉన్న రెవెన్యూ రికార్డులు, ఇతర సంబంధిత వివరాలను క్షుణ్ణంగా పరిశీలించాలని సూచించారు. సర్వే ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా, ప్రతి అంశాన్ని నిశితంగా పరిశీలిస్తూ బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలని ఆదేశించారు.శిక్షణా కార్యక్రమంలో వివరించిన సాంకేతిక అంశాలు, విధివిధానాలపై అధికారులు పూర్తి అవగాహన కలిగి ఉండాలని, క్షేత్రస్థాయిలో వాటిని ఆచరణలో పెట్టాలని కలెక్టర్ సూచించారు. సర్వే నిర్వహణలో ఎదురయ్యే సందేహాలను సంబంధిత ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువచ్చి, తగిన మార్గదర్శకత్వంతో సమస్యలను పరిష్కరించుకోవాలని తెలిపారు. సర్వే ప్రక్రియలో సమన్వయంతో పనిచేస్తూ, తమకు కేటాయించిన బాధ్యతలను నిర్ణీత సమయంలో పూర్తి చేసేందుకు కృషి చేయాలని ఆదేశించారు.రెవెన్యూ అధికారులు, సర్వే సిబ్బంది పరస్పర సమన్వయంతో పనిచేస్తే రీ సర్వే ప్రక్రియను మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు అవకాశం ఉంటుందని కలెక్టర్ పేర్కొన్నారు. శిక్షణను కేవలం అవగాహన కార్యక్రమంగా మాత్రమే పరిమితం చేయకుండా, అందులో నేర్చుకున్న అంశాలను క్షేత్రస్థాయిలో అమలు చేసి, భూ సర్వేలో కచ్చితత్వం, పారదర్శకతను పాటించాలని ఆమె స్పష్టం చేశారు. భూముల రీ సర్వేకు సంబంధించిన ప్రతి దశను బాధ్యతాయుతంగా నిర్వహిస్తూ, ప్రభుత్వ మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటించాలని జిల్లా కలెక్టర్ ప్రియాంక అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ శ్రీను, ఆర్డీవో రమేష్, సర్వే ల్యాండ్ ఏ.డీ. వేణుగోపాల్ రెడ్డి పాల్గొన్నారు.

# తెలంగాణ పబ్లిక్ స్కూల్‌తో కాజీపేటకు విద్యా వెలుగులు!

- **రూ.10 కోట్లతో తెలంగాణ పబ్లిక్ స్కూల్ మంజూరు**
- **ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డికి కాంగ్రెస్ నాయకుల కృతజ్ఞతలు**

**హనుమకొండ, అక్టోబర్ 14 (సమయం న్యూస్)**



కాజీపేట ప్రాంత విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు తెలంగాణ పబ్లిక్ స్కూల్ మంజూరు కావడంపై స్థానిక కాంగ్రెస్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ పాఠశాల మంజూరుకు కృషి చేసిన వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డిని బుధవారం కలిసి శాలువాతో సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు.కాజీపేటలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలను సుమారు రూ.10 కోట్ల అంచనా వ్యయంతో తెలంగాణ పబ్లిక్ స్కూల్‌గా అభివృద్ధి చేయనున్న నేపథ్యంలో ఈ ప్రాంత విద్యార్థులకు మెరుగైన విద్యావకాశాలు అందుబాటులోకి వస్తాయని కాంగ్రెస్ నాయకులు పేర్కొన్నారు. ముఖ్యంగా పేద, మధ్యతరగతి కుటుంబాల పిల్లలకు నాణ్యమైన విద్యను అందించేందుకు ఈ పాఠశాల దోహదపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగ అభివృద్ధికి ప్రాధాన్యమిస్తూ ప్రజలకు ఉపయోగపడే నిర్ణయాలు తీసుకుంటోందని నాయకులు తెలిపారు. కాజీపేటలో పాఠశాల ఏర్పాటుకు చొరవ చూపిన ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డికి కాజీపేట ప్రజలు, కాంగ్రెస్ పార్టీ నాయకుల తరఫున ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. భవిష్యత్తులోనూ ప్రాంత అభివృద్ధికి సహకరించాలని కోరారు.ఈ కార్యక్రమంలో హనుమకొండ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు మహమ్మద్ అంకుష్, జిల్లా కాంగ్రెస్ కార్యదర్శి పసునూరి మనోహర్, మాజీ కార్పొరేటర్ అబుబకర్, విజయశ్రీ రజాలి, సుంచు అశోక్, ఎన్ఎస్‌యూఐ మాజీ జాతీయ కోఆర్డినేటర్ రహమతుల్లా మహమ్మద్, 62వ డివిజన్ అధ్యక్షుడు పాలడుగుల ఆంజనేయులు, బుర్ర బాబురావు తదితరులు పాల్గొన్నారు.

# ఆగండి.. ఆలోచించండి.. అడుగు వేయండి"

- **సైబర్ భద్రతా అవగాహన వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించిన జిల్లా ఎస్పీ డాక్టర్ జి. వినీత్ IPS**

**నారాయణపేట, అక్టోబర్,14(సమయం న్యూస్)**

భారత ప్రభుత్వం, కేంద్ర హోంశాఖ (MHA) సూచనల మేరకు అక్టోబర్ 2026ను జాతీయ సైబర్ సెక్యూరిటీ అవేర్‌నెస్ మంత్‌గా నిర్వహిస్తున్న నేపథ్యంలో, తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా "పాజ్ ఫర్ సేఫ్టీ - పాజ్. థింక్. వెరిఫై..." అనే నినాదంతో ప్రజలకు సైబర్ భద్రతపై విస్తృత అవగాహన కల్పిస్తున్నారు.ఈ సందర్భంగా నారాయణపేట జిల్లా ఎస్పీ కార్యాలయంలో ఎస్పీ డాక్టర్ వినీత్ IPS, సైబర్ క్రైమ్ ఇంచార్జ్ డీఎస్పీ కాజల్ లు ఆగండి.. ఆలోచించండి.. అడుగు వేయండి అనే సైబర్ భద్రతా అవగాహన పోస్టర్‌ను ఆవిష్కరించారు. జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ప్రధానంగా పార్ట్‌టైమ్ జాబ్ ఫ్రాడ్‌లు, లోన్ యాప్ మోసాలు, ఆన్‌లైన్ షాపింగ్ మోసాలు, నకిలీ లింకులు, ఫిషింగ్ సందేశాలు, డిజిటల్ చెల్లింపుల మోసాలు తదితర సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించనున్నారు.అక్టోబర్ నెలంతా జిల్లాలోని పాఠశాలలు, కళాశాలలు, విద్యాసంస్థలు, మార్కెట్లు, షాపింగ్ మాల్స్, సూపర్ మార్కెట్లు, కమ్యూనిటీలు, నివాస సంక్షేమ సంఘాలు, మతపరమైన ప్రదేశాలు, ప్రజలు అధికంగా గుమికూడే ప్రాంతాల్లో సైబర్ భద్రతపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నారు.అలాగే దసరా, బతుకమ్మ వేడుకలు, ఇతర ప్రజా కార్యక్రమాలను సద్వినియోగం చేసుకొని పెద్ద సంఖ్యలో ప్రజలకు సైబర్ భద్రతా సూచనలు అందించనున్నారు. అవగాహన ర్యాలీలు, వాకథాన్‌లు, సైకిల్ ర్యాలీలు, వీధి నాటకాలు, స్కిట్లు, పోస్టర్ ప్రదర్శనలు, క్విజ్‌లు, ప్రతిజ్ఞ కార్యక్రమాలు, సోషల్ మీడియా ప్రచారాల ద్వారా సైబర్ నేరాల పట్ల ప్రజల్లో అప్రమత్తత పెంపొందించనున్నారు.సైబర్ మోసానికి గురైన వెంటనే ఆలస్యం చేయకుండా 1930 సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్‌కు సమాచారం అందించాలని, అలాగే "నేషనల్ సైబర్ క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్" (https://cybercrime.gov.in ద్వారా ఫిర్యాదు చేయాలని ప్రజలకు సూచించారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ... ప్రజలు




సైబర్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, గుర్తుతెలియని వ్యక్తుల నుంచి వచ్చే ఫోన్ కాల్స్, సందేశాలు,అనుమానాస్పద లింకులు, ఆన్‌లైన్ పెట్టుబడి అవకాశాలు, ఉద్యోగ ప్రకటనలు నమ్మి వ్యక్తిగత వివరాలు, బ్యాంకు ఖాతా వివరాలు, ఓటీపీలు ఎవరికీ వెల్లడించకూడదని సూచించారు. ఏదైనా అనుమానాస్పద కాల్, మెసేజ్ లేదా ఆన్‌లైన్ లావాదేవీ ఎదురైనప్పుడు తొందరపడి స్పందించకుండా, దాని నిజానిజాలను నిర్ధారించుకున్న తర్వాతే ముందడుగు వేయాలని తెలిపారు.ఆగండి.. ఆలోచించండి.. అడుగు వేయండి అనే సందేశాన్ని ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలని, సైబర్ నేరాల పట్ల అవగాహన కలిగి ఉండటమే మోసాల నుంచి రక్షణ పొందడానికి తొలి అడుగు అని ఎస్పీ పేర్కొన్నారు. సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉంటూ, అనుమానాస్పద కార్యకలాపాలను వెంటనే పోలీసుల దృష్టికి తీసుకురావాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. నారాయణపేట జిల్లా పోలీస్ శాఖ ప్రజల సైబర్ భద్రతకు కట్టుబడి ఉంది అని ఆయన తెలిపారు .ఈ కార్యక్రమంలో ఎస్ బి ఎస్సై భాగ్యలక్ష్మి రెడ్డి, D4C టీమ్ రమేష్, పవన్ పాల్గొన్నారు.

# బ్యాడ్మింటన్ విజేత 'కృష్ణ'కు ఘన సన్మానం

- **క్రీడాకారుల విజయాలు గర్వకారణం..నిత్యం సాధన చేయాలి... బొద్దిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి**

**హనుమకొండ, అక్టోబర్ 14 (సమయం న్యూస్)**



కరీంనగర్‌లో నిర్వహించిన వెటరన్ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్‌లో విజేతగా నిలిచిన గూడెల్లి కృష్ణను బుధవారం హనుమకొండలోని జేఎన్ఎస్ స్టేడియంలో తెలంగాణ బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు, టీపీసీ ప్రధాన కార్యదర్శి బొద్దిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ జేఎన్ఎస్ స్టేడియంలో శిక్షణ పొందిన క్రీడాకారులు వివిధ పోటీల్లో పతకాలు సాధించడం గర్వకారణమన్నారు. క్రీడాకారులు ప్రతిరోజూ ఉదయం క్రమం తప్పకుండా బ్యాడ్మింటన్ సాధన చేయాలని సూచించారు. క్రీడలతో శారీరక దృఢత్వంతో పాటు మానసిక ఉల్లాసం కలుగుతుందని తెలిపారు. వ్యాయామం ఆరోగ్య పరిరక్షణకు దోహదపడుతుందని, అందరూ శారీరక శ్రమకు ప్రాధాన్యమివ్వాలని పిలుపునిచ్చారు. బ్యాడ్మింటన్ సాధనతో పాటు నిత్య వ్యాయామంపై ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు.ఈ కార్యక్రమంలో తమ్మడపెల్లి రాజు, డాక్టర్ రవికుమార్, గడ్డం కేశవమూర్తి, కొలుగూరి ప్రభాకరరావు, విక్రంరెడ్డి, వేణుగోపాల్‌రావు, పీసు రాజారెడ్డి, కొమాకుల మధు, చందు, వీసం సురేందర్‌రెడ్డి, జూనియర్ కోచ్ రాజు, సూర్యనారాయణ, ఆర్కే రాజు, డాక్టర్ వెంకట్, కె. సత్యనారాయణరెడ్డి, రమణారెడ్డి, శశి, రఘువీర్‌రెడ్డి, తిరుపతి, రాజుప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# సద్దుల బతుకమ్మకు పకడ్బందీ ఏర్పాట్లు!

- **మహిళలకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలి**
- **వేడుకల ప్రాంగణం, నిమజ్జన స్థలాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి**

**పరకాల, అక్టోబర్ 14 (సమయం న్యూస్)**

తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే సద్దుల బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. పరకాల పట్టణంలోని గొర్ల అంగడి మైదానంలో నిర్వహించనున్న వేడుకల ఏర్పాట్లను అధికారులతో కలిసి ఆయన పరిశీలించారు.వేడుకలకు హాజరయ్యే మహిళలు, ఆడపడుచులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన సౌకర్యాలు కల్పించాలని సూచించారు. మైదానంలో పారిశుధ్యం, తాగునీరు, విద్యుత్ దీపాల ఏర్పాటు తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. మహిళా సోదరీమణులకు స్వాగతం పలికేలా హోర్డింగులు ఏర్పాటు చేయాలని తెలిపారు.అనంతరం దామెర చెరువు వద్ద బతుకమ్మ నిమజ్జన ఏర్పాట్లను పరిశీలించారు. బతుకమ్మ పండుగను మహిళలు, ఆడపడుచులు ఆనందోత్సాహాల మధ్య ప్రశాంత వాతావరణంలో జరుపుకునేలా సంబంధిత



శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఎమ్మెల్యే సూచించారు. వేడుకలు, నిమజ్జనం సజావుగా జరిగేలా అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని పేర్కొన్నారు.

# స్వధార్ హోమ్‌లో హక్కుల పాఠాలు.. బతుకమ్మ ఆటలు..

- **హక్కులపై అవగాహన.. బతుకమ్మతో ఆత్మీయ సంబరం!**
- **బతుకమ్మ బతుకుల్లో భరోసా.. న్యాయమూర్తి 'కందుకూరి పూజ'**
- **విద్య, భద్రత, సమానత్వంపై న్యాయ సేవాధికార సంస్థ అవగాహన కార్యక్రమం**

**వరంగల్, అక్టోబరు 14 (సమయం న్యూస్)**




బాలికలు, మహిళలు తమ హక్కులపై అవగాహన కలిగి ఉండాలని, అన్యాయం, వేధింపులు, వివక్ష ఎదురైనప్పుడు ధైర్యంగా సంబంధిత అధికారులను సంప్రదించాలని వరంగల్ జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, న్యాయమూర్తి కందుకూరి పూజ సూచించారు. అంతర్జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా బుధవారం కాశీబుగ్గలోని స్వధార్ హోమ్‌లో బాలికలు, మహిళల హక్కులు, రక్షణ, విద్య, ఆరోగ్యం, సమానత్వంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా కందుకూరి పూజ మాట్లాడుతూ బాలికల విద్య, భద్రత, స్వావలంబనకు ప్రాధాన్యమివ్వాలని పేర్కొన్నారు. బాల్యవివాహాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. స్వధార్ హోమ్‌లో ఆశ్రయం పొందుతున్న మహిళలతో మాట్లాడి, వారి సమస్యలు, ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. అర్హులైన వారికి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ద్వారా ఉచిత న్యాయ సహాయం అందుబాటులో ఉంటుందని వివరించారు.అనంతరం స్వధార్ హోమ్‌లో బతుకమ్మ వేడుకలను ఆనందోత్సాహాల మధ్య నిర్వహించారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగ విశిష్టతను చాటుతూ మహిళలు, హోమ్ సిబ్బంది వేడుకల్లో పాల్గొన్నారు.బాలికలు, మహిళల హక్కుల పరిరక్షణతో పాటు వారిలో ఆత్మవిశ్వాసం పెంపొందించి, సామాజిక భద్రత కల్పించేందుకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో నిరంతరం అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.ఈ కార్యక్రమంలో లీగల్ ఎయిడ్ కౌన్సెల్ ఆర్. సురేష్, స్వధార్ హోమ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు